RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 17 ఆగస్ట్ 2025 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:66

## వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉంచాలి

**ఎన్ డి ఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలి**

**ఎప్పటికప్పుడు జలాశయాలను అధికారులు పరిశీలిస్తూ ఉండాలి**

**భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ ఆగస్టు 16 వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉంచాలని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎన్ డిఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలని అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో సిఎం మాట్లాడారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చారు. వాగులు పొంగే ప్రమాదమున్న జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని సూచించారు. జలాశయాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, నీటి విడుదలపై కలెక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి ముందస్తు సమాచారం ఇవ్వాలని రేవంత్ తెలియజేశారు.ర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని, నగర, పురపాలక, గ్రామాల పరిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు తగినన్ని ఔషధాలు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులతో చెప్పారు. హైదరాబాద్ లో ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను వెంటనే పరిష్కరించాలని, జిహెచ్ఎంసి, హైడ్రా, ఎస్డిఆర్ఎఫ్, అగ్ని మాపకశాఖ తక్షణమే స్పందించాలని రేవంత్ రెడ్డి కోరారు.

## రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పరిశీలించాలని క్రమశిక్షణ కమిటీకి సిఫారసు

**మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి**



హైదరాబాద్ ఆగస్టు 16 : తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారని మునుగోడు నియోజక వర్గం అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా వివక్ష చూపిస్తున్నారని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏ ఉద్దేశంతో అన్నారో తెలుసుకుంటామని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పరిశీలించాలని క్రమశిక్షణ కమిటీని ఆదేశించామని, రాజగోపాల్ రెడ్డి వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందని తెలియజేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో త్వరలో స్పష్టత వస్తుందని, మార్వాడీలు మనలో ఒకరని, వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## అందే శ్రీ,గద్దర్ తెలంగాణ ప్రజల స్వేచ్ఛ ను ఆకాంక్షించారు

**హసిత భాష్పాలు పుస్తక ఆవిష్కరణ సభ లో సీఎం రేవంత్ రెడ్డి**



పుస్తక రచయిత శ్రీరామ్ పాలమూరు బిడ్డ కావడం సంతోషం..,
తెలంగా సమాజం కవులకు స్ఫూర్తి ని ఇచ్చిన గడ్డ
నిజమైన ఉద్యమకారులు ఎవరూ నేను ఉద్యమకారుడిని అని చెప్పుకోరు ..
అందే శ్రీ ఎప్పుడు నేను ఉద్యమకారుడిని అని చెప్పుకోలేదు
ఉద్యమకారుడిని అని చెప్పుకున్న వాళ్లకు టీవీ లు,పేపర్లు,వేలకోట్ల ఆస్తులు వచ్చాయి ..
మేం ఉద్యమకారులం కాదు..గాలి ఎటు వీస్తే అటు వెళ్ళే రాజకీయ నాయకులం
గూడ అంజయ్య,అందే శ్రీ,గద్దర్,గోరేటి వెంకన్న లాంటి కవులు తెలంగాణ ప్రజల్లో స్ఫూర్తి నింపారు..
అందే శ్రీ,గద్దర్ తెలంగాణ ప్రజల స్వేచ్ఛ ను ఆకాంక్షించారు
నేను ఎవరిని శత్రువు గా చూడను..నేను శత్రువు గా చూడాలంటే వారి కి ఆ స్టాయి ఉండాలి
2006 నుంచి ప్రారంభమైన నేను 17 ఏళ్ల లో ముఖ్యమంత్రి అయ్యాను
తెలంగాణ ప్రజలు నాకు ఇచ్చిన అవకాశాన్ని వారి అభ్యున్నతి కోసం ఉపయోగిస్తా..
నాకు నచ్చని వారిపైన అధికారాన్ని ఉపయోగించే మూర్ఖుణ్ణి కాదు..
తెలంగాణ ప్రజలు నాపైన పెద్ద బాధ్యత పెట్టారు
నా గెలుపే నా ప్రత్యర్థులకు దుఃఖం
నేను సీఎం గా సంతకం పెట్టడం వాళ్ల గుండెలపైన గీత పెట్టినట్లు
109 దేశాల నుంచి వచ్చిన సుందరీమణులతో జయ జయ హే తెలంగాణ పాట పాడించాను..ఇంత కంటే ఇంకా ఏం కావాలి?
తెలంగాణ తల్లి ముందు వారిని మోకారిల్లే లా చేశాను భవనాలు ఎవరైనా కడతారు..అద్దాల మేడలు,రంగుల గోడలు అభివృద్ధి కాదు
పేదలు ఆత్మగౌరవం తో తలెత్తు కోవడమే అభివృద్ధి..
4 లక్షల ఇందిరమ్మ ఇళ్లతో పేదలు ఆత్మగౌరవం తో బతుకనున్నారు
రేషన్ కార్డు లు,సన్నబియ్యం తో పేదల ఆత్మగౌరవం పెంచాం
వ్యక్తిగత ప్రయోజనాల కోసం నా పదవిని వాడను,పేదల కోసమే పని చేస్తా
తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా
2047 నాటికి తెలంగాణ ను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే నా లక్ష్యం..
ప్రపంచం లో గొప్ప రాష్ట్రం గా తెలంగాణ ను మరుస్తా..

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురువేయాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:**మినిస్టర్ క్వార్టర్స్ లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనీ ఎర్రగడ్డ డివిజన్ బూత్ ఇన్చార్జి లు , ముఖ్య నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం
సమావేశంలో పాల్గొన్న అజారుద్దీన్ ,కూడా చైర్మన్ ఇనగాళ వెంకట్రామిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్‌గా గుత్తా అమిత్ రెడ్డి,NSUI రాష్ట్ర అధ్యక్షుడు వెంకట స్వామి ,బూత్ ఇంచార్జి లు , ముఖ్య నేతలు
జూబ్లిహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలిఎర్రగడ్డ డివిజన్ లో నేతలంతా ఐక్యంగా పని చేయాలి..అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పని చేయాలిఎర్రగడ్డ డివిజన్ కో ఆర్డినేషన్ కమిటీ ,బూత్ కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలి
ఎర్రగడ్డ డివిజన్ లో ఉన్న ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తాం..
డివిజన్ లో ఉన్న 46 బూత్ లకు బూత్ ల వారిగా సమస్యల పై ప్రజల నుండి స్వీకరిద్దాం..
ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా..పెండింగ్ లో ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలని జీహెచ్ ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్ లను తీసుకొని డివిజన్ లో పర్యటిస్తాడివిజన్ లో స్వయంగా నేనే పాదయాత్ర చేస్తూ సంబధిత అధికారులతో సమస్యలు తెలుసుకునీ పరిష్కరిస్తా.
ప్రజా పాలన ప్రభుత్వం లో అమలు చేస్తున్న పథకాలు ఇంటిటా తీసుకుపోవాలి.. గత 10 సంవత్సరాలుగా నూతన రేషన్ కార్డులు,సన్న బియ్యం పంపిణీ ,ఇందిరమ్మ ఇళ్లు ,హైదరాబాద్ నగర అభివృద్ధి,రోడ్ల నిర్మాణాలు,నాళాలు అభివృద్ధి అంశాలు గడప గడప కు ప్రజల్లోకి తీసుకోవాలి

## వాజపేయి నాయకత్వంలో ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచిన భారత్

## బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**హైదరాబాద్ ఆగస్టు 16 అటల్ బిహారీ వాజపేయి పుణ్యతిథి సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు వాజపేయి గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాజ్ పేయి విశిష్ట సేవలను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు , రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రా రెడ్డి , రాష్ట్ర కార్యదర్శులు డా. ఎస్. ప్రకాష్ రెడ్డి , మాధవి , సీనియర్ నాయకుడు మర్రి శశిధర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ అటల్ బిహారీ వాజపేయి ఒకసారి 13 రోజులు, మరోసారి 13 నెలలు, తర్వాత నాలుగున్నర సంవత్సరాలు ప్రధానమంత్రిగా పనిచేశారు. ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచింది. ఆర్థికంగా కూడా దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాలన ఒక నిదర్శనం.గ్రామీణ సడక్ యోజన, ప్రధానమంత్రి స్వర్ణ చతుర్భుజ ప్రాజెక్ట్ ద్వారా జాతీయ రహదారులు, ఎయిర్‌పోర్టులు వంటి అనేక మౌలిక వసతుల నిర్మాణాలు జరిగాయి.పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించిన సమయంలో ప్రపంచంలోని అనేక దేశాలు భారత్‌పై ఆంక్షలు విధించాయి. అయినప్పటికీ వాజపేయి గారి నాయకత్వంలో ఏమాత్రం వెనుకడుగు వేయకుండా దేశాన్ని ఆర్థికంగా ముందుకు నడిపించారు.వాజపేయి గారి పాలనను భారతదేశ చరిత్రలో స్వర్ణయుగంగా పరిగణిస్తారు.

బియ్యం, గోధుమల వంటి ముఖ్యమైన ధాన్యాల సరఫరా, ఎగుమతి వ్యవస్థలో మార్పులు ఆయన పాలనలోనే చోటుచేసుకున్నాయి.వాజపేయి గారి జయంతిని ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వం మరియు బిజెపి "గుడ్ గవర్నెన్స్ డే"గా నిర్వహిస్తోంది.వాజపేయి గారు స్వయంసేవక్ సంఘ్ ప్రచారకుడిగా తన జీవితం ప్రారంభించి, ఆర్ఎస్ఎస్ నుంచి భారతీయ జనతా పార్టీలో చేరి దేశ ప్రధానిగా కావడం ఆయన అసామాన్య వ్యక్తిత్వానికి నిదర్శనం.అలాంటి గొప్ప వ్యక్తులను తీర్చిదిద్దిన ఆర్ఎస్ఎస్‌కు మనమంతా రుణపడి ఉన్నాం.

వాజపేయి గారి లాంటి మహనీయులను దేశానికి అందించిన ఆర్ఎస్ఎస్, ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిలాంటి నాయకులను కూడా తీర్చిదిద్దింది.రహదారుల నిర్మాణం ద్వారా దేశాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించిన వాజపేయి గారు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన దార్శనిక నాయకుడు.కొందరు ఆర్ఎస్ఎస్‌పై తప్పుగా మాట్లాడుతున్నారు.

కానీ ఆర్ఎస్ఎస్ భారతదేశంలో పుట్టిన, భారతదేశం కోసం పుట్టిన సంస్థ. విమర్శకుల్లా చైనా, పాకిస్థాన్ ప్రయోజనాల కోసం మాట్లాడే పార్టీ కాదు.పేదలకు ఇండ్లు కల్పించాలనే సంకల్పంతో వాజపేయి గారు వాంబే అనే పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో దత్తాత్రేయ పార్లమెంట్ సభ్యులుగా ఉండగా, ఈ పథకం కింద అనేక మంది పేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చారు. ఇప్పటికీ వారు ఆ ఇళ్లలో నివసిస్తూ లబ్ధి పొందుతున్నారు.కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయాయి.

స్వాతంత్ర్య దినోత్సవం రోజున సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టారు. రూ.22,500 కోట్లు కేటాయించి ఇండ్లు నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లు కడతామని హామీ ఇచ్చింది. కానీ 19 నెలలు గడిచినా ఇప్పటి వరకు ఇండ్లు ఇచ్చిన దాఖలాల్లేవు. నిజమైన పేదలకు ఇండ్లు ఇవ్వకుండా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించే ప్రయత్నం జరుగుతోంది. దీని వలన అర్హులైన పేదలు మోసపోతున్నారన్నారు..అటల్ బిహారీ వాజపేయి గారు ఆదర్శపురుషుడు. ఆయన పాలన మనకు స్ఫూర్తి, మార్గదర్శనం. బిజెపి కార్యకర్తలు మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడు, ప్రతి రాజకీయ నాయకుడు కూడా ఆయన ఆశయబాటలో నడవడానికి కృషి చేయాలని నేను రామచంద్రా రావు కోరారు.

ప్రజాబలం

17 ఆగస్ట్ 2025 ఆదివారం

# ఇక జియో పొలిటికల్ షిఫ్ట్..

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు అంటూ ఉండరంటారు కదా.. అయితే ఇది కొన్ని సందర్భాల్లో దేశాలకూ వర్తిస్తుంటుంది. ప్రత్యర్థిగా భావిస్తున్న దేశాలతోనే జట్టుకట్టే పరిస్థితి ఉండొచ్చు. ఇప్పుడు భారత్ ? చైనా బంధం చూస్తుంటే ఇదే నిజమనిపిస్తోంది. ఓవైపు ట్రంప్ దూకుడు భారత్, చైనాకు చాలానే కలిసి వస్తోంది. జియోపొలిటికల్ షిఫ్ట్ అనేది ఒకటి ఉంటుంది. ట్రంప్ కారణంగా ఇది వర్కవుట్ అవుతోంది.భారత్ చైనా మధ్య స్నేహబంధం. ఒక నమ్మకం సరికొత్త బంధానికి పునాది వేస్తుంది. ఒక అవకాశం.. సత్సంబంధాలను పెంచుతుంది. ఒక అవసరం కలిసి నడిచేలా చేస్తుంది. ఇది ఇప్పుడు భారత్ చైనాకు వర్తిస్తుంది. ఎందుకంటే 2020లో గాల్వన్ లోయలో ఘర్షణ తర్వాత కథ అంతా మారిపోయింది. దూరం పెరిగింది. అయితే ఆ దూరం ఎప్పుడూ అలాగే ఉండదు కదా. ఇటీవలి పరిస్థితులు కలిసి వచ్చాయి. రెండు దేశాల మధ్య మళ్లీ కొత్తబంధం చిగురించేలా చేశాయి. భారత ఉత్పత్తులపై ట్రంప్ 50 శాతం టారిఫ్ లు విధించిన తర్వాత ఈ రెండు దేశాలు దగ్గరవుతున్నాయని ఇప్పుడు అనుకుంటున్నారు. అయితే మార్చిలో చైనాపై 20 శాతం ట్రంప్ టారిఫ్ లు విధించినప్పుడే చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. అమెరికా ఓవరాక్షన్ కు చెక్ పెట్టేందుకు, పవర్ పాలిటిక్స్ ను అడ్డుకునేందుకు కలిసి పని చేద్దామన్నారు. అప్పటి నుంచే భారత్ ? చైనా మధ్య పరిస్థితులు అనుకూలించడం మొదలైంది. చెప్పాలంటే మొదట ఒక మెట్టు చైనానే దిగింది. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి రాక. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఢిల్లీకి వస్తున్నారు. జాతీయ భద్రతా సలహాదారు దోవల్ తో భేటీ అవుతారు. ఈనెల 31న ప్రధాని మోడీ చైనా పర్యటన కంటే ముందుగానే ఈ పరిణామం చోటు చేసుకుంటుండడం ఆసక్తికరంగా మారుతోంది. ఎందుకంటే మాట్లాడుకునేవి చాలా ఉన్నాయి. పరిష్కరించుకునేవీ ఉన్నాయి. సో ఇటీవలి కాలంలో భారత్ చైనా ప్రతినిధులు, ప్రభుత్వ వర్గాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయి. రాజకీయంగా పరస్పర విశ్వాసం పెంచుకోవడం, సహకారాన్ని విస్తరించడం ఇవన్నీ రెండు దేశాల మధ్య బంధాన్ని మరో లెవెల్ కు తీసుకెళ్లేలా కనిపిస్తున్నాయి ట్రంప్ టారిఫ్ లకు చెక్ పెడుదామని చైనా ముందుకు రావడం, ప్రధాని మోడీ ఏడేళ్ల తర్వాత చైనాకు వెళ్లాలని డిసైడ్ అవడం, సరిహద్దు వాణిజ్యం మళ్లీ ప్రారంభించాలని అనుకోవడం, బార్డర్ లో పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించడం, డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభించాలనుకోవడం, చైనీస్ పౌరులకు టూరిస్టుల వీసాల మంజూరుపై ముందడుగు పడడం, చైనా కంపెనీల పెట్టుబడుల నిబంధనలను సడలించాలనుకోవడం ఇవన్నీ కీలక పరిణామాలుగా కనిపిస్తున్నాయ్. సరిహద్దు వాణిజ్యం మళ్లీ మొదలు పెట్టేలా చర్చలు. ఓవరాల్ గా చూస్తే భారత్ చైనా మధ్య సరిహద్దు వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాల్లో మెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఏర్పడిన ఉద్రిక్తతల నుంచి రిలీఫ్ కనిపిస్తోంది. ఈ సంబంధాలు పెరగడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలు, భారత్‌పై విధించిన అధిక టారిఫ్ లు కీలకంగా మారాయి. ఫస్ట్.. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత నిలిపేసిన సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఈ ట్రేడ్ ఉత్తరాఖండ్ లిపులేఖ్ పాస్, హిమాచల్ ప్రదేశ్ షిప్కీ లా పాస్, అలాగే సిక్కిం నాథు లా పాస్ ఇలా మూడు హిమాలయన్ సరిహద్దుల ద్వారా జరుగుతుంది. ఈ సరిహద్దు వాణిజ్యం విలువలో చిన్నదైనప్పటికీ రెండు దేశాల మధ్య సామాజిక ఆర్థిక సంబంధాలను మెరుగుపరచడంలో కీ సిగ్నల్ గా ఉంది. సో ఇది త్వరలో ప్రారంభించాలనుకోవడంపై చైనా రియాక్ట్ అయింది. ఈ వాణిజ్యంతో సరిహద్దు ప్రాంత వాసుల లైఫ్ క్వాలిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నది చైనా. 2020కి ముందున్న పెట్రోలింగ్ విధానం పునరుద్ధరణ. భారత్ చైనా మధ్య దౌత్యపరమైన పురోగతి కూడా కనిపిస్తోంది. 2024 అక్టోబర్‌లో కుదిరిన ఒప్పందంతో 2020కి ముందు ఉన్న పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించారు. ఐదేళ్ల తర్వాత ఇదొక కీలక ముందడుగుగా మారింది. అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 31న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ ? వాఅూ సమ్మిట్ కోసం చైనాకు వెళ్లనున్నారు. ఏడేళ్ల తర్వాత చైనా పర్యటనకు మోడీ వెళ్తుండడం ఇదే తొలిసారి. ఈ టైంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీ జరగనుంది. అటు 2020 నుండి నిలిపేసిన డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభం కానున్నాయి. రెడీగా ఉండాలని విమానయాన సంస్థలకు కేంద్రం సూచించింది కూడా. చైనాతో భారత్‌కు 85 బి. డాలర్ల వాణిజ్య లోటు. సో ఈ ప్రయత్నాలన్నీ ఆర్థిక దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక ముందడుగుగా మారుతాయి. వాణిజ్యం, చర్చలను తిరిగి ప్రారంభించడం ద్వారా రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించడానికి సహకారాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడనున్నాయి. అటు వాణిజ్య బంధంపైనా ఫోకస్ పెడుతున్నాయి. 2023-24లో భారత్‌కు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ద్వైపాక్షిక వాణిజ్యం 118.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అయితే ఇండియా 85 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును ఎదుర్కొంటోంది. దీనిని తగ్గించేందుకు చైనాలో మన మెడిసిన్స్, అలాగే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ యాక్సెస్‌ను పెంచాలని భారత్ కోరుతోంది. సో రాబోయే రోజుల్లో అన్నీ జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికాను ఎదుర్కోవడం చైనాకు కీలకం. అందుకు భారత్ సపోర్ట్ కావాలి. అదే సమయంలో మన ప్రాధాన్యతలకు మనకు ఉన్నాయి. అయితే చైనాను పూర్తిగా నమ్మకుండా జాగ్రత్తగా వ్యవహరించడమే కీలకమైన విషయం. ట్రంప్ టారిఫ్‌లతో మారిన కథ. కొన్ని అవకాశాలు ఆటోమేటిక్ గా కలిసి వస్తాయి. ఇప్పుడు భారత్ చైనా సంబంధాల మెరుగువడంలో కూడా చాలానే కలిసి వచ్చాయి. ఈ రెండు దేశాల దౌత్య సంబంధాలకు ఈ ఏప్రిల్ లో 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ సందర్భంగా చైనా అధ్యక్షుడు, భారత రాష్ట్రపతి పరస్పర అభినందనలు తెలుపుకోవడం దగ్గర్నుంచి ఇప్పుడు స్ట్రాటజిక్ రీ సెట్ దాకా చాలా పరిణామాలు జరుగుతున్నాయ్. రష్యా నుంచి ఆయిల్, ఆయుధాలు కొనడం ఆపకపోతే భారత్ పై 50 శాతం టారిఫ్ లు వేస్తానని ట్రంప్ ప్రకటించిన తర్వాత కథ మారింది. ఇది భారత్ అమెరికా సంబంధాలపై చాలా ఎఫెక్ట్ చూపింది. ఓవైపు పాకిస్తాన్ ను అమెరికా దగ్గర తీస్తోంది. ఇటు భారత్ చైనా మధ్య పొలిటికల్ షిఫ్ట్ కనిపిస్తోంది. చైనాపై 20 శాతం సుంకాలు, భారత్ పై 50 శాతం సుంకాలు విధించారు ట్రంప్. దీంతో ఈ రెండు దేశాలు అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టే దిశగా కదులుతున్నాయి. తాజాగా ప్రధాని మోడీ ఇండిపెండెన్స్ డే స్పీచ్ లోనూ మనం ప్రపంచ మార్కెట్లలో మన సత్తా చాటుకోవాల్సిన టైం వచ్చిందని గుర్తు చేశారు. భారత్ ? చైనా వాణిజ్య సంబంధాల మెరుగుదల. ట్రంప్ అమెరికా ఫస్ట్ అన్న విధానం అలాగే అధిక సుంకాలు భారత్ ? చైనా మధ్య వాణిజ్య సంబంధాలు పెరగడంలో కీలక పాత్ర పోషించింది. సో తమ ఉత్పత్తులకు అమెరికా చెక్ పెడితే.. భారత్ మాత్రం అన్ని ప్రత్యామ్నాయ ఆప్షన్లు చూస్తోంది. అందుకే డైవర్సిఫికేషన్ రూల్ ఫాలో అవుతోంది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడికి ఉత్పత్తుల్ని షిఫ్ట్ చేసే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగానే చైనాతో వాణిజ్య బంధంపై ముందడుగు వేస్తోంది. చైనీస్ పెట్టుబడులపై ఆంక్షలను సడలించడం, వాణిజ్య మార్గాలను తెలవడం వంటి చర్యలకు ఓకే చెబుతోంది. క్లియర్ గా చెప్పాలంటే ట్రంప్ విధానాలు భారత్-చైనా సంబంధాలను స్ట్రాటజిక్ రీసెట్ వైపు నడిపిస్తున్నాయి. భారత్ అమెరికాతో బలమైన సంబంధాలను కొనసాగిస్తూనే, చైనాతో ఆర్థిక సహకారాన్ని పెంచడం ద్వారా ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. అందుకే ఇవన్నీ జరుగుతున్నాయి. అంతకు ముందు కైలాస శిఖర దర్శన, మానస సరోవర యాత్రకు అడ్డంకులు తొలగించారు.


# యాదగిరిగుట్ట రీ బిడెవలప్మెంట్ పనులకు రూ 56 కోట్లు

## శ్రీ గరుడ ట్రస్ట్, ఈబి ఆఫీస్ ప్రారంభం

## శ్రీ యాదగిరి ఆధ్యాత్మిక మాసపత్రిక ప్రారంభం

## హాజరైన మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న





యాదగిరిగుట్ట,ఆగస్టు16 తెలంగాణలో ప్రముఖమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వారి శ్రీ యాదగిరి ఆధ్యాత్మిక మాస పత్రికను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు . ఆలయ మర్యాదలతో దేవస్థానం వీరందరికీ స్వాగతం పలికింది .దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. టీటీడీ శ్రీ వాణి ట్రస్ట్ మాదిరిగా ప్రారంభించిన శ్రీ గరుడ ట్రస్టును విరాళాల రూపేనా నిర్వహిస్తారు. ఈ ట్రస్ట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని శ్రీ స్వామివారి ప్రసాద వితరణకు, భక్తులకు ఉచిత వైద్య సేవలకు, అదే విధంగా సమీప పేద విద్యార్థుల ఉచిత విద్య, వైద్య సేవలకు డబ్బులు వినియోగిస్తారు. అయితే ట్రస్ట్ కు సంబంధించి టికెట్ల విక్రయం పై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇక ఈ బిఆఫీసు ద్వారా దేవస్థానం కార్యాలయం పేపర్ లెస్ గా మారనుంది. డిజిటల్ విధానంలో పరిపాలన కొనసాగించనున్నారు.

రీబి డెవలప్మెంట్ పనులకు రూ 56 కోట్లు

ఆలయ పునర్నిర్మాణం అనంతరం భక్తుల సౌకర్యాల కల్పనకు 56 కోట్ల రూపాయలను ప్రభుత్వం అనుమతించిందని దేవస్థానం తెలిపింది. ఈ డబ్బుతో రీ బిడెవలప్మెంట్ వర్క్స్ చేయమన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ వెంకట్రావు, సలహాదారు గోవింద చారి ,జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డితో అసంఘటిత కార్మికుల సమావేశం ఏర్పాటు చేస్తాం

## మహేష్ కుమార్ గౌడ్






నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:గాంధీ భవన్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అఖిల భారత అసంఘటిత కార్మికులు,ఉద్యోగుల సమావేశం..

సమావేశానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కేకేసి నేషనల్ చైర్మన్ ఉదిత్ దిత్ రాజు.

ఈ కార్యక్రమంలో ఏఐసీసీ జెట్టి కుసుమ కుమార్, కేకేసి నేషనల్ వైస్ చైర్మన్ షేక్ ఇబ్రహీం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు.

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కామెంట్స్.

దేశంలోని అన్నీ రకాల ప్రజలను , కార్మికులను ఆదుకోవాలని రాహుల్ గాంధీ బలమైన ఆలోచనతో ఆకాంక్షిస్తున్నారు.

అసంఘటిత కార్మికులు అత్యంత శ్రమ పడుతారు...కానీ సరియైన గుర్తింపు ఉండదు.

అసంఘటిత కార్మికుల శ్రమ ఎక్కువ.... ఆదాయం తక్కువ

అణగారిన వెనుకబడిన కార్మికులు ఎవరైనా ఉన్నారంటే అది అసంఘటిత కార్మికులు.

తెలంగాణలో ఈ కార్మికుల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన చేస్తున్నారు..

గతంలోనే అసంఘటిత కార్మికుల సాదక- బాదలు విన్నాం..

కార్మికులందరూ కష్టపడండి.. మిమ్మల్ని గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు.

మీ శ్రేయస్సు కోసం పార్టీ పరంగా సీఎంతో చర్చిస్తాం...

త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డితో అసంఘటిత కార్మికుల సమావేశం ఏర్పాటు చేస్తాం...

# పైప్లైన్ నిర్మాణం నాసిరకంగా జరిగింది

## సిబిఐతో ఎక్స్పర్ట్ కమిటీ తో గాని విచారణ జరిపించాలి

## రాజ్ ఠాకూర్ ఎమ్మెల్యే రామగుండం





రామగుండం ప్రజాబలం ప్రతినిధి:ఆర్ఎస్ఎల్ ప్లాంట్ 2021 లో ప్రారంభమైనప్పటి నుండి అమ్మోనియా పైప్ లైన్ లీకేజీ వలన ఫ్యాక్టరీ తరచూ షడ్ డౌన్ అయ్యి ప్రొడక్షన్ ఆగిపోతా ఉంది రెండవది పైప్లైన్ నిర్మాణం నాసిరకంగా జరిగింది దీనివలన అమోనియా లీకేజీ ఏర్పడితే ఈ ప్రాంత ప్రజలకు ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది ఈ పైప్ లైన్ నిర్మాణ అవకతవకల మీద సిబిఐతో ఎక్స్పర్ట్ కమిటీ తో గాని విచారణ జరిపించాలి పైప్ లైన్ వేసిన ఈ ఈఐఎల్ కంపెనీ నుండి పెనాల్టీ వసూలు చేయాలి కన్స్ట్రక్షన్ అండ్ ఎలక్షన్ ప్రాబ్లమ్స్ ను వెంటనే సరి చేయాలి తెలంగాణకు యూరియా కొరత ఏర్పడుతుంది అన్ ప్రాజెక్టు నిర్మాణానికి క్లియరెన్స్ ఇచ్చి 11% పెట్టుబడి పెట్టి తెలంగాణ ప్రభుత్వం సహకరించిందన్న విషయం మర్చిపోకూడదు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 50% యూరియా ఇస్తామని చెప్పడం జరిగింది కానీ ఇప్పటివరకు 50% కాదు కదా కనీసం 40 శాతం కూడా ఇవ్వడం లేదు గత ఏడాది కంటే ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం తెలంగాణలో విపరీతంగా పెరిగింది అదనంగా యూరియా సరాపర చేయవలసింది పోయి గత సంవత్సరం కంటే తెలంగాణకు ఒక లక్ష టన్నుల యూరియా తగ్గించినారు మే జూన్ జూలై లో కోట సగం కూడా ఇవ్వలేదు ఆగస్టులో 65 వేల టన్నులు ఇవ్వవలసి ఉండగా కనీసం 20 వేల టన్నులే ఇచ్చారు మళ్లీ ప్లాంట్ షట్ డౌన్ అయింది జడల్డి జీరో లెవెల్ డిశ్చార్జ్ ప్లాంట్ ను ఉత్పత్తికి ముందే నిర్మించాలి కానీ నాలుగు సంవత్సరాలుగా టెండర్స్ కాల్ ఫర్ చేసి మీకు సంబంధించిన కాంట్రాక్టర్లకు రాలేదని వాయిదా వేసుకుంటూ వెళ్తున్నారు రామగుండం ప్రజలు పొల్యూషన్ తో ఇబ్బందులు పడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు వెంటనే జడలుడి ప్లాంట్ నిర్మాణం చేయాలని చెప్పేసి కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తా ఉన్నాం ప్రాజెక్టు నిర్మాణ లోపాలతోటి ఫ్రీక్వెంట్ గా షట్ డౌన్ అవుతుంది యూరియా లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు కావున ఆర్ ఎఫ్ సి ఎల్ సింగిల్ యూనిట్ ప్లాంట్ కాల్ చేయరు మాదిరిగానే నోయిడా నుండి కార్పొరేట్ ఆఫీసును ఢిల్లీలో కాకుండా రామగుండంకు తరలించాలని డిమాండ్ చేస్తా ఉన్నాం. ఎందుకంటే ఫ్యాక్టరీ రామగుండంలో ఉంటది ఆఫీసు హెడ్ ఆఫీస్ మాత్రం ఢిల్లీలో ఉంటది ప్రతి సంవత్సరం 20 కోట్ల రూపాయల సిఎస్ఆర్ ఇవ్వవలసి ఉండగా కేవలం ఒకకోటి పదిలక్షలు మాత్రమే సాంక్షన్ ఇవ్వడం జరిగింది వెంటనే సి ఎస్ ఆర్ నుండి 20 కోట్లు సాంక్షన్ చేయాలని చెప్పేసి డిమాండ్ చేస్తున్నాము రెగ్యులర్ ప్రాక్టీస్ లాగా కంపెనీ ఫండ్స్ లో సరౌండింగ్ అండ్ ఎఫెక్టెడ్ విలేజెస్ అండ్ కార్పొరేషన్ డివిజన్స్ లలో కంపెనీ ఫండ్స్ లో శానిటేషన్ స్ట్రీట్ లైట్స్ మెయింటినెన్స్ కూడా చేయాలని డిమాండ్ చేస్తా ఉన్నాం . పొల్యూషన్ తో ఎఫెక్ట్ అవుతున్న ప్రజల కోసం ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలి అలాగే వీర్లపల్లి గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ కింద ఇతర ప్రాంతాలకు తరలించి వారిని ఆదుకోవాలని చెప్పేసి కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తా ఉన్నాం .

# ఫలితాలొస్తున్నాయా...

విజయవాడ, ఆగస్టు 16, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయా? అంటే చెప్పలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుండటంతో ఆయనపై పెట్టుకున్న నమ్మకాలు మాత్రం నిజం కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు ప్రచారంలో ఇచ్చిన హామీలలో చాలా వరకూ అమలు చేసినప్పటికీ అభివృద్ధి విషయంలో చంద్రబాబు ప్రభుత్వం వెనకబడి ఉందన్న విషయం చెప్పక తప్పదు. ఇప్పటికీ చంద్రబాబు నాయుడు పద్దెనిమిది గంటలు పనిచేస్తున్నారు. అయినా రాష్ట్ర విభజన తర్వాత ఆయన వేస్తున్న అడుగులు ముందుకు పడటం లేదు. దానికి కారణం విడిపోయిన రాష్ట్రం కావచ్చు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ ను అభివృద్ధి చేయడానికి చంద్రబాబు నాయుడు పెద్దగా కష్టపడాల్సిన పనిలేకపోయింది. అందుకు వాతావరణ పరిస్థితులతో పాటు పారిశ్రామికంగా, వైద్య పరంగా అభివృద్ధి చెందిన నగరం హైదరాబాద్ కావడంతో పాటు నిజాం కాలం నుంచే హైదరాబాద్ ప్రత్యేకతను సంతరించుకోవడంతో చంద్రబాబు నాయుడు ఆలోచనలు, కార్యాచరణ కొంత ముందడుగు పడ్డాయి. హైదరాబాద్ లో పెద్ద కష్టం లేకుండా చంద్రబాబు నాయుడు సైబరాబాద్ ను నిర్మాణం చేశానని ఇప్పటికీ చెప్పుకుంటున్నారంటే అందుకు స్థల మహత్యం కూడా కారణమని చెప్పక తప్పదు. హైదరాబాద్ గత నలభై ఏళ్ల నుంచి పాలకులు ఎవరున్నా డెవలెప్ మెంట్ మాత్రం ఆగలేదు... ఇక అమరావతికి వచ్చే సరికి పూర్తి భిన్నమైన పరిస్థితి. సరైన రాజధాని లేదు. రాజధాని నిర్మాణం ఇంకా మొదలు కాలేదనే చెప్పాలి. గత ప్రభుత్వం మూడు రాజధానుల నిర్మాణం ప్రతిపాదన ముందుకు తేవడంతో గత పదేళ్ల నుంచి రాజధాని నిర్మాణం సాగడం లేదు. ఇప్పుడిప్పుడే పనులు మొదలవుతున్నాయి. రాజధాని నిర్మాణంలో మొదటి దశ పనులు పూర్తి కావాలంటే దాదాపు మూడేళ్లకు పైగానే సమయం పడుతుంది. ఇప్పటికే ఒక ఏడాది గడిచిపోయింది. మరో మూడేళ్లలో వరుణుడు, ప్రకృతి అనుకూలిస్తే పనులు సజావుగా సాగుతాయి. లేకుంటే మరింత ఆలస్యమయ్యే అవకాశాలు లేకపోలేదు. అందుకే చంద్రబాబు నాయుడు అనుకున్న లక్ష్యానికి ఇంకా దూరంగానే ఉన్నారని చెప్పాలి.

# వైసీపీ వాళ్లు చెప్పారు...
# టీడీపీ వాళ్లు చేసి చూపించారు

విజయవాడ, ఆగస్టు 16, పులివెందులలో జెడ్పీ ఎన్నికల్లో ఘోర పరాభవానికి కుప్పంలో లింక్ ఉందా..అప్పటి అత్యుత్సాహమే ఇప్పటి ఓటమికి కారణమైందా అన్నవిశ్లేషణలు వస్తున్నాయి. 2021 స్థానిక ఎన్నికల్లో కుప్పంను కొల్లగొట్టి.. వై నాట్ కుప్పం అంటూ చేసిన అతి చర్యలవల్లే ఇప్పుడు జగన్ పార్టీకి ఈ పరిస్థితి వచ్చిందని తెలుగుదేశం అంటోంది. వై నాట్ 175 అంటూ అప్పట్లో జగన్ కుప్పం ను కూడా కలుపుకునే అన్నారు. దానికి ప్రతిగా చంద్రబాబు వైనాట్ పులివెందుల అంటూ సవాల్ చేశారు.అప్పట్లో జగన్ అయినా.. చంద్రబాబు అయినా కూడా ముఖాముఖీగా వాళ్ల నియోజకవర్గాలను కూడా ఓడిస్తామని సవాల్ చేశారు. అది జరగలేదు కానీ.. ఏడాది తర్వాత పులివెందులలో వైసీపీని టీడీపీ చావు దెబ్బ కొట్టింది. వైఎస్ కుటుంబానికి ఓటమంటే తెలియని పులివెందులలో అదీ ఆ మండలంలో వైసీపీని డిపాజిట్ కూడా రాకుండా ఓడించడం వెనుక చాలా సంగతే ఉంది. క్యాడర్ కష్టపడిందా.. అధికారంతో అక్రమాలు చేసిందా.. ప్రత్యర్థులను భయపెట్టిందా.. లేక జగన్‌పైనే వ్యతిరేకత వచ్చిందా.. ఇలా ఎన్నిరకాల వాదనలున్నా.. సరే మొత్తానికి ఆన్ రికార్డ్ టీడీపీ అక్కడ గెలిచింది. దీనికి కారణం కుప్పం..సాధారణంగా ముఖ్యమంత్రి అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీలు అంత దృష్టి పెట్టవ్.. వాళ్లు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న నేత నియోజకవర్గంలో రాజకీయ ఫిరాయింపులని ప్రోత్సహించడం లాంటివి కూడా చేయరు.. అదంతా వైఎస్ చంద్రబాబు జమానా వరకూ సాగింది. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. 2017లో కడప జిల్లాలో బీటెక్ రవిని స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా టీడీపీ గెలిపించుకోగలిగింది. చంద్రబాబు తన జిల్లాలో రాజకీయం చేస్తే.. జగన్ ఏకంగా ఆయన నియోజకవర్గంలోనే చేశారు. 2021 స్థానిక ఎన్నికల్లో కుప్పం మునిసిపాలిటీతో పాటు.. నియోజకవర్గంలోని అన్ని జెడ్పీటీసీలను.. ఎంపీటీసీలను కూడా వైసీపీ కైవసం చేసుకుంది.పులివెందులో టీడీపీ దౌర్జన్యాలు చేసిందని.. ఓటర్లను బయటకు రానివ్వకుండా రిగ్గింగ్ చేసుకుందని వైసీపీ ఆరోపిస్తోంది. మరి ఆ రోజు.. కుప్పంలో జరిగింది కూడా అదే. కుప్పం మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయి. జర్నలిస్టులను కూడా కొట్టారు. ఆ నియోజకవర్గం మొత్తం టీడీపీ బయటకు రాకుండానే చేశారు.కుప్పంలో చంద్రబాబు అప్పటికే 7సార్లు ఎమ్మెల్యే. ప్రత్యర్థి పార్టీకి అంతగా పట్టు లేదు. కానీ 2021లో కుప్పం పరిధిలోని 89 పంచాయతీల్లో వైసీపీ 74చోట్ల గెలిచింది. నియోజకవర్గంలోని 4 మండలాలు వైసీపీ పరం అయ్యాయి. ఇక నాలుగు జెడ్పీటీసీ స్థానాల్లో అయితే.. ఏకంగా 17వేలు, 16వేలు, 11 వేల చొప్పున మెజార్టీలు వచ్చాయి. 68 ఎంపీటీసీ స్థానాల్లో 63 వైసీపీవే..! పెద్దిరెడ్డి కుప్పంలోనే క్యాంప్ వేసి మరీ ఎన్నికల్లో ఈ రిజల్ట్ తెప్పించారు. “చంద్రబాబు ఇలాకాలో 90శాతానికి పైగా సీట్లు అప్పట్లో వైసీపీ తన ఖాతాలో వేసుకుంది. మరిప్పుడు ఒక్క చోట ఓడిపోతేనే గగ్గోలు పెడుతున్నారు ఎందుకు” అంటూ టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. కుప్పంలో గెలుపొందిన వైసీపీ అక్కడితో ఆగలేదు.. చాలా అత్యుత్సాహం ప్రదర్శించింది. చంద్రబాబు ఓడిపోయాడని.. కూలిపోయాడని... ప్రచారం ప్రారంభించింది. జెడ్పీ ఓట్ల లెక్కల ప్రకారం చంద్రబాబు కంటే 62వేల ఓట్లు మెజార్టీ వచ్చిందని చెప్పింది. దీనికి కుప్పం మునిసిపాలిటీమెజార్టీ అదనం.. అది కూడా కలుపుకుంటే 75వేల ఓట్లు మెజార్టీ...వైనాట్ 175 స్లోగన్‌కు అదే బీజం కూడా..! అప్పట్లో నియోజకవర్గం మొత్తం కొల్లగొట్టిన వైసీపీ ఇప్పుడు రెండు జెడ్పీటీసీ ఓటములను జీర్ణించుకోలేకపోయింది.వైసీపీ లెక్క ప్రకారం చంద్రబాబుకు అప్పటికే ఉన్న మెజార్టీని దాటుకుని 75వేలు ఓట్లు పెరిగాయంటే.. దాదాపు లక్ష ఓట్లు టర్న్ అయినట్లు. కానీ 2024 రిజల్ట్ మాత్రం వేరు. చంద్రబాబు తనకు అంతకు ముందు వచ్చిన దానికంటే.. 18వేలు పెంచుకున్నారు. మరి ఈ లక్ష ఓట్లు ఏమయ్యాయి. ఇక జగన్ తనకు ఉన్న 90వేల మెజార్టీ నుంచి 60వేలకు పడిపోయారు. దీనిని బట్టే పులివెందులలో జగన్ ప్రాభవం తగ్గినట్లు కనిపిస్తోంది. అప్పట్లో కుప్పం ఒక్కదానితోనే ఆగలేదు.. జిల్లా మొత్తంలో 65 జెడ్పీ స్థానాలుంటే.. 65 వైసీపీనే గెలిచింది. ఇందులో ఏకంగా 33 స్థానాలు ఏకగ్రీవాలయ్యాయి. ఇలాంటి పరిస్థితి ఎంజాయ్ చేసిన వైసీపీ ఇప్పుడు రెండు ఓటములను తీసుకోలేకపోతోంది.కుప్పంలో జరిగిన హంగామాను తెలుగుదేశం చాలా సీరియస్‌గా తీసుకుంది. అందుకే పులివెందులను టార్గెట్ చేసింది. జగన్ నేరుగా ఓడించడం సాధ్యం కాదు అని తెలిసి.. అక్కడ దెబ్బకొట్టడానికి తగిన అవకాశం కోసం చూసింది. మరో ఏడాదిలోనే స్థానిక ఎన్నికలున్నాయి. మామూలుగానే టీడీపీ స్థానిక ఎన్నికలను వేగంగా పెట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపఎన్నిక పెట్టడం.. అది కూడా పులివెందులలో పెట్టడం అంటే ఓ రకంగా రిస్క్ తీసుకున్నట్లు అర్థం. లోకేష్ నేరుగా ఇన్వాల్వ్ అయి... పులివెందుల ఎన్నికకు చొరవ చూపినట్లు తెలుస్తోంది. కచ్చితంగా గెలిచి తీరాలన్న టాస్క్ ఇచ్చిన తర్వాత.. గెలిచి తీరతామన్న నమ్మకంతోనే ముందుకెళ్లారు. జగన్‌ను మొన్నటి ఎన్నికల్లో ఎదుర్కొన్న బీటెక్‌రవి భార్య లతా రెడ్డిని రంగంలోకి దింపారు. గురి చూసి వైఎస్ కుటుంబం కుంభస్థలాన్ని కొట్టారు.కుప్పంలో తెలుగుదేశం నాలుగు చోట్ల కలిపి 20వేల ఓట్లు అయినా సాధించింది. కానీ.. పులివెందులలో వైఎస్సార్సీపీకి డిపాజిట్ రాలేదు. 7వేలకు పైగా ఓట్లు పోలైతే... 683 ఓట్లు మాత్రమే వచ్చాయి. తెలుగుదేశం అసలు ఓటర్లను ఇళ్లనుంచి బయటకు రానివ్వకుండా మొత్తం రిగ్గింగ్ చేసుకుందని వైసీపీ ఆరోపణ. చాలా చోట్ల దొంగ ఓట్లు వేసిన ఆధారాలను ఆ పార్టీ అధినేత బయటపెట్టారు. జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు నుంచి ఓట్లు వేశారని చెప్పారు. ఇవే తరహా ఆరోపణలు కుప్పం ఎలక్షన్‌లోన వచ్చాయి. మేం రిగ్గింగ్ చేసుకుంటే.. “ఓటింగ్ 74శాతమే ఎందుకవుతుంది.. 90శాతం చేసుకునే వాళ్లం కదా..” అని టీడీపీ అంటోంది.తెలుగుదేశం దూకుడుగా వెళ్లినట్లు కనిపిస్తున్నా.. కొన్ని చోట్ల వైసీపీ ఓటర్లు కూడా ఓటింగ్‌కు నిరాసక్తత చూపారు. కొన్నేళ్లుగా నియోజకవర్గంలో వైఎస్ అవినాష్‌రెడ్డి హవానే సాగుతోంది. జగన్ సొంత నియోజకవర్గంపై పెద్దగా దృష్టి సారించడం లేదు. వైఎస్ అవినాష్‌పై కోపం ఉన్న వాళ్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇలా చేస్తే అయినా జగన్‌కు విషయం అర్థం అవుతుంది అనుకున్న వాళ్లు కూడా ఉన్నారు. ఆ వీడియోలు కూడా బయటకు వచ్చాయి. సరే ఏదైతే ఏంటి.. మొత్తానికి మొట్టమొదటి సారి తెలుగుదేశం పులివెందులలో జెండా ఎగరేస్తే.. 45ఏళ్ల తర్వాత వైఎస్ కుటుంబం ఓటమిని ఎదుర్కొంది.

వై నాట్ కుప్పం అంటూ ఆరోజు.. చేసిన దానికి వై నాట్ పులివెందుల అంటూ వీళ్లు బదులిచ్చారు.

# అంత అన్నారు... ఇంత అన్నారే...

కడప , ఆగస్టు 16, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కడప జిల్లాలో క్యాంప్ కార్యాలయం పెడతానని దాదాపు కొన్ని నెలలు గడుస్తుంది. అయితే ఇప్పటి వరకూ కడప జిల్లాలో క్యాంప్ కార్యాలయం పెట్టింది లేదు. ఆయన వెళ్లింది లేదు. ఈ ఏడాది జనవరిలో ఆయన కడపలో పర్యటించిన సందర్భంగా చేసిన ప్రకటన ప్రకటనకే పరిమితమయినట్లుగా కనపడుతుంది. దాదాపు తొమ్మిది నెలలు గడుస్తున్నా కడపలో క్యాంప్ కార్యాలయం పెట్టలేదు. పవన్ కల్యాణ్ ఆ ఊసే మర్చిపోయినట్లుంది. తాను ప్రజల్లోకి వెళ్లి బహిరంగంగా చేసిన ప్రకటనను కూడా పట్టించుకోకపోవడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమయింది. కడప ప్రాంతంలో పర్యటించినప్పుడు ఉండే జోష్ తర్వాత పవన్ కల్యాణ్ లో ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నకు మాత్రం జవాబు లేదు.మాటకు కట్టుబడి ఉండేలా... అన్నమయ్య జిల్లాలోని గాలివీడు తహశీల్దారును పరామర్శించడానికి కడప వెళ్లిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఊరమాస్ వార్నింగ్ ఇచ్చారు. అయితే తర్వాత మాత్రం ఆ మాస్ వార్నింగ్ ను కడప సరిహద్దుల్లోనే వదిలేసినట్లుందని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పవన్ కల్యాణ్ ఏదైనా ఆ సమయంలో చెప్పిన మాటకు కట్టుబడి ఉండరని, అక్కడ పరిస్థితులను బట్టి తన మనసులో తోచిన విషయాన్ని ఆవేశంగా బయటకు చెబుతారని, అంతే తప్ప ఆచరణ సాధ్యం కాని విషయాలను కూడా చెప్పి జనం ముందు నవ్వుల పాలు అవుతున్నారని జనసైనికులే అంటున్నారు. అందుకే ఒక మాట చెప్పేముందు అన్నీ ఆలోచించుకుని చేయాల్సి ఉంటుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.గతంలోనూ పవన్ కల్యాణ్ చేసిన అనేక వ్యాఖ్యలు, హామీలను కూడా వైసీపీ సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. పవన్ కల్యాణ్ మాటలపై నమ్మకం కలగాలంటే కనీసం తాను చెప్పిన మాటలను అయినా నిజం చేయాలని, కనీసం కడపలో క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి ఉన్న అభ్యంతరాలేమిటి? అని జనసైనికులే ప్రశ్నిస్తున్నారు. అందుకే పవన్ కల్యాణ్ ఇకపై ఒక మాట మాట్లాడేటప్పుడు ఆచరణ సాధ్యమా? తన కున్న పరిధిలో అది వీలవుతుందా? అన్నది ఆలోచించుకోవాలంటున్నారు. రాయలసీమలో పవన్ కల్యాణ్ పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం ఇంతవరకూ మొదలు పెట్టకపోవడంపై కూడా జనసైనికుల్లో అసంతృప్తి కనపడుతుంది. మరి పవన్ ఇప్పటికైనా సీమలో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తారా? లేదా? అన్నది చూడాలి.

# పీపీపీ ద్వారా 11 రోడ్లు

విజయవాడ, ఆగస్టు 11,రాష్ట్రంలోని కొన్ని ప్రధాన రహదారులను ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. పీపీపీ విధానంలో రహదారుల విస్తరణతో పాటు పలు అభివృద్ధి, మౌలిక సౌకర్యాల ప్రాజెక్టుకు చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో టెక్నో-ఎకనామిక్ స్టడీ చేయించగా, తొలుత 11 రహదారుల్లో ఈ విధానాన్ని అమలు చేయవచ్చని స్పష్టం చేసింది. వారు ఈ అధ్యయనంలో వివిధ అంశాలను పరిశీలించారు. వాటిలోని అంశాలు ఏంటంటే.. రహదారి విస్తరణకు అవసరమైన వరుసల సంఖ్య, ఖర్చు ఎంత అవుతుంది?. కేంద్ర, రాష్ట్రాల వంతు వ్యయభారం ఎంత. గుత్తేదారులకు ఎంతకాలం టోల్ వసూలు హక్కులు ఇవ్వాలి అనే అంశాలు పరిశీలించారుఈ 11 రహదారులను 15 నుంచి 30 సంవత్సరాల వరకు నిర్వహణ, టోల్ వసూలు హక్కులతో గుత్తేదారులకు అప్పగించేందుకు ప్రతిపాదన చేశారు. అయితే, మరో 6 రహదారుల కోసం పీపీపీ మోడల్ ఆదాయపరంగా చెల్లుబాటు కావడం లేదని అధ్యయనంలో తేలింది.

ప్రత్యేక రహదారి ప్రాజెక్టుల వివరాలు:

మంగళగిరి - తెనాలి - నారకోడూరు (39 కిలో మీటర్లు).. గుంటూరు - బాపట్ల (50 కిలో మీటర్లు)

ఈ రెండు రహదారులను ఒక్కొక్కటిగా కాకుండా, ఒకే ప్రాజెక్టుగా కలిపి నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదన.

మొత్తం ఖర్చు: రూ. 1,529.21 కోట్లు.

నరసాపురం - తాడేపల్లిగూడెం - అశ్వరావుపేట (92.4 కిలో మీటర్లు):

ఇందులో నరసాపురం నుంచి తాడేపల్లిగూడెం వరకు 51 కిలో మీటర్లు మాత్రమే పీపీపీ ద్వారా అభివృద్ధి చేయడం సాధ్యమని తేలింది.

అంచనా ఖర్చు: రూ. 419 కోట్లు.

బైపాస్‌లు: మార్టేరు వద్ద 2.3 కిలో మీటర్లు, అత్తిలి వద్ద 3.47 కిలో మీటర్లు, పిప్పర వద్ద 3 కిలో మీటర్లు, పెంటపాడు వద్ద 4.3 కిలో మీటర్లు.

ఒంగోలు - పొదిలి (50 కిలో మీటర్లు).. పొదిలి - బెస్తవారిపేట (59 కిలో మీటర్లు):

పొదిలి - బెస్తవారిపేట విస్తరణ పీపీపీ ద్వారా సాధ్యంకాదని తేలినా, మొత్తం 109 కిలో మీటర్లు ప్రాజెక్టుగా కలిపి విస్తరిస్తే సాధ్యమేనని సూచించారు.

అంచనా వ్యయం: రూ. 611 కోట్లు.

బైపాస్‌లు: సంతనూతలపాడు వద్ద 2 కిలో మీటర్లు, చీమకుర్తి వద్ద 5.4 కిలో మీటర్లు.

పీపీపీ విధానంలో విస్తరణకు అనుకూలమైన రహదారులు

మార్గం, కి.మీ, లేన్లు, అంచనా వ్యయం వివరాలిలా..

ఒంగోలు-పొదిలి- బెస్తవారిపేట - 109 కి.మీ, లేన్లు 4/2, అంచనా వ్యయం రూ.611 కోట్లు

మంగళగిరి- తెనాలి- నారాకోడూరు, గుంటూరు-బాపట్ల, 89 కి.మీ, లేన్లు 4, అంచనా వ్యయం రూ. 1,529.21 కోట్లు

చిలకపాలెం-రామభద్రపురం- రాయగడ రోడ్ 131 కి.మీ, లేన్లు 2/4, అంచనా వ్యయంరూ.1,172 కోట్లు

దామాజీపల్లి-నాయనపల్లి 60 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.338 కోట్లు

కాకినాడ- రాజమహేంద్రవరం కెనాల్ రోడ్ 60 కి.మీ, లేన్లు 4, అంచనా వ్యయం రూ.680 కోట్లు

ప్యాపిలి- బనగానపల్లి 54 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.171 కోట్లు

నరసాపురం- తాడేపల్లిగూడెం- 51 కి.మీ, లేన్లు 4, అంచనా వ్యయం రూ.419 కోట్లు

నర్సీపట్నం- తాళ్లపాలెం 31 కి.మీ, 2, అంచనా వ్యయం రూ.101 కోట్లు

జమ్మలమడుగు-కొలిమిగుండ్ల 42 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.181 కోట్లు

సోమందేపల్లి-హిందూపురం- తూముకుంట 39 కి.మీ, లేన్లు 2/4, అంచనా వ్యయం రూ.270 కోట్లు

కాకినాడ- జొన్నాడ రోడ్ 4 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.425 కోట్లు

పీపీపీ కింద రోడ్ల విస్తరణ సాధ్యం కాని ప్రాజెక్టులు

- కళింగపట్నం- శ్రీకాకుళం పార్వతీపురం రోడ్డు 108 కి.మీ, లేన్లు 2/4, అంచనా వ్యయం రూ.587 కోట్లు
- ఏలూరు- జంగారెడ్డిగూడెం 51 కి.మీ, 2 లేన్లు, అంచనా వ్యయం రూ.250 కోట్లు
- రాజంపేట- గూడూరు 94 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.230 కోట్లు
- ఏలూరు- మేడిశెట్టివారిపాలెం రోడ్డు 70 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.403 కోట్లు
- విజయనగరం- పాలకొండ రోడ్డు 70 కి.మీ, లేన్లు 4/2, రూ. 642 కోట్లు
- గుంటూరు- పర్చూరు 41 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.147 కోట్లు

# టీడీపీది బలమా..బలుపా...

కడప, ఆగస్టు 16, పులివెందుల జడ్పీటీసీని అధికార టీడీపీ కైవశం చేసుకుంది. ఇది జగన్‌కు ఎదురు దెబ్బ అని వైసీపీ మరింత నీరసించిపోతుందని టీడీపీ శ్రేణులు సంబరపడుతున్నాయి. పులివెందుల గడ్డా ఇకపై జగన్ అడ్డా కాదని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే సీన్ రిపీట్ అవుతుందని జోస్యం చెబుతున్నాయి. ఇదంతా దొంగ ఓట్లతో సాధించిన విజయమని కచ్చితంగా నిజమైన ఓట్లతో తాము గెలిచి చూపిస్తామని వైసీపీ శపథం చేస్తోంది. ఇంతకీ ఈ విజయాన్ని ఎలా చూడాలి. ఇది టీడీపీ బలానికి ప్రతీకనా లేకా కేవలం వాపేనా అనేది పరిశీలిద్దాం. పులివెందుల అంటేనే వైఎస్ కుటుంబానికి అడ్డా. పార్లమెంట్ ఎన్నికల నుంచి సర్పంచ్ ఎన్నికల వరకు ఆ ఫ్యామిలీయే శాసిస్తుంది. వారు ఎవర్ని నిలబెడితే వాళ్లకే జనం ఓట్లేస్తారు. ఇది అక్కడ ప్రజల ప్రేమాభిమానాలకు నిదర్శనమని వైసీపీ నేతలు చెబుతుంటారు. కానీ అక్కడ ప్రజలకు స్వేచ్ఛ లేకుండా భయపెట్టి ఇలాంటి ప్రొజెక్షన్ ఇస్తుంటారని ప్రత్యర్థుల ఆరోపణ. ఏమైనా సరే ఇప్పటి వరకు వైఎస్ కుటుంబాన్ని దాటి వేరే వ్యక్తులు ఆ ప్రాంతంలో గెలించింది లేదు. అలానే జడ్పీటీసీ కూడా ఆ కుటుంబ ఆధిపత్యం సాగుతూ వచ్చింది. కానీ తొలిసారి ఈ ఉపఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరింది. దాదాపు 30 ఏళ్ల తర్వాత పులివెందుల జడ్పీటీసీలో సైకిల్ బెల్ మోగింది. దశాబ్ధాలుగా కొనసాగుతున్న వైఎస్ కుటుంబ ఆధిపత్యానికి ఇది ఎదురుదెబ్బే అనొచ్చు. పులివెందుల జడ్పీటీసీగా ఉన్న తుమ్మల మహేశ్వర్‌రెడ్డి 2023లో ఓ ప్రమాదంలో మృతి చెందారు. అందుకే ఈ స్థానం కోసం ఉప ఎన్నిక జరిగింది. అధికారంలో ఉన్న టీడీపీ, అధికారం కోల్పోయిన వైసీపీ రెండు పార్టీలు కూడా ఈ పులివెందల జడ్పీటీసీ ఉపఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. హోరాహోరీగా ప్రచారం చేశాయి. ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. పులివెందుల గడ్డ వైసీపీ అడ్డా అంటూ ఆపార్టీ రాష్ట్ర స్థాయి నేతలంతా వచ్చి ప్రచారం చేశారు. పులివెందుల అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి వ్యూహాన్ని ఈ ఎన్నికల నుంచే అమలు చేయాలని భావించి టీడీపీ అందుకు తగ్గట్టుగా ప్లాన్ చేసింది. ఈ ఎన్నికల పూర్తి బాధ్యతను ఇద్దరు మంత్రులు, ఇతర సీనియర్ నేతలపై పెట్టింది. నిత్యం వారు పులివెందుల ప్రజల్లోనే ఉంటూ గెలుపు ప్రణాళికలను అమలు చేసారు. జగన్‌కు వ్యతిరేకంగా ఉన్న వర్గాలను చేరదీశారు. వైఎస్ కుటుంబంలోనే జగన్ అంటే పడని వారిని తమవైపు తిప్పుకున్నారు. ఇలా ఆరు నెలలుగా అక్కడ ఆపరేషన్ పులివెందుల చేపట్టారు. అందుకు తగ్గ ఫలితాన్ని రాబట్టారు. అధికారులను, పోలీసులను విచ్చలవిడిగా పార్టీ కార్యకర్తల మాదిరిగా వాడుకున్న టీడీపీ పులివెందులలో అరాచకంగా ఎన్నికలు నిర్వహించిందని వైసీపీ ఆరోపించింది. నిజమైన ఓటర్లు ఓట్లు వేసుకోలేని విధంగా బూత్ క్యాప్చర్ చేసిందని మండిపడింది. అందుకు తగ్గట్టుగానే కొందరు వ్యక్తులు మీడియాతో మాట్లాడించారు. అటు టీడీపీ కూడా వాళ్లకు కౌంటర్ ఇచ్చింది. దశాబ్ధాలుగా ప్రజలను, నాయకులను బెదిరించి ఏకగ్రీవాలు చేసుకుంటూ వచ్చిన వైసీపీ ఇప్పుడు ఎన్నికలు జరుగుతుంటే తట్టుకోలేకపోతోందని మండిపడింది. వైసీపీ అరాచకాలను పోలీసులు అడ్డుకోవడంతో ప్రజలంతా ప్రశాంతంగా వచ్చి ఓటు వేశారని అన్నారు. ఇంకా చాలా మంది రావాల్సి ఉండేదని కానీ వైసీపీ నేతల బెదిరింపులకు భయపడిపోయారని అంటోంది. పులివెందులలో టీడీపీ అరాచకాలు చేస్తోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలకు గతాన్ని గుర్తు చేస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ప్రాంతంలో కూడా ప్రత్యర్థులు కనీసం నామినేషన్ వేసే అవకాశం లేకుండా చేశారని చెబుతున్నారు. నాడు వైసీపీ నేతలు చేసింది తక్కువ కాదని చెబుతున్నారు. నాడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచారానికి వెళ్లినా కూడా రానివ్వకుండా చేసిన విషయాన్ని మర్చిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. పులివెందులలో విజయం సాధించిన టీడీపీ వచ్చే ఎన్నికలలో అసెంబ్లీలో గెలుస్తామని చెప్పడం అతి విశ్వాసం అవుతుంది. ఎందుకంటే గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వైసీపీ ఇలాంటి ప్రయత్నం చేసి బోల్తా పడింది. కుప్పంలో అన్ని లోకల్ బాడీ ఎన్నికల్లో విజయం సాధించింద. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోతారని ప్రచారం చేసింది. అప్పుడు మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్కడే మకాం వేసి చంద్రబాబును దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. కానీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి సీన్ తిరిగబడింది. కుప్పంలో కాదు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీని ప్రజలు తిరస్కరించారు. కేవలం 11 సీట్లే కట్టబెట్టారు. ఆ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తు పెట్టుకొని మసులుకోవాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల జయాపజయాలు కేవలం స్థానికంగా ఉండే రాజకీయ సమీకరణాలను ఆధారంగా చేసుకొని ఉంటాయి. అంతే కాకుండా అధికారంలో ఉన్న పార్టీకి కొద్దోగొప్ప అనుకూలంగా ఉంటాయి. అంత మాత్రాన నాలుగేళ్ల తర్వాత జరగబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తామని చెప్పుకోవడం అతి విశ్వాసం అవుతుంది. ఈ దెబ్బకు వైసీపీ ఢీలా పడుతుందని ఆ పార్టీ పని అయిపోయిందనే ఆలోచన సరికాదని అంటున్నారు. గత లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా టీడీపీ పని అయిపోయిందని వైసీపీ నేతలు స్టేట్మెంట్‌లు పాస్ చేశారు. ఇప్పుడు వారంతా ఏ పరిస్థితుల్లో ఉన్నారో అందరికీ తెలిసిందే. ఈ విజయం మెట్టుగా ఉపయోగపడుతుంది. అలానే చూడాలని అంటున్నారు

# డోస్ పెంచిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**నేరుగా సీఎం రేవంత్ రెడ్డి పై ఆరోపణలు..**

**బిల్లుల చెల్లింపులలో వివక్ష చూపుతున్నారంటూ ఆరోపణ...!**

**పదవులు మీకే..పైసలు మీకేనా...అంటూ నిష్టూరం..!**

మునుగోడు ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి దూకుడు పెంచారు. ఈ సారి నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ పై ఆరోపణలు గుప్పించారు. పదవులు తీసుకోండి.. కానీ పనులు చేసిన కాంట్రాక్టర్లకు పైసలు ఇవ్వండి.. మా మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దంటూ వ్యాఖ్యానించారు. నిన్న ఉదయం క్రెడాయి ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ కార్యక్రమంలో పరోక్షంగా రాజగోపాల్ పై సిఎం విమర్శలు చేసిన విషయం తెలిసిందే. రాజకీయాల్లో పదిమంది పోటీ పడినా.. కుర్చీ ఒక్కరికే దక్కుతుందని.. అది అన్నదమ్ముళ్లైనా.. ఇంకెవరైనా.. అంటూ కోమటిరెడ్డి బ్రదర్స్ ను ఉద్దేశించి సీఎం కామెంట్స్ చేశారు. ఆ తర్వాత మునుగోడులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాజగోపాల్ రెడ్డి.. నేరుగా ముఖ్యమంత్రి పై విమర్శలు చేశారు. ఇంతకుముందు సీఎం పేరు ఎత్తకుండా విమర్శలు చేసిన రాజగోపాల్...ఈ సారి నేరుగా సీఎం పేరు చెప్పి మరీ విమర్శలు చేయడం.. అధికార పార్టీ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది

# చేపలు సరే...తిమింగలాల సంగతేంటీ

ఒంగోలు, ఆగస్టు 16, ఆర్జీవీ.. అలియాస్ రామ్‌గోపాల్ వర్మ.. తెలుగు ప్రజలకే కాదు.. బాలీవుడ్ అభిమానులకు సుపరిచితమైన పేరు. ముఖ్యంగా 2019 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడానికి తనవంత సహకారం అందించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు రామ్‌గోపాల్‌వర్మ సైలెంట్ అయ్యారు. కానీ గతంలో చేసిన వ్యాఖ్యలపై కేసులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఒంగోలు పోలీస్ స్టేషన్‌కు విచారణకు కోసం వచ్చారు. చిన్న నాయకులపై చర్యలు తీసుకుంటూ, పెద్ద నాయకులను వదిలేస్తున్న ఈ వ్యవహారం ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తోందని పేర్కొన్నారు.రామ్ గోపాల్ వర్మ ఒంగోలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన సంఘటన రాజకీయ కోణం నుంచి చర్చనీయాంశమైంది. వైసీపీ హయాంలో ఆయన టీడీపీ నాయకులైన చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌లపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు, మార్ఫింగ్ చిత్రాలు పెట్టారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. 'వ్యూహం' సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఈ చర్యలు రాజకీయంగా ప్రేరేపితమని టీడీపీ నాయకుడు ముత్తనపల్లి రామలింగం ఫిర్యాదు చేశారు. ఆర్జీవీ ముందస్తు బెయిల్ పొందినప్పటికీ, హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరయ్యారు. అయితే, ఈ కేసు న్యాయపరమైన చర్య కన్నా రాజకీయ కక్ష సాధింపుగా పరిగణించబడుతోంది. వైసీపీ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో ఆర్జీవీ సమావేశం కావడం ఈ అనుమానాలను మరింత బలపరిచింది.మద్యం కుంభకోణం కేసులో సిట్ ఇటీవల దాఖలు చేసిన అనుబంధ ఛార్జ్‌షీట్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రధాన సూత్రధారిగా పేర్కొనడం గమనార్హం. అయితే, ఈ కేసులో ఇప్పటివరకు జగన్‌కు నోటీసులు జారీ కాలేదు, విచారణకు హాజరయ్యే అవకాశం కూడా అస్పష్టంగా ఉంది. ఈ విషయంలో వైఎస్ షర్మిల స్వయంగా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం గమనార్హం. 'చిన్న నాయకులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు, బెయిల్‌లతో సమయం వృథా చేస్తున్నారు, కానీ ప్రధాన నిందితులపై చర్యలు లేవు. ఈ కేసు రాజకీయ ఒత్తిడి కారణంగా నీరసించినట్లు కనిపిస్తోంది, ఇది ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది అని పేర్కొన్నారు.వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వివేకా కుమార్తె సునీతా రెడ్డి నిరంతరం పోరాటం సాగిస్తున్నారు. ఢిల్లీ నుంచి కడప వరకు ఆమె అధికారులను కలుస్తూ, న్యాయం కోసం కృషి చేస్తున్నారు. అయితే, ఈ కేసులో గణనీయమైన పురోగతి కనిపించడం లేదు. అవినాష్ రెడ్డిపై ఆరోపణలు ఉన్నప్పటికీ, రాజకీయ ప్రభావం కారణంగా ఈ కేసు నెమ్మదిగా సాగుతున్నట్లు భావిస్తున్నారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి.మిథున్ రెడ్డి, చెవిరెడ్డి వంటి వైసీపీ నాయకులపై అరెస్టులు, విచారణలు జరుగుతున్నప్పటికీ, వారు త్వరలోనే బెయిల్‌పై విడుదలవుతున్నారు. ఇది న్యాయవ్యవస్థ పరిమితులను సూచిస్తుంది. పెద్ద నాయకులైన జగన్, అవినాష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితి ప్రజల్లో 'చిన్న చేపలను వేటాడుతూ, తిమింగలాలను వదిలేస్తున్నారు' అనే అభిప్రాయాన్ని కలిగిస్తోంది. రాజకీయ ఒత్తిడి, శక్తివంతమైన నాయకుల ప్రభావం వల్ల న్యాయం అమలులో ఆటంకాలు ఏర్పడుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.కూటమి ప్రభుత్వానికి మిగిలిన మూడేళ్ల కాలంలో ఈ కేసుల్లో పెద్ద నాయకులపై చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందా? మద్యం కుంభకోణం, వివేకా హత్య కేసుల్లో ప్రధాన నిందితులను విచారణకు రప్పించడం, న్యాయం అమలు చేయడం పెద్ద సవాలుగా కనిపిస్తోంది. సిట్, పోలీసు విభాగాలు 'బిగ్ బాస్'ల వరకు చేరుకోవడానికి సమర్థవంతమైన వ్యూహాలు రూపొందించాల్సి ఉంది. లేకపోతే, ఈ కేసులు కేవలం మీడియా హైప్‌గా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# ఇక పాన్ 2.0

ముంబై, ఆగస్టు 16, పాన్.. ఇన్‌కం ట్యాక్స్ చెల్లింపులో ఒక అద్భుతం. పన్ను ఎగవేతదారులను పట్టించే ఆయుధం. అయితే ఇప్పటికీ చాలా మంది ఈ పాన్‌ను కూడా దుర్వినియోగం చేస్తున్నారు. పన్ను ఎగవేతకు అడ్డదారులు వెతుకుతున్నారు. పాన్‌లోని లోపాలు వారికి కలిసి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం 2026లో పాన్ 2.0ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇది పన్ను సంబంధిత సేవలను ఒకే డిజిటల్ వేదికపై ఏకీకృతం చేయడం ద్వారా పౌరులకు సౌలభ్యాన్ని అందించనుంది. క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ (సీసీఈఏ)ఆమోదంతో రూ.1,435 కోట్ల బడ్జెట్‌తో, ఐటీ దిగ్గజం ఎల్‌టీఐమైండ్‌ట్రీ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి నిర్వహించనుంది.ప్రస్తుతం, పాన్ (పర్మనెంట్ అకౌంట్ నంబర్), టీఏఎన్ (టాక్స్ డిడక్షన్ అండ్ కలెక్షన్ అకౌంట్ నంబర్) సేవలు ఇన్‌కమ్ టాక్స్ ఈ?ఫైలింగ్ పోర్టల్, యూటీఐఐటీఎస్‌ఎల్, ప్రొటీన్ (గతంలో ఎన్‌ఎస్‌డీఎల్) వంటి బహుళ వేదికలపై విస్తరించి ఉన్నాయి. పాన్ 2.0తో, ఈ సేవలన్నీ ఒకే కేంద్రీకృత డిజిటల్ ఇంటర్‌ఫేస్‌లో అందుబాటులోకి వస్తాయి. ఇది పౌరులకు సమయం ఆదా చేయడమే కాక, కాగితం లేని ప్రక్రియలను ప్రోత్సహిస్తుంది. పాన్ 2.0 వివిధ సంస్కరణలను తీసుకొస్తుంది, ఇవి ఖాతాదారుల అనుభవాన్ని మెరుగుపరుస్తాయి:ప్రస్తుతం పాన్ దరఖాస్తు, సవరణలు, ఆధార్ లింకింగ్, ధ్రువీకరణల కోసం బహుళ వెబ్‌సైట్‌లను ఉపయోగించాల్సి ఉంటుంది, ఇది సంక్లిష్టంగా ఉంటుంది.పాన్ 2.0లో అన్ని సేవలు ఒకే వేదికపై అందుబాటులో ఉంటాయి, ఇది వినియోగదారులకు సౌలభ్యాన్ని, సమయం ఆదాను అందిస్తుంది. ఇప్పటికే పాన్ కార్డు ఉన్నవారు కొత్త దరఖాస్తు చేయనవసరం లేదు. ప్రస్తుత పాన్ నంబర్ పాన్ 2.0 కింద పూర్తిగా చెల్లుబాటవుతుంది. ఇది ఖాతాదారులకు ఆర్థిక, సాంకేతిక భారాన్ని తగ్గిస్తుంది. పాన్ వివరాల సవరణలు ఉచితంగా ఉంటాయి. సవరించిన ఈ?పాన్ నేరుగా రిజిస్టర్డ్ ఈమెయిల్‌కు పంపబడుతుంది. ఇది వేగవంతమైన, ఖర్చు లేని సేవలను అందిస్తూ, డిజిటల్ పరివర్తనను ప్రోత్సహిస్తుంది.పాన్ కార్డులపై ఉన్న క్యూఆర్ కోడ్ కేంద్రీకృత డేటాబేస్ నుంచి తాజా సమాచారాన్ని ప్రదర్శిస్తుంది. గుర్తింపు ధ్రువీకరణ వేగవంతంగా, సురక్షితంగా జరుగుతుంది, మోసాలను తగ్గిస్తుంది. డిజిటల్ ఇండియా మిషన్‌లో భాగంగా, పాన్ బహుళ ప్రభుత్వ సేవలకు యూనివర్సల్ డిజిటల్ ఐడెంటిటీగా మారవచ్చు. ఇది పౌరులకు ఒకే గుర్తింపుతో బహుళ సేవలను యాక్సెస్ చేసే సౌలభ్యాన్ని అందిస్తుంది.ఇప్పటి పాన్ కార్డులు ఎటువంటి మార్పు లేకుండా చెల్లుబాటవుతాయి. క్యూఆర్ కోడ్ లేని కార్డుల ఉన్నవారు, ప్రస్తుత లేదా కొత్త వ్యవస్థలో రీప్రింట్ కోసం దరఖాస్తు చేయవచ్చు. పాన్ 2.0 అమలులోకి వచ్చిన తర్వాత, సవరణలు, ధ్రువీకరణలు వేగవంతంగా, పూర్తిగా డిజిటలైజేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి.పాన్ 2.0 భారతదేశంలో పన్ను సంబంధిత సేవలను సరళీకరించడంతోపాటు, డిజిటల్ గుర్తింపు వ్యవస్థ వైపు ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుంది. ఇప్పటి పాన్ కార్డు హోల్డర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, ఉచిత సవరణలు, వేగవంతమైన ఈ?పాన్ సేవలు, మెరుగైన ధ్రువీకరణ వంటి ప్రయోజనాలు అందిస్తుంది.

# ములుగు జిల్లాకు ఐటీ కంపెనీ

వరంగల్,ఆగస్టు 16, ములుగును ఐటీ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. రూ.6 కోట్లతో ఐదు అంతస్తుల అత్యాధునిక ఐటీ భవనాన్ని నిర్మించనున్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా టాస్క్ సెంటర్‌లో ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే సిరి ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని కార్యకలాపాలు ప్రారంభించారు. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఐటీ విప్లవం సృష్టించి వేల సంఖ్యలో ఉద్యోగాలను కల్పించాలని ప్రభుత్వం కృషి చేస్తోంది.తెలంగాణలోని వెనుకబడిన మన్యం జిల్లా ములుగును భవిష్యత్తులో ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. స్థానిక యువతకు ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. జిల్లాలో పెద్ద ఐటీ కంపెనీలను ఆకర్షించేలా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ములుగు పట్టణ శివారులో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.6 కోట్లతో అత్యాధునిక ఐటీ భవనం నిర్మించనున్నారు. ఈ ఐదు అంతస్తుల భవనం కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు ప్రతిపాదనలు పంపించారు. ఒక్కో అంతస్తులో ఒక్కో ఐటీ కంపెనీని ఏర్పాటు చేసి, వేల సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఉన్న తరహాలోనే ఈ భవనంలో అన్ని రకాల వసతులు కల్పించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల మంజూరు కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు, ములుగులో ఇప్పటికే ఏర్పాటు చేసిన టాస్క్ ) సెంటర్‌లో యువతకు ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఐటీ కంపెనీల ప్రాజెక్టులకు అనుగుణంగా ఉండే కోర్సులపై దృష్టి సారించి యువతను సిద్ధం చేస్తున్నారు. శిక్షణ పూర్తి అయిన వెంటనే ఇక్కడే ఉద్యోగాలు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఐటీ కంపెనీలను ఆకర్షించే దిశగా తొలి అడుగు పడింది. ములుగులోని టాస్క్ సెంటర్ ఆవరణలో సిరి ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం చేసుకుని నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో ఉద్యోగులు, మేనేజర్ల గదులు, వెయిటింగ్ హాల్ వంటి సౌకర్యాలు కార్పొరేట్ స్థాయిలో కల్పించారు. త్వరలోనే మంత్రి సీతక్క చేతుల మీదుగా ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఈ కంపెనీ సేవలు మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏజెన్సీ ప్రాంతమైన ములుగులో ఐటీ విప్లవం సృష్టించి చరిత్ర సృష్టించాలని ములుగు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది.

# పరవళ్ళు తొక్కుతున్న బొగత జలపాతం

## జలపాతం వద్ద పర్యాటకుల సందడి..

ములుగు ఎగువ కురుస్తున్న వర్షాలతో పాటు నిన్నటి నుండి కురుస్తున్న వర్షాలకు ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి గ్రామం లోని తెలంగాణ నయాగరహగా పేరుగాంచిన బొగత జలపాతం పరవళ్ళు తొక్కుతుంది.

జలపాతం వద్ద భారీగా వరద నీరు చేరడంతో బొగత జలపాతం పరవళ్ళు తొక్కుతూ అందాలు ఆరబోసినట్లు పర్యాటకులను మైమరింపజేస్తుంది.పర్యాటకులు బొగత అందాలను వీక్షిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రం నుంచి కాకుండా ఛత్తీస్ ఘడ్,మహారాష్ట్ర నుండి పర్యాటకులు వచ్చి జలపాతాన్ని చూసి వెళుతున్నారు.సెలవు దినాలు కావడం తో కుటుంబసభ్యులతో కలసి జలపాత అందాలను చూస్తూ సెల్ఫీలు దిగుతూ కేరింతలు కొడుతున్నారు.జలపాతం వద్ద భారీగా వరద చేరడంతో బొగత జలపాతం వద్ద ఉన్న కొలనులోకి అటవీ శాఖ అధికారులు పోలీసులు అనుమతిని ఇవ్వడం లేదు.

# జగన్ మైండ్ గేమ్ స్టార్ట్...

గుంటూరు, ఆగస్టు 16, వైసీపీ అధినేత జగన్ మైండ్ గేమ్ మొదలుపెట్టినట్లే కనపడుతుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నుంచి బీజేపీని దూరం చేయడానికి అవసరమైన విధంగా ఆయన అడుగులు పడుతున్నట్లే ఉంది. సాధారణంగా పోలింగ్ లో తేడాలుంటే ఎన్నికల కమిషన్, బీజేపీపై జగన్ విమర్శలు చేయాల్సి ఉంది. అయితేవాటిని పక్కనపెడుతూ ఓటు చోరీ పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీపై ఆయన మండిపడుతుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఎందుకంటేరాహుల్ గాంధీ బీహార్, మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను ప్రస్తావించారు కానీ, ఆంధ్రప్రదేశ్ లో 12.5 శాతం పోలింగ్ ఓట్లతో తేడా వచ్చినప్పటికీ దాని ప్రస్తావన లేకపోవడాన్ని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఇందుకు పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకరించాని కూడా అన్నారు. దీన్ని బట్టి చూస్తే చంద్రబాబు రాహుల్ తో టచ్ లో ఉన్నారంటూ జగన్ చేసిన ప్రయత్నం రాజకీయంగా మైండ్ గేమ్ అని చెప్పాల్సి ఉంటుంది. ఎందుకంటే బీజేపీ, కాంగ్రెస్ లు రానున్న ఎన్నికల్లో తలపడుతున్న సందర్భంలో మరొకసారి చంద్రబాబుతో బీజేపీ చేతులు కలపకుండా చేయకుండా ఉండేదుకు ఈ రకమైన ఆరోపణలు చేస్తున్నట్లు టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మాణికం ఠాగూర్ పై కడా జగన్ విమర్శలు చేశారు.. మాణికం ఠాకూర్ చంద్రబాబు నాయుడును విమర్శించడం లేదని, ఆయన ప్రభుత్వంలో జరిగే అవినీతిని ఎత్తి చూపడం లేదని, ఏపీలో అధికారంలో ఉన్న పార్టీని వదిలేసి ప్రతిపక్షంలో ఉన్న తమపై విమర్శలు చేయడమంటే లోపాయి కారీ ఒప్పందం ఏమిటో అర్థమవుతుందని వైఎస్ జగన్ వ్యాఖ్యానించడం రాజకీయ ఎత్తుగడల్లో ఒక భాగమేనంటున్నారు. బీజేపీతో చంద్రబాబును దూరం చేస్తే తప్ప తనకు తిరిగి అధికారం దక్కదని భావించిన జగన్ ఇక ఇటీవల ఈ తరహా రాజకీయం మొదలుపెట్టారని టీడీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. గతంలో తెలంగాణలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుని రాహుల్ గాంధీతో ప్రచారంలో పాల్గొన్న ఫొటోలను కూడా వైసీపీ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారంటే ఆ దిశగా ప్రయత్నాలు జగన్ పార్టీ మొదలు పెట్టినట్లే అనుకోవాల్సి ఉంటుంది

# తమిళనాడులో తారాస్థాయికి భాష రగడ

చెన్నై, ఆగస్టు 15, (న్యూస్ పల్స్) మనదేశంలో రాజకీయ నాయకులు మాత్రమే కాదు గవర్నర్లకు కూడా రాజకీయ వాసనలు ఉంటాయి. గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. రాష్ట్రాలలో జరుగుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తమకు నివేదికల ద్వారా తెలియజేయాలని సూచిస్తుంది. అయితే గవర్నర్లు కొన్ని సందర్భాలలో తమ పరిధులు దాటుతుంటారు. రాష్ట్రానికి ప్రధాన పౌరులం అనే విషయాన్ని మర్చిపోయి.. రాజకీయాలలో వేలు పెడుతుంటారు. దీంతో పరిస్థితులు ఒక్కసారిగా చేయు దాటిపోతుంటాయి. గతంలో తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్, తమిళ సై సౌందరరాజన్ మధ్య కొద్ది రోజులపాటు ఇటువంటి పరిణామాలు జరిగాయి. ఇప్పుడు తమిళనాడులో కూడా అటువంటి పరిస్థితులు నెలకొన్నాయి.తమిళనాడు రాష్ట్రంలో డిఎంకె పార్టీ అధికారంలో ఉంది. స్టాలిన్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఆ రాష్ట్రంలో ఆర్ఎన్ రవి గవర్నర్ గా కొనసాగుతున్నారు. రవి తమిళ భాషను వ్యతిరేకిస్తారని ఆ రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా డీఎంకే కార్యకర్తలు తీవ్రస్థాయిలో విమర్శిస్తుంటారు. అంతేకాదు ఆయన సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ హిందీ లేదా ఇంగ్లీషులోనే ప్రసంగిస్తుంటారు. సహజంగానే మాతృభాష మీద విపరీతమైన ప్రేమ ఉండే తమిళులు గవర్నర్ వైఖరిని విపరీతంగా విమర్శిస్తుంటారు. సోషల్ మీడియాలో అయితే గవర్నర్ రవిని ఏకిపారేస్తుంటారు. కొంతకాలంగా గవర్నర్, డీఎంకే ప్రభుత్వానికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. నీట్ కు వ్యతిరేకంగా డీఎంకే ప్రభుత్వం ఒక తీర్మానం చేసినప్పుడు.. దానిని గవర్నర్ వ్యతిరేకించారు. అప్పట్లో ఇది తమిళనాడు రాష్ట్రంలో సంచలనం సృష్టించింది.తాజాగా ఆ రాష్ట్ర ప్రథమ పౌరుడికి ఓ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో చేదు అనుభవం ఎదురయింది.. డీఎంకే నేత భార్య జీన్ జోసెఫ్ అత్యున్నత విద్యను పూర్తి చేశారు. గవర్నర్ నుంచి డిగ్రీ పట్టా తీసుకోవడానికి ఆమె నిరాకరించారు. వేదిక మీద ఉన్న ఆయనను పట్టించుకోకుండానే వెళ్లి.. వైస్ ఛాన్స్ లర్ చేతుల మీదుగా పట్టా తీసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. డీఎంకే నేత భార్య వ్యవహరించిన తీరును బిజెపి నాయకులు తప్పు పడుతుండగా.. తమిళనాడు ఆత్మాభిమానాన్ని జీన్ జోసెఫ్ ప్రదర్శించారని డిఎంకె కార్యకర్తలు అంటున్నారు.. ఆమెను తమిళ విప్లవ నాయకిగా అభివర్ణిస్తున్నారు.తమిళనాడులో భాష రాజకీయాలు ఇదే తొలిసారి కాదు. కానీ ఇప్పుడు అవి తారస్థాయికి చేరిపోయాయి. అధికార డిఎంకె కేంద్రంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తోంది. హిందీని బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపిస్తోంది. గతంలో ఉన్న కేంద్ర ప్రభుత్వాలు ఇలా చేయడం వల్లే ఉద్యమాలు వచ్చాయని.. ఇప్పుడు కేంద్రం కూడా అదే ధోరణి కొనసాగిస్తున్న నేపథ్యంలో.. అనివార్యంగా ఉద్యమాలు మొదలవుతున్నాయని డీఎంకే నేతలు చెబుతున్నారు. మరోవైపు హిందీని తాము బలవంతంగా రుద్దడం లేదని, లేనిపోని గొడవలు సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని డీఎంకే నేతలు భావిస్తున్నారని బిజెపి నాయకులు చెబుతున్నారు.

# 20 నెలలు.. 20వేల కోట్లు

# నెలకు 1000 కోట్ల అప్పు...

హైదరాబాద్, ఆగస్టు 16, అధికారంలో ఉన్న పార్టీ అభివృద్ధి చేస్తున్నామని చెబుతుంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అప్పులు చేస్తున్నారని గగ్గోలు పెడుతుంది. మనదేశంలో ప్రతి రాష్ట్రంలో అధికార ప్రతిపక్షాల మధ్య నిత్యం ఇలాంటి గోల జరుగుతూనే ఉంటుంది. దీనికి తెలంగాణ రాష్ట్రం మినహాయింపు కాదు. తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు అప్పులు చేసింది. ఆ అప్పుల మొత్తాన్ని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఖర్చు చేసినట్టు అప్పట్లో కేటీఆర్ సెలవిచ్చారు. ఆస్తుల కల్పన కోసమే తాము అప్పులు చేస్తున్నట్టు కేటీఆర్ వ్యాఖ్యానించారు. కానీ ఇప్పుడు కేటీఆర్ ప్రతిపక్ష పార్టీలోకి మారిపోవడంతో.. అకస్మాత్తుగా ఆయనకు అప్పులు అంటే ఒక బ్రహ్మ పదార్థం లాగా కనిపిస్తోంది. అప్పులు చేయకూడదని.. అప్పుల వల్ల తెలంగాణ రాష్ట్రం ఆగమవుతుందనే పిలాసఫీ ఆయన నోటి వెంట నుంచి వస్తోంది. సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ కేటీఆర్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం అనవసరంగా అప్పులు చేస్తుందనే మాట వినిపిస్తోంది.ఇక అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ భారత రాష్ట్ర సమితి చేసిన అప్పులపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసింది. అనేక సందర్భాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారత రాష్ట్ర సమితి నాయకులు చేస్తున్న అప్పులపై వ్యతిరేక స్వరం వినిపించారు. నిండు శాసనసభలో భారత రాష్ట్ర సమితి నాయకులను విమర్శించారు. అయితే నాడు అప్పును తప్పు అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.. ఇప్పుడు అదే అప్పును తెలంగాణ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నామని చెప్పడం విశేషం.. అంతేకాదు భారత రాష్ట్ర సమితి చేసిన అప్పులను తాము తీర్చుతున్నామంటూ వివరించడం గమనార్హం. అటు భారత రాష్ట్ర సమితి కూడా కాంగ్రెస్ పార్టీ చేసిన అప్పులపై అనేక సందర్భాలలో.. వివిధ వేదికలపై విమర్శలు చేస్తోంది.తాజాగా ఓ ప్రైవేట్ న్యూస్ ఛానల్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పుల గురించి ఒక సెటైరికల్ వీడియో రూపొందించింది. ఆ వీడియోను భారత రాష్ట్ర సమితి ఐటి విభాగంలో పనిచేసే ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దానిని భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రీ ట్వీట్ చేశారు.. కాంగ్రెస్ పార్టీ పెద్దల మీద ఒక్క మాట కూడా మాట్లాడకుండానే.. ఈ వీడియో ద్వారా తన మనసులో ఉన్న మాటను మరోసారి కేటీఆర్ బయట పెట్టారు. ,"భారత రాష్ట్ర సమితి అంత గొప్పగా తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తే.. ఉద్యోగులకు ఏరియర్స్ ఎందుకు చెల్లించలేదు.. కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకు చెల్లించలేదు.. ఆరోగ్యశ్రీ బకాయిలు ఎందుకు అంతలా పెరిగిపోయాయి.. చివరికి ఔటర్ రింగ్ రోడ్డు ను కూడా తాకట్టు పెట్టారు కదా.. భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు ఆర్థిక క్రమశిక్షణ అంత గొప్పగా ఉంటే ఇవన్నీ ఎందుకు జరిగాయని" కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌంటర్ ఇస్తున్నారు.

## 3 పార్టీలకు పరీక్షే

హైదరాబాద్, ఆగస్టు 16,లంగాణలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అన్ని పార్టీల మధ్య కాక రేపుతుంది. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా అన్ని పార్టీలు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటి నుంచే అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచి సత్తా చాటుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఉప ఎన్నికల్లో గెలిచి తమ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం చెక్కు చెదరలేదని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుంది. అదే సమయంలో ప్రభుత్వంపై రెండేళ్లలోనే అసంతృప్తి పెరిగిందని, అందుకు ఉప ఎన్నికల్లో గెలిచి నిరూపించాలని బీఆర్ఎస్ పార్టీ తహతహలాడుతుంది. మరొకవైపు బీజేపీ కూడా తాము రేసులో ఉన్నామని, ఈ సారి అధికార పీఠం తమదేనని తేల్చి చెప్పేందుకు ఈ ఎన్నికను రెఫరెండంగా చూడాలని కమలనాథులు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఇప్పటికే అభ్యర్థి విషయంలో స్పష్టత ఇచ్చింది. లోకల్స్ ను మాత్రమే అభ్యర్థిగా ఎంపిక చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగంగానే ప్రకటించారు. అంటే ఇతర నియోజకవర్గాలకు చెందిన నేతలు ఇక్కడ పోటీ చేయాలన్న ఆశలు పెట్టుకోవద్దని కూడా సున్నితంగా తెలిపినట్లయింది. అయితే గత ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ తీవ్రంగానే ఢిల్లీలో తనకున్న లాబీయింగ్ తో ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అజారుద్దీన్ ను అభ్యర్థిగా ఎంపిక చేయడం స్థానిక రాష్ట్ర నాయకత్వానికి ఇష్టం లేనట్లు కనిపిస్తుంది. అజారుద్దీన్ ప్రజలకు అందుబాటులో ఉండే నేత కాదని, అందుకే ప్రత్యామ్నాయం వైపు హస్తం పార్టీ చూస్తున్నట్లు సమాచారం. మరి హైకమాండ్ నిర్ణయం ఎలా ఉంటుందన్నది చూడాలి.. మరొక వైపు బీఆర్ఎస్ పార్టీ ఖచ్చితంగా ఈ స్థానాన్ని సొంతం చేసుకోవాలని భావిస్తుంది. తమ సిట్టింగ్ స్థానం కావడంతో తిరిగి నిలుపుకుని కేసీఆర్ కు ఉన్న ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదని, అదే సమయంలో రేవంత్ సర్కార్ పై వ్యతిరేకత ప్రారంభమయిందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేతల్లోనూ, క్యాడర్ లోనూ జోష్ నింపాలంటే ఈ ఎన్నికలో గెలవడం ముఖ్యమని భావిస్తుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు కూడా ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో కీలక నేతలతో భేటీ అయ్యారు. కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్వర్ రెడ్డి తదితరులతో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. అయితే ఇద్దరు ముగ్గురు అభ్యర్థుల పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నారని, సర్వేచేయించిన అనంతరం వారిలో ఒకరికి కేటాయిస్తారని అంటున్నారు. ఇక బీజేపీ కూడా జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై నమ్మకం పెట్టుకుంది. ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓటుబ్యాంకుతో పాటు సినీ ప్రముఖులు ఎక్కువగా ఉండటం తమకు కలసి వచ్చే అంశంగా భావిస్తుంది. అయితే టీడీపీతో పొత్తుకు మాత్రం బీజేపీ సిద్ధపడటం లేదు. టీడీపీ, జనసేనల నుంచి లోపాయికారీ పొత్తును కుదుర్చుకుని బరిలోకి దిగి గెలవాలని బీజేపీ కూడా వ్యూహాలు రచిస్తుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక టిక్కెట్ కోసం అనేక మంది నేతలు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇది కూడా ఢిల్లీ స్థాయిలో తేలాల్సిన అంశం కావడంతో కొందరు కేంద్రమంత్రులు బండి సంజయ్ ద్వారా, మరికొందరు కిషన్ రెడ్డి ద్వారా, ఇంకొందరు రాజ్యసభ్యుడు కె.లక్ష్మణ్ ద్వారా లాబీయింగ్ మొదలుపెట్టినట్లు తెలిసింది. మొత్తం మీద జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక మూడు పార్టీల్లో హీట్ రేపుతుందని చెప్పాలి.

### మండల కేంద్రంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.



తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలోని రామాలయం వీధి నందు శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు శ్రీ కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు.కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా మొదటి రోజైన శనివారం రోజున ఉదయాన్నే పూజా మండపంలో శ్రీకృష్ణుని ప్రతిమలకు పూలతో చక్కగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రజలు పూజలను నిర్వహించారు.అనంతరం భగవద్గీతను పఠనం చేస్తూ విలువైన సందేశాలను వారు భక్తులకు వివరించారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ఆదివారం రోజున మధ్యాహ్నం రెండు గంటల నుండి శ్రీకృష్ణుని ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.గ్రామ పురవీధుల్లో భక్తుల దర్శనార్థం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగింపును నిర్వహిస్తున్నట్లు ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలియజేశారు.ఈ ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి శ్రీకృష్ణుని ఆశీస్సులు పొందాలని ప్రబోధా సేవా సమితి సభ్యులు తెలియజేశారు. మండల పరిధిలోని జొన్నగిరి తదితర గ్రామాలలో ప్రబోధ సేవా సమితి సభ్యులు ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా గోపూజ



శ్రీశైలం కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం శనివారం రోజు ఉదయం ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులంలో గోపూజను నిర్వహించింది.ప్రతినిత్యం ఆలయంలో ప్రాతకాల సమయంలో నిత్యసేవగా గోపూజ నిర్వహించబడుతున్నప్పటికీ, కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రోజు నిత్యసేవతో పాటు విశేషంగా గోపూజ జరిపించబడింది. శాస్త్రోక్తంగా జరుపబడిన ఈ గోపూజలో ముందుగా ఆలయప్రాంగణంలోని గోకులములో గోవులకు, గోవత్సాలకు (ఆవుదూడలకు) పూజాదికాలు జరిపించబడ్డాయి.ఈ విశేష కార్యక్రమములో ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు, వేదపండితులు పూజాసంకల్పాన్ని పఠించారు.ఈ సంకల్పములో సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, అతివృష్టి, అనావృష్టి నివారించబడాలని, పాడిపంటలతో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అగ్నిప్రమాదాలు,

వాహనప్రమాదాలు మొదలైనవి నిరోధించబడాలని, అందరికి శ్రేయస్సు కలగాలని చెప్పబడింది.ఆ తరువాత పూజాదికాలు నిర్విఘ్నంగా జరిగేందుకుగాను ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది.ఉపచారాలతో అనంతరం శ్రీసూక్తంతోనూ, గో అష్టోత్తరమంత్రంతోనూ, గోవులకు షోడశ పూజాదికాలు జరిపించబడ్డాయి. చివరగా గోవులకు నివేదన, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించబడ్డాయి.తరువాత దేవస్థాన గో సంరక్షణశాలలో కూడా శ్రీకృష్ణుని పూజ, గో పూజ జరిపించబడ్డాయి.మన వేదసంస్కృతిలో గోవుకు ఎంతో విశేషస్థానం ఉంది. మన వేదాలు ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు మొదలైనవన్నీ కూడా గోపూజ ఫలితాన్ని విశేషంగా పేర్కొన్నాయి. గోవు సకల దేవతలకు ఆవాస స్థానం కావడం చేత గోవును పూజించడం వలన దేవతలందరినీ పూజించిన ఫలితం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా గోపూజను ఆచరించడం వలన లోకం సుభిక్షంగా ఉంటుందని, శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా జగన్మాత లలితాపరమేశ్వరి గోవురూపంలో భూమిపై సంచరిస్తుందని. చెప్పబడుతోంది.కాగా తాను చేసిన ప్రతిపనిలోనూ వైశిష్ట్యాన్ని బోధించిన శ్రీ కృష్ణపరమాత్మ ఆవుల మంద అధికంగా ఉన్న కారణంగా గోకులంగా పేరొందిన వ్రేపల్లెలో పెరిగి గోవులను కాసి, గోపాలునిగా పేరుగాంచి, గోవుయొక్క అనంత మహిమను లోకానికి తెలియజేశాడు. ఈ కారణంగానే గోకులాష్టమి రోజున గోవును పూజించడం సంప్రదాయం అయింది.ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావుదంపతులు, అర్చకస్వాములు, వేదపండితులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఎన్డీయే భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 16, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామంతో దేశంలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం మారిపోయింది. ఉపరాష్ట్రపతి పదవికి జగ్‌దీప్ ధన్కడ్ రాజీనామా దేశంలో సరికొత్త చర్చకు దారితీసింది. ఈలోగా ఉపరాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం తేదీలు ఖరారు చేయడంతో భారత చరిత్రలో ఇది రెండవ మధ్యంతర ఉపరాష్ట్రపతి ఎన్నికగా నిలుస్తుంది. ఇప్పుడు కాబోయే ఉపరాష్ట్రపతి ఎవరు అన్న అంశంపైనే విస్తృత చర్చ జరుగుతోంది. ప్రస్తుత సంఖ్యాబలం ప్రకారం అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ కూటమికి చెందిన అభ్యర్థే గెలుపొందే అవకాశాలు ఉన్నందున.. ఆ కూటమిలో జరుగుతున్న కసరత్తు ఆసక్తికరంగా మారింది. తాజాగా జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఇదే అంశంపై చర్చించి.. నిర్ణయాధికారాన్ని కూటమి పెద్దన్న భారతీయ జనతా పార్టీ అగ్రనాయకత్వానికే అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాకు ఈ నిర్ణయాధికారాన్ని కట్టబెడుతూ తీర్మానం కూడా చేశారు. అంటే పార్లమెంట్ ఉభయసభల్లో సభా నాయకులుగా ఉన్న ఈ ఇద్దరు ప్రభుత్వ శాసన వ్యూహాల్లో కీలక పాత్ర పోషిస్తున్నందున భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిని ఎన్నుకునే అధికారాన్ని కట్టబెట్టారు. అయితే బీజేపీలోని అత్యుతన్న నిర్ణయాత్మక విభాగం (బీజేపీ పార్లమెంటరీ బోర్డు) ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేయడం కోసం ఈ నెల 17న సాయంత్రం గం. 6.00కు సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి రేసులో ఎవరున్నారన్న చర్చ ఊపందుకుంది.ఉపరాష్ట్రపతి ఎన్నిక పార్లమెంట్ ఉభయ సభల ఎంపీలు కలిసి ఓటు వేసే అరుదైన సందర్భాలలో ఒకటిగా నిలుస్తుంది. సెప్టెంబర్ 9న జరగనున్న ఈ ఎన్నిక జరగనుంది. ఇటువంటి ఎన్నికల్లో పార్టీల సంఖ్యాబలాలు ముఖ్యమైనవి. కానీ ప్రస్తుత పరిస్థితిలో ఎన్డీఏకు అత్యంత సౌకర్యవంతమైన ఆధిక్యం ఉంది. ఈ పరిస్థితుల్లో అధికార కూటమికి గెలుపు వ్యూహాలను పదనుపెట్టి సంఖ్యాబలాన్ని కూడగట్టాల్సిన అవసరం లేదు. కానీ ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే విషయంలో ఒక రాజకీయ సందేశాన్ని పంపాల్సి ఉంటుంది. ప్రాంతం, కులం, భావజాల మూలాలు, కూటమి లెక్కలను సమన్వయం చేయడంతో పాటు ఇంకా అనేక సమీకరణాలను బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది.పార్లమెంటులో ఎన్డీఏ సంఖ్యాబలాన్ని ఒకసారి పరిశీలిస్తే.. రాజ్యసభలో బీజేపీకి 102 సీట్లు ఉండగా మిత్రపక్షాలైన జేడీ(యూ), ఏఐఏడీఎంకే, తెలుగుదేశం, ఎన్పీఎఫ్ మరియు ఇతర మిత్రపక్షాలతో కలిసి మొత్తం 239 సీట్లలో ఎన్డీయే బలాన్ని 132 సీట్లకు చేరింది. రాజ్యసభలో ఏడుగురు నామినేటెడ్ సభ్యులు కూడా ఓటు వేయడానికి అర్హులు. సాధారణ పరిస్థితుల్లో నామినేటెడ్ ఎంపీలు అధికారక కూటమికే మొగ్గ చూపుతుంటారు. ఈ సంఖ్యను కూడా కలుపుకుంటే అధికార కూటమి సంఖ్య 139కు చేరుతుంది. మిగతా సభ్యుల్లో అటు అధికార, ఇటు ప్రతిపక్ష కూటముల్లో లేని తటస్థ రాజకీయ పార్టీలకు చెందిన పార్టీల నేతలు కూడా ఉన్నారు. వారిలో కొందరు అధికార కూటమికి మద్దతు పలికే అవకాశాలు సైతం లేకపోలేదు.ఇక లోక్‌సభలో బీజేపీకి 240 మంది సభ్యులు, మిత్రపక్షాల 53 సీట్లతో కలిపి మొత్తం 542 మందిలో ఎన్డీయే బలం 293కు చేరుతుంది. రెండు సభలు కలిసి ఓటు వేసినప్పుడు, విజయానికి అవసరమైన సింపుల్ మెజారిటీని ఎన్డీయే సులభంగా అధిగమిస్తుంది.

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమి లో కాంగ్రెస్ నుంచి 99 లోక్‌సభ ఎంపీలు, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల మద్దతు కలిపినా సరే ఎన్డీఏ ఆధిపత్యాన్ని దెబ్బకొట్టడం కష్టం.భారత ఉపరాష్ట్రపతి, పార్లమెంటులోని రాజ్యసభకు ఎక్స్-అఫీషియో చైర్మన్ కావడం వల్ల ఈ పదవికి అభ్యర్థిని ఎంపిక చేయడం అధికార కూటమికి వ్యూహాత్మకంగా మారుతుంది. ఎందుకంటే రాజ్యసభలో ప్రతిపక్షాలను అదుపుచేస్తూ సభా కార్యకలాపాలను సజావుగా నిర్వహించడంలో ఆ పదవిలో కూర్చునే వ్యక్తి శక్తి, సామర్థ్యాలు కీలకంగా మారతాయి. అన్నీ ఆలోచించి నాడు ఉపరాష్ట్రతిగా జగ్‌దీప్ ధన్కడ్‌ను ఎంపిక చేసినప్పటికీ.. ఆయన తన అధికార పరిధిని అతిక్రమించి ప్రభావం చూపాలని ప్రయత్నించారనే ఊహాగానాలు చర్చలోకి వచ్చాయి. అప్పట్లో ఉత్తరాదిన హర్యానా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపగలిగే శక్తి, సంఖ్యాబలం కలిగిన జాట్ సామాజికవర్గాన్ని మచ్చిక చేసుకుని దగ్గర చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా ఆ సామాజికవర్గంలో పలుకుబడి కల్గిన విద్యావంతుడు జగ్‌దీప్ ధన్కడ్‌ను ఎంపిక చేసినట్టు కథనాలు వచ్చాయి. గతాన్ని పక్కనపెట్టి.. వర్తమానంలోకి వస్తే.. కొత్త ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలో మోదీ, నడ్డాలు ఎన్నికల లెక్కలు, అంచనాలు, ఊహాగానాలకు అతీతంగా ఆలోచించే అవకాశం ఉంది. కీలకమైన పదవుల విషయంలో బీజేపీ అగ్రనాయకత్వం అందరి ఊహలను తలకిందులు చేస్తూ.. ఎవరూ ఊహించని వ్యక్తులను చివరిక్షణాల్లో తెరపైకి తెచ్చిన ఉదాహరణలు కోకొల్లలు. ఈసారి ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఎలాంటి సమీకరణాలకు ప్రాధాన్యత ఇస్తారన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో కాంగ్రెస్ సొంతంగా అధికారంలో ఉన్నప్పుడైనా, యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ పేరుతో కూటమిగా అధికారంలో ఉన్నప్పుడైనా, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలైనా.. గవర్నర్లుగా పనిచేసినవారినో, కేబినెట్ మంత్రులుగా ఉన్నవారినో ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అంతేకాకుండా వివిధ నేపథ్యాల నుంచి వచ్చినవారు సైతం ఈ పదవిని నిర్వహించారు. మోదీ సారథ్యంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి తన కేబినెట్‌లో మంత్రిగా ఉన్న సీనియర్ నేత ఎం. వెంకయ్య నాయుడును ఉపరాష్ట్రపతి పదవిలో కూర్చోబెట్టారు. ఆయన పదవీకాలం ముగిసిన తర్వాత జరిగిన ఎన్నికల్లో గవర్నర్‌గా పనిచేసిన జగ్‌దీప్ ధన్కడ్‌కు అవకాశం కల్పించారు. కానీ ఈసారి కచ్చితంగా ఈ తరహా నేపథ్యాలు కల్గినవారికే ఉపరాష్ట్రపతి పదవి ఇస్తారని ఊహించే పరిస్థితి లేదు.దశాబ్దకాలంగా బీజేపీ అనుసరించిన విధానాలు, వ్యూహాలను గమనిస్తే.. కీలక పదవులకు ఎంపిక చేసే అభ్యర్థుల ద్వారా రాజకీయంగా బీజేపీ పాదముద్రలను విస్తరించడానికి ఉపయోగించుకుంది. 2017లో ఉత్తరప్రదేశ్ నుంచి దళిత నాయకుడు రామ్ నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా ఎన్నుకున్నప్పుడు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎం. వెంకయ్య నాయుడును ఉపరాష్ట్రపతిగా ఎన్నుకుని, ఉత్తర ? దక్షిణ భారతదేశ సమతుల్యత పాటించింది.2022లో ఒడిశా గిరిజన నాయకురాలు ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా ఎన్నుకోవడంతో, రాజస్థాన్ జాట్ నాయకుడు జగదీప్ ధన్ఖర్‌ను ఉపరాష్ట్రపతిగా ఎన్నుకున్నారు. విభిన్న భౌగోళిక ప్రాంతాలు, కులాలు, సముదాయాలను కవర్ చేసే ఈ రొటేషన్ లాజిక్ ఒక అలిఖిత నియమంగా మారింది. అయితే, ఈసారి పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. ఎందుకంటే బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి, తన సంస్థాగత నిర్మాణాన్ని సమీక్షించడానికి సిద్ధమవుతున్న వేళ అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి ఎన్నిక తెరపైకి వచ్చింది. దీంతో ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక ద్వారా ఏర్పడే ఖాళీ, బీజేపీ జాతీయాధ్యక్షుడి ఎంపిక కసరత్తు.. ఇవన్నీ కేంద్ర మంత్రివర్గంలోనూ భారీ మార్పులు, చేర్పులకు ఆస్కారం కల్గించనుంది. ఉదాహరణకు 2017 మాదిరిగా కేబినెట్ మంత్రిని తీసుకొచ్చి ఉపరాష్ట్రపతి పీఠంపై కూర్చోబెడితే.. ఆ స్థానాన్ని భర్తీ చేయడం ద్వారా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అనివార్యంగా మారుతుంది.ఈసారి ఉపరాష్ట్రపతి పదవికి కచ్చితంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేపథ్యం కలిగినవారికే అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నేపథ్యం లేనివారికి పదవులు ఇచ్చినప్పుడు వారు పార్టీపై కృతజ్ఞత, విధేయతను ప్రదర్శించకుండా విమర్శకులుగా మారి పార్టీని ఇరకాటంలో పడేసిన సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు సత్యపాల్ మాలిక్‌ను గవర్నర్‌గా చేస్తే.. ఆయన కేంద్ర ప్రభుత్వంపైనే తీవ్రమైన విమర్శలు, నిరాధార ఆరోపణలు చేసి ఇబ్బందులు సృష్టించారు. ఆ తర్వాత జగ్‌దీప్ ధన్కడ్ సైతం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసేలా వ్యవహరించారు. అందుకే ఈ రాజ్యాంగ పదవులను ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగి, విధేయతను ప్రదర్శించే వ్యక్తులకే అవకాశం ఇవ్వాలన్న ఆలోచనకు బలం చేకూర్చుతోంది.ఈ సమీకరణాల ప్రకారం బిహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు అవకాశాలను సన్నగిల్లాయి. మితవాద ముస్లిం వర్గాలను ఆకట్టుకోడానికి ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఎంపిక ఒక వ్యూహాత్మక మార్గమని కొందరు సూచిస్తున్నప్పటికీ.. ఖీూ నేపథ్యం లేకపోవడం ఆయకు మైనస్ పాయింట్‌గా మారింది. మ ఎవరిని తెరపైకి తెస్తారు అన్న చర్చ తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది.ప్రతిపక్షం ఖచ్చితంగా ఒక అభ్యర్థిని నిలబెట్టి, ఎన్డీఏ రాజకీయాలను లక్ష్యంగా చేసుకుని ఒక కథనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తుంది. ఎన్డీఏ తమ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఇండి కూటమి కూడా తమ అభ్యర్థిని ప్రకటించాలని చూస్తోంది. కానీ ఎన్డీఏ సంఖ్యాబలం కారణంగా, ఈ పోటీ కేవలం పేరుకే తప్ప ప్రతిపక్ష అభ్యర్థి గెలుపు సాధ్యం కాదని ఆ కూటమి నేతలందరికీ తెలుసు. అయితే అధికార కూటమికి వ్యతిరేకంగా విమర్శలు గుప్పించడానికి, తమ ఓటుబ్యాంకును కాపాడుకోడానికి ఈ ఎన్నికలను ప్రతిపక్ష కూటమి ఒక సాధనంగా మార్చుకోవాలని చూస్తోంది.



## మాటల యుద్ధం... కేటీఆర్ వర్సెస్ రేవంత్

హైదరాబాద్, ఆగస్ట 16, తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉప్పు నిప్పులా ఉంటున్నారు. ప్రతీ విషయానికి ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలకు బాధ్యుడిని చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేటార్ విచుచుకుపడుతున్నాడు. ఇక రేవంత్‌రెడ్డి కూడా వీలు దొరికినప్పుడల్లా కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. తెలంగాణలో వీరి మాటల యుద్ధం కామన్ అయింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరు ఎత్తకుండా తిట్లదాడి చేశారు. 'నేను పెద్ద పెద్ద ఇంగ్లీష్ చదువులు చదువుకోకపోయినా నాకు కామన్ సెన్స్ ఉంది. అమెరికాలో బిచ్చం ఎత్తుకునేటోడు కూడా ఇంగ్లీష్ వస్తుంది.. బాత్‌రూంలు కడిగేటోడు కూడా ఇంగ్లీష్ మాట్లాడగుతుడు కానీ కామన్‌సెన్స్ ఉండాలి కదా' అంటూ కేటీఆర్‌ను టార్గెట్ చేశారు. అదే సమయంలో 'జపాన్, చైనా, జర్మనీ వాళ్లకు ఇంగ్లీష్ రాకపోయినా ప్రపంచాన్ని శాసిస్తున్నారు' అని తెలిపారు.రేవంత్ రెడ్డి, కేటీఆర్ మధ్య రాజకీయ ఘర్షణ కొత్తేమీ కాదు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ నాయకత్వంపై రేవంత్ రెడ్డి విమర్శలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. కేటీఆర్ అమెరికాలో చదువుకుని ఉద్యోగం చేవాడు. కేటీఆర్ తరచూ ఆంగ్లంలో తన రాజకీయ వాదనలను వ్యక్తం చేస్తుంటారు. అందుకే రేవంత్ రెడ్డి ఇంగ్లీష్ చదువులు, కామన్ సెన్స్ గురించి ప్రస్తావించడం ద్వారా, కేటీఆర్ విద్యా అర్హతలను, ఆయన రాజకీయ శైలిని ఎద్దేవా చేశారు.రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యల ద్వారా కేటీఆర్‌ను వ్యక్తిగతంగా లక్ష్యం చేయడమే కాకుండా, తెలంగాణ ప్రజల్లో బీఆర్ఎస్‌పై వ్యతిరేక భావనను పెంచే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. కేటీఆర్‌ను 'విదేశీ శైలి' నాయకుడిగా చిత్రీకరించి, సామాన్య ప్రజలతో దూరం చేసే రాజకీయ వ్యూహంగా దీనిని చూడవచ్చు. ఆయన విదేశీ చదువుల ఒక రాజకీయ ఆయుధంగా ఉపయోగించినట్లు కనిపిస్తుంది. తెలంగాణలోని గ్రామీణ ఓటర్లలో ఎక్కువ మంది సామాన్య జ్ఞానాన్ని, స్థానిక సమస్యలపై శ్రద్ధను ఎక్కువగా విలువైనవిగా భావిస్తారు. ఈ సందర్భంలో, రేవంత్ వ్యాఖ్యలు కేటీఆర్‌ను 'అవగాహన లేని' నాయకుడిగా చూపించే ప్రయత్నంగా ఉన్నాయి. ఇక కేటీఆర్ స్పందన రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను రాజకీయ డైవర్షన్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. ఇది రాజకీయంగా సున్నితమైన సమస్యల నుంచి దృష్టిని మరల్చే వ్యూహంగా ఉండవచ్చని ఆయన ఆరోపణలు సూచిస్తున్నాయి.రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కేటీఆర్‌ను పరోక్షంగా లక్ష్యంగా చేసుకున్నాయని రాజకీయ విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత దాడి కంటే రాజకీయ వ్యూహంగా కనిపిస్తాయి, ఇవి బీఆర్ఎస్ నాయకత్వాన్ని బలహీనపరిచే లక్ష్యంతో చేసినట్లు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ ఘర్షణ రాజకీయ వేదికను ఎలా ప్రభావితం చేస్తుందనేది చూడాలి.

పెద్ద పెద్ద ఇంగ్లీష్ చదువులు చదువుకోకపోయినా నాకు కామన్ సెన్స్ ఉంది

అమెరికాలో బిచ్చం ఎత్తుకునే వాడికి కూడా ఇంగ్లీష్ వస్తుంది.. కానీ జపాన్, చైనా, జర్మనీ వాళ్లకు ఇంగ్లీష్ రాకపోయినా ప్రపంచాన్ని శాసిస్తున్నారు ? రేవంత్ రెడ్డి

## మినరల్స్ లభించని మినరల్ వాటర్
## 1000 చెల్లిస్తే మున్సిపాలిటీ లైసెన్స్

మహబూబాబాద్, పంచభూతాలలో ఒకటైన నీరు సృష్టి ప్రారంభమైన దగ్గర నుండి శ్వాస ద్వారా జీవనం సాగిస్తున్న క్రిమి, కీటక, జంతు, మానవ ప్రాణులకు నీటితోనే జీవనం.రివర్స్ పంపింగ్ వాటర్ (ఆర్వో)సహజంగా దొరికే నీరు కాకుండా , డ్రిల్లింగ్ ద్వారా భూమి క్రింద భాగం నుండి రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని పైకి తీసుకువచ్చి మిషనరీ సహాయంతో శుద్ధి చేసే ప్రక్రియలో భాగంగా 1 లీటర్ పనికోచ్చే నీరు అమ్మకానికి వినియోగించాలంటే , లీటర్ నీరు వృధా చేస్తూ అందులో శుద్ధి పేరుతో నీటిలోని బ్యాక్టీ రియా, లవణాలను తొలగిస్తూ, నీరు రుచి కొరకు రసాయన పదార్థాలను కలపడంతో శుద్ధి చేసిన నీటిలో కాల్షియం, మెగ్నీషియం, సోడియం, సల్ఫర్, ఫాస్ఫరస్ వంటి లవణాలు తొలగించడంతో శుద్ధి చేసిన నీరు మినరల్ వాటర్ అంటూ ఇంటి ముందుకు రాగానే డబ్బులు చెల్లించి మరి నీటిని కొనుగోలు చేసి తాగితే రక్తంలో హిమోగ్లోబిన్ తగ్గి, రోగ నిరోధక శక్తి తగ్గడం, ఎముకల బలహీనత రావడం, శుద్ధి చేసిన నీటిలో సోడియం పొటాషియం ఖనిజాల లోపం ఉండడంతో హెబ్రోనైటినియా వికారం వాంతులు తలనొప్పి అలసట మలబద్ధకం ఒత్తిడి జీవక్రియ సరిగ్గా పనిచేయక పోవడం వంటి సమస్యలు, డబ్బులు చెల్లించి రసాయనాలు కలిపిన మినరల్ వాటర్ కొనుగోలు చేసి తాగడం వలన, అద్భుతంగా సమతుల్యంగా పనిచేసే శరీరం లో (మినరల్స్) లోపం వలన మనిషి శరీరంలో శుద్ధి చేసే ప్రక్రియ తగ్గడంతో నోటి ద్వారా తీసుకున్న నీటిలో కెమికల్స్ రసాయనాలు ఉండడం వలన లివర్ పనితీరు తగ్గడంతో, శరీరంలో వ్యర్థాలు, రక్తంలో ఉన్న వ్యర్థాలు గడ్డకట్టి , కిడ్నీలో రాళ్లు గా ఏర్పడుతూ , ఆకలిని తగ్గిస్తూ, మల బద్ధకాన్ని పెంచుతూ, యూరిన్లో ఇన్ఫెక్షన్, కీళ్ల మధ్య జిగురు తయారు చేసే చర్యను తగ్గిస్తూ, చర్మం కాంతివంతంగా ఉండే గుణాన్ని కోల్పోవడం జరుగుతుంది.

నియమాలా ?

మన నిత్య జీవితంలో అవసరానికి తగిన విధంగా ప్లాస్టిక్ డబ్బాలలో మినరల్ ఆర్వో మినరల్ నీటిని కొనుగోలు చేసి తాగుతూ ఉంటాం, కొనుగోలు చేసి మినరల్ వాటర్ తాగడం తప్పేమీ కాదు, కానీ ఆ నీటిలో నిజంగా మినరల్స్ ఉన్నాయా ? కొనుగోలు చేసి తాగే (ఆర్వో) మినరల్ నీరు పంపిణీ చేస్తున్న మినరల్ ప్లాంట్ యజమానులు సరైన పద్ధతిలో శుద్ధికి సంబంధించిన నియమ, నిబంధనలతో కావలసిన లైసెన్స్, నీటి పరీక్ష , రసాయనాలు ఎంత మోతాదులో కలపాలో సూచించే మిషనరీ సామాగ్రి, వాటర్ ప్లాంట్ మెయింటెనెన్స్, లైసెన్స్, శుభ్రత నియమ నిబంధనలు పాటిస్తున్నారా ? లేదా ? అనే విషయాలను చూసుకొని పూర్తిస్థాయిలో మినరల్స్ అందిస్తున్న ఆల్కలైన్ మినరల్ వాటర్ తాగడానికి వినియోగించు కుంటే చక్కటి ఆరోగ్యం. మానవుల శరీరం దృఢంగా ఆరోగ్యంగా ఉండాలంటే భూమిపైన సహజంగా దొరికే నీరు మట్టి ద్వారా



ప్రవాహం ఉన్నందున నీటిలో క్యాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం, సోడియం, పొటాషియం, సల్ఫర్ , క్లోరైడ్, లెడ్, జింక్ వంటి సహజ ఖనిజ లవణాలు నీటిలో కలిసి ఉన్నందున మానవులు ఆ నీటిని త్రాగితే శరీరానికి కావలసిన పోషకాలు లభించడంతో శరీరంలోనీ ఎముకలు దృఢత్వం చెందుతూ, చర్మం కాంతి వంతంగా మారుతుంది, సహజఇమ్యూనిటీపెరుగుదలకుఉపయోగ కరంగా ఉండడంతో మానవులు ఆరోగ్యంగా జీవిస్తారు.

మినరల్స్ తో కూడిన మినరల్ వాటర్ ఆరోగ్యానికి మంచిదే

మినరల్స్ తో కూడిన ఆల్కలైన్ వాటర్ బాటిల్ ధర ఎక్కువగా ఉంటుంది కనుక సామాన్యులు అంత డబ్బు చెల్లించలేరు. శ్రీమంతులకు మాత్రమే మినరల్స్ తో ఉన్న మినరల్ వాటర్ కొనుగోలు చేసే ధరలోనే ఉంటుంది. ముఖ్యంగా కిడ్నీ, లివర్ సమస్యలతో ఉన్న వారి జీర్ణ వ్యవస్థ , శరీరానికి అవసరమైన మినరల్స్ శరీరం ఉత్పత్తి చేసుకో లేనందున, ఆల్కలైన్ మినరల్స్ ఉన్న వాటర్ కొనుగోలు చేసినా నీరూ తీసుకున్నట్లయితే ఆరోగ్య సమస్య తో ఉన్న వీరి శరీరానికి అవసరమైన మినరల్స్ అందుతాయు.మినరల్ వాటర్ పరీక్ష పరికరాలు ఆన్లైన్ అమెజాన్ ఇతర యాప్లలో కూడా టి డి ఎస్ మీటర్, పి హెచ్ లిక్విడ్, ఓ ఆర్ లిక్విడ్, కొనుగోలు ద్వారా మినరల్ వాటర్ (టెస్ట్) పరీక్ష చేసుకోవచ్చు .ప్లాస్టిక్ డబ్బాలలో వాటర్ ? మినరల్ (ఆర్వో ) నీరు అని ఏమాత్రం ఆలోచించకుండా కొనుక్కొని ఆ నీటిని తాగుతుండడంతో శరీరానికి కావలసిన లవణాలు లేకపోవడంతో ఇమ్యూనిటీ తగ్గుతూ, శరీరంలో నీరు రక్తంలో చిక్కదనం గా ఉండడంతో గుండె పనితీరు పైన అధిక ఒత్తిడి కలిగి మరణానికి కారణమైన ఆశ్చర్య పోవాల్సిన అవసరం ఉండదు ?ప్రకృతిలో దొరికే సహజ వనరులుపూర్వీకుల నుండి వినియోగిస్తున్న మట్టి కుండా, రాగి బింద లో సహజంగా దొరికే చెరువు నీరు, మున్సిపాలిటీ వాటర్ నిటిని కాచి వేడి చేసుకుని కుండ, బింద లలో పోసుకుని తాగినట్లయితే శరీరానికి కావలసిన లవణాలు అంది, శరీరం లోని సెల్స్ ఆరోగ్యవంతంగా ఉండడం వలన, చక్కటి తేజస్సు, జుట్టు పెరగడం, శరీర దృఢత్వం, మోకాళ్ళ చిప్పలలో జిగురు వంటి పదార్థం కాల్షియం సరిపడా ఉండడంతో ఎముకల దృఢత్వం, రోగ నిరోధక శక్తి వ్యవస్థ పటిష్టం అవుతుంది. వైద్యం వైపు చూడకుండా ఆరోగ్యం మెరుగుపడుతుంది.

శుద్ధి చేసిన వాటర్ అవసరం

ఐరన్ ఇనుము యంత్రాలు , ఎలక్ట్రానికల్ వంటి వాటికి మాత్రమే శుద్ధి చేసిన నీరు కావాలి. మానవుల శరీరం కూడా ఒక అద్భుతమైన సహజ కృత్రిమ యంత్రం లాంటిది . ఆరోగ్యంగా ఉన్న యంత్రాన్ని, పోషక పదార్థాలతో కూడిన ఆహారం, సహజ మైన నీరు మాత్రమే వినియోగిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యంగా జీవిద్దాం.

# మెత్తబడుతున్న కవిత



హైదరాబాద్, ఆగస్ట్ 16, కొద్దిరోజులుగా భారత రాష్ట్ర సమితి శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత సొంత పార్టీలో కొంతమంది నాయకులపై యుద్ధం ప్రకటించారు. ఆ యుద్ధాన్ని అలాగే కొనసాగిస్తున్నారు. తన తండ్రిని దేవుడు అంటూనే.. తనను ఇబ్బంది పెడుతున్న నాయకులను దయ్యాలు అని కల్వకుంట్ల కవిత ఆరోపిస్తున్నారు. సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ తనదైన శైలిలో విమర్శలు చేస్తున్నారు. వాస్తవానికి కల్వకుంట్ల కవిత స్థానంలో మరొక నాయకుడు ఉంటే కేసీఆర్ ఇప్పటికే తన పార్టీ నుంచి బయటికి పంపించేవారు. కల్వకుంట్ల కవిత ఆయన కుమార్తె కాబట్టి నిశ్శబ్దంగా ఉంటున్నారు.కల్వకుంట్ల కవిత కూడా భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూనే.. తన మానస పుత్రిక జాగృతిని బలోపేతం చేస్తున్నారు. జాగృతి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. గత పది సంవత్సరాలుగా జాగృతి విషయంలో అంతగా సీరియస్ నెస్ చూపించని కవిత.. కొద్దిరోజులుగా జాగృతిని బలోపేతం చేస్తున్నారు. జిల్లాలకు కమిటీలు ఏర్పాటు చేశారు. సింగరేణి కార్మిక సంఘం నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఒక రకంగా తెలంగాణ అప్పటి పరిస్థితులను ఆమె చూపిస్తున్నారు.భారత రాష్ట్ర సమితిలో తన తండ్రిని దేవుడు అని వ్యాఖ్యానించిన ఆమె.. కొంతమంది నాయకులను దయ్యాలు అని ఆరోపిస్తున్నారు. అంతేకాదు ఒక నాయకుడిని ఉద్దేశించి ఇటీవల లిల్లీపుట్ అని కూడా ఆరోపించారు. అయితే అటువంటి కవిత ఇప్పుడు సొంత పార్టీ లోకి వెళ్తున్నారా.. త్వరలో దానికి ముహూర్తం ఖరారయిందా.. ఈ ప్రశ్నలకు అవును అనే సమాధానం చెబుతున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతి జిల్లాలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఒక సర్కులర్ విడుదల చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కలవకుండా కవిత తన సామాజిక మాధ్యమ వేదికలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ తెలంగాణ తల్లి విగ్రహాలను ఆమోదించేది లేదని పేర్కొన్నారు. అదే కాదు ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ తల్లి విగ్రహాలు ఎక్కువ రోజులు నిలబడవని కవిత స్పష్టం చేశారు. వచ్చే రోజుల్లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ విగ్రహాలను సకల మర్యాదలతో గాంధీభవన్ కు పంపిస్తామని కవిత ట్వీట్ చేశారు.ఈ ట్వీట్ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది. ఎందుకంటే భారత రాష్ట్ర సమితి తిరిగే అధికారంలోకి వస్తే అనే పదాన్ని వాడారు కాబట్టి కవిత.. తిరిగి సొంత పార్టీలోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కెసిఆర్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడం వల్లే కవిత ఆ వ్యాఖ్యలు చేశారని సమాచారం. ఇటీవల రాఖీ పండుగ సందర్భంగా కేటీఆర్ కు కవిత రాఖీ కట్టని విషయం తెలిసిందే. పైగా కేటీఆర్ భారత రాష్ట్ర సమితికి కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ఉన్నారు. అలాంటప్పుడు ఆయన కవిత రాకకు ఒప్పుకున్నారా.. అందువల్లే ఆమె ఇలాంటి ట్వీట్ చేశారా.. అనే ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజలు ఊరూరా ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ తల్లిని ప్రజలపై రుద్దే కుట్రకు ఈ అరాచక ప్రభుత్వం తెరలేపింది.

## ఒకే కుటుంబంలో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు

ఖమ్మం, ఆగస్టు 16, తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కోసం అధికారులు ఎంత కఠిన చర్యలు తీసుకుంటున్నా.. అక్కడక్కడ అవకతవకలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. తాజాగా ఖమ్మం జిల్లాలో ఒకే కుటుంబానికి ఐదు ఇళ్లు మంజూరు కావడం వివాదాస్పదమైంది. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా అనర్హులకు ఇళ్లు మంజూరు కావడంతో 1950 ఇళ్లను అధికారులు రద్దు చేసిన సంగతి తెలిసిందే.తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలి విడతలో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. ప్రస్తుతం ఈ ఇళ్లన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. వీలైనంత వరకు పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి.. ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున గృహప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో అధికారులు చాలా అప్రమత్తంగా ఉంటున్నారు. 360 డిగ్రీలో అభ్యర్థుల వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే.. అర్హులుగా తేలిన వారిని ఎంపిక చేసి వారికి ఇళ్లు కేటాయిస్తున్నారు. అయితే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని చోట్ల అనర్హులకు ఇళ్లు మంజూరవుతున్నాయి. తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఓ వార్త సంచలనంగా మారింది. ఒకే కుటుంబంలో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారనే వార్తపై పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అవుతోంది. ఆ వివరాలు..ఖమ్మం జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారనే వార్త సంచలనంగా మారింది. ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ తొలి విడతలో ఇళ్లు మంజూరైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా లాభం లేదని.. అధికారులు దీనిపై స్పందిచడం లేదని.. తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎవరైనా దీనిపై స్పందించి విచారణ చేపట్టాలని.. నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉంటే కొన్ని రోజుల క్రితం హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు 1950 మందికి మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1,950 మంది అనర్హులకు ఇళ్లు మంజూరు చేసినట్లు గుర్తించారు. దీంతో అధికారుల వారి ఇళ్లను రద్దు చేశారు. మరోవైపు శాఖపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు అధికారులు. వీరందరికి గతంలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని.. అప్పుడు నిర్మాణం చేపట్టలేదని అధికారులు తెలిపారు.తొలి విడత రూ.లక్ష చెల్లించే సమయంలో వీరి గురించి తెలిసిందని.. అందుకే వెంటనే వీరికి కేటాయించిన ఇళ్లను రద్దు చేసి వారి స్థానంలో అర్హులైన కొత్త వారికి అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. మరి ఇప్పుడు ఒకే కుటుంబంలోమ 5గురు ఇందిరమ్మ ఇళ్లను పొందారన్న దానిపై అధికారులు ఎలా

## పాకిస్తాన్ నుంచి వచ్చి.... అమ్మాయిల జీవితాలు నాశనం చేస్తూ... ఆధార్ ఎలా వచ్చింది...

హైదరాబాద్, ఆగస్ట్ 16 దొంగ ఓట్లు.. రోహింగ్యాలు.. ఇతర ప్రాంతాల నుంచి మనదేశంలోకి వచ్చిన వ్యక్తుల గురించి మన రాజకీయ పార్టీలు గొంతు చించుకుంటాయి. పార్లమెంట్లో రచ్చ రచ్చ చేస్తుంటాయి. కానీ అసలు విషయం మాత్రం పట్టించుకోవు. ఇవాళ్టికి సరిహద్దుల వద్ద గట్టిగా బందోబస్తు నిర్వహిస్తున్నాం. చొరబాట్లను అడ్డుకుంటున్నాం.. అని రకరకాలుగా రాజ్యాన్ని ఏలుతున్న పెద్దలు చెబుతుంటారు. కానీ వాస్తవంలో అందుకు విరుద్ధమైన ఘటనలు జరుగుతుంటాయి. అటువంటి దారుణమే హైదరాబాదులో ఒకటి చోటుచేసుకుంది. ప్రధాన మీడియా దీనిని పట్టించుకోలేదు కానీ.. సోషల్ మీడియా ద్వారా ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.హైదరాబాదు నగరంలోకి 2010లో పాకిస్తానీ కుటుంబం వచ్చింది. అప్పట్లో ఈ స్థాయిలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు లేదు. విజిటింగ్ వీసా మీద వచ్చిన వారు ఇక్కడే ఉండిపోయారు. వీసా గడుగు ముగిసిన తర్వాత కూడా ఇక్కడే ఉన్నారు. పైగా మన దేశం నుంచి ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు కూడా పొందాడు. ఆ తర్వాత ఓ కంపెనీలో ఆ వ్యక్తి ఉద్యోగిగా చేరాడు. ఆ కంపెనీలో పని చేస్తున్న ఓ యువతితో మాట కలిపాడు. ఆ తర్వాత స్నేహంగా ఉండడం మొదలుపెట్టాడు. అతడి తో మొదట్లో అమ్మాయి అంతగా మాట్లాడేది కాదు. ఆ తర్వాత అతడు మాట్లాడే మాటలకు కరిగిపోయింది. అవన్నీ నిజమని నమ్మింది. దీంతో అతడి ప్రేమలో పడిపోయింది. ఆ తర్వాత అతడు క్రమంగా తన వైపుకు తిప్పుకున్నాడు. పెళ్లి చేసుకున్నాడు. హైదరబాద్ వారిద్దరు ఓ ప్రాంతంలో సంసారాన్ని మొదలుపెట్టారు. మొదట్లో ఆమెతో బాగానే ఉండే అతడు.. ఆ తర్వాత తను అసలు రూపాన్ని ప్రదర్శించడం మొదలుపెట్టాడు. ఇటీవల కాలంలో ఆ అమ్మాయిని దూరం పెట్టడం ప్రారంభించాడు. కొద్ది రోజులుగా ఇంటికి రావడం కూడా మానేశాడు. అతడి వ్యవహార శైలి పై ఆమెకు అనుమానం వచ్చింది..దీంతో అతడిని ఫాలో అయింది. అయితే అతడు మరో అమ్మాయి తో ఉంటున్నట్టు తేలింది. దీంతో వారిద్దరిని ఆ మహిళ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పింది. అయితే ఈ వ్యవహారంలో మరిన్ని సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఆ వ్యక్తి పాకిస్తాన్ దేశానికి చెందినవాడు. మనదేశంలోకి విజిటింగ్ వీసా మీద వచ్చాడు.. ఆ తర్వాత ఇక్కడే ఓ కంపెనీలో పని చేశాడు. అక్కడ పనిచేస్తున్న అమ్మాయిని ట్రాప్ చేశాడు. చివరికి పెళ్లి చేసుకొని ఇలా మోసం చేశాడు.. అయితే దీనిపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే కేవలం ఇతడు మాత్రమే కాకుండా.. చాలామంది పాకిస్తాన్ దేశస్తులు మన దేశంలో ఇలానే ఉన్నారని తెలుస్తోంది. వారంతా కూడా మన దేశపు గుర్తింపు కార్డులను పొందారని తెలుస్తోంది. వీరిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందనేది చూడాల్సి ఉంది.

## కారులో భారీ కుదుపు తప్పదా...

హైదరాబాద్, ఆగస్టు 16, తెలంగాణలో రాజకీయాలు ముదిరిపాకాన పడ్డాయా? కాళేశ్వరం రిపోర్టు అసెంబ్లీలో పెడితే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందా? మరో నలుగురు మాజీ ఎమ్మెల్యేలు జంపింగ్ అయ్యేందుకు ప్లాన్ చేస్తున్నారా? రేపో మాపో కాషాయ కండువా కప్పుకునేందుకు ఆయా నేతలు సిద్ధమయ్యారా? వీరితోపాటు ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారం పోయి ఏడాది తర్వాత కారు పార్టీ భారీ కుదుపులను లోనవుతోంది. కీలక నేతలపై రకరకాల కేసులు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ మారేందుకు సిద్ధమైనట్టు సంకేతాలు వెలువడుతున్నాయి. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కారు దిగేశారు. కమలం గూటికి వెళ్లిపోయారు. రేపో మాపో మరో ముగ్గురు ఎమ్మెల్యేలు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఫామ్ హౌస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో గువ్వల బాలరాజు, పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు, బీరం హర్షవర్ధన్ రెడ్డిలు కీలకంగా వ్యవహరించారు. ఇప్పుడు ఆయా నేతలు కమలం తీర్థం పుచ్చుకోవాలని ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే గువ్వల పార్టీ మారిపోయారు. నేతలు ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక కారణాలు చాలానే ఉన్నాయని కారు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాళేశ్వరం నివేదిక అసెంబ్లీలో చర్చకు పెడితే తమ పార్టీకి ఇబ్బందులు తప్పవన్నది కొందరు నేతల మాట. దానిపై దర్యాప్తుకు ఆదేశిస్తే కేసీఆర్, హరీశ్‌రావులకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు.. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసు వెంటాడుతోందని, ఇంకోవైపు ఫార్ములా కేసు వర్కింగ్ ప్రెసిడెంట్ మెడకు చుట్టుకుందని అంటున్నారు. పరిస్థితి గమనించిన ఆ పార్టీ నేతలు ముందుగా తట్టా బుట్టా సర్దుకుని వలస పోయేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. కొద్దిరోజుల కిందట మీడియా మాట్లాడిన తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. మా పార్టీలోకి వచ్చేందుకు బీఆర్ఎస్ నుంచి దాదాపు డజను మంది నేతలు రెడీ ఉన్నారని చెప్పారు. అందులో ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నారట. ఈ నేపథ్యంలో మాజీలు తమ దారి చూసుకుంటున్నారని అంటున్నారు. ఇప్పటికే బీజేపీ పెద్దలతో ఆయా నేతలు టచ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఆయా నేతలు పార్టీ మారినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు. మాజీలు పార్టీలు మారడంతో ఏం చెయ్యాలో తెలియని పరిస్థితిలో బీఆర్ఎస్ పడింది. రేపటి రోజు బీఆర్ఎస్ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. బీజేపీలో చేరనున్న పైలెట్ రోహిత్ రెడ్డి?? ఫామ్ హౌస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో కీలకంగా ఉన్న గువ్వల బాలరాజు, పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు, బీరం హర్షవర్ధన్ రెడ్డి. ఇప్పటికే బీజేపీలో చేరిన గువ్వల బాలరాజు. రేపో మాపో కాషాయ కండువా కప్పుకోనున్న మరికొందరు.

## స్నేహం పేరుతో నమ్మించి ఓ యువతిపై పది మంది సామూహిక అత్యాచారం




జనగాం ఆగస్టు 16 : స్నేహం పేరుతో నమ్మించి ఓ యువతిపై పది మంది సామూహిక అత్యాచారం చేశారు. నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన జనగామ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం%ౌ%జనగామ జిల్లాకు చెంది మోహమ్మద్ ఒవైసి, ముత్యాల పవన్ కుమార్, బౌద్ధుల శివ కుమార్, నూకల రవి, జెట్టి సంజయ్, ఎమ్.డి. అబ్దుల్ ఖయూం, పుస్తకాల సాయి తేజ, ముట్టాడి సుమంత్ రెడ్డి, గుండ సాయి చరణ్ రెడ్డి, ఒరుగంటి సాయి రామ్ అనే యువకులు ఓ యువతితో పరిచయం పెంచుకున్నారు.స్నేహం పేరుతో యువతిని జనగా-సూర్యాపేట రోడ్డులోని టీ వరల్డ్ లో ఓ రూమ్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఆ యువతిపై పది మంది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితులలో ఒకడు యువతిని గోవాకు తీసుకెళ్లి ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. ఈ విషయం బాధితురాలి అత్తకు తెలియడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి పది మంది నిందితులను సిద్దిపేట రోడ్డులో పట్టుకున్నారు. సిఐ దామోదర్ రెడ్డి, ఎస్ఐ భరత్ వారిని తనదైన శైలిలో ప్రశ్నించడంతో నిజాలు ఒప్పుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలుబాలకృష్ణుని వేషాదరణలతో చిన్నారుల సందడి






తాండూర్ లో కృష్ణాష్టమివేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు చిన్నారులకు వారి వారి తల్లిదండ్రులు బాలకృష్ణుని వేషధారణలతో అలంకరింపజేసి వేడుకలను జరుపుకున్నారు. అందుకోసం ముందుగానే కృష్ణుని వేషాధారణకు అవసరమైన రెడీమేడ్ అలంకరణ వస్తువులను కొనుగోలు చేసి పెట్టుకున్నారు. ఇక కృష్ణాష్టమి పర్వదినం రావడంతో వారి పిల్లలకు కృష్ణుని వేషాలు వేసుకున్నారు. అనంతరం వారి పిల్లలను చూస్తూ తల్లిదండ్రులు మంత్రముగ్ధులవడం కనిపించింది. అయితే శ్రావణమాసంలో వచ్చే కృష్ణాష్టమి పండగకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా కృష్ణాష్టమి పండగ రోజు చాలా ప్రాంతాలలో ఉట్లు ఏర్పాటు చేసి వాటిని కొడుతుంటారు. అసలు కృష్ణాష్టమికి ఉట్లు ఎందుకు కొడతారో చాలా మందికి తెలియదు. ఇదో ధర్మసందేహంగా ఉంటుంది. సాధారణంగా శ్రీకృష్ణుడు చిన్నతనంలో ఉండగా పలువురి ఇళ్లలోకి ప్రవేశించి పాలు, పెరుగును దొంగతనం చేసేవాడు. అయితే ఆ రోజుల్లో బుల్లి కృష్ణుడి ఆగడాల నుంచి తప్పించుకోవడానికి చాలా మంది తమ పాలు, పెరుగు ఉట్టిలో పెట్టి అందకుండా పైన కట్టేవాళు అయితే కృష్ణుడు చాలా చిలిపిగా తన స్నేహితులను ఒంగోబెట్టి వాళ్లపైకి ఎక్కి ఉట్టిలోని పాలు, పెరుగును దొంగతనం చేసి తినేవాడు. ఆనాటి కృష్ణుడి గురించి పలువురికి చాటిచెప్పేందుకు, ముఖ్యంగా ఇప్పటి బాలలకు కృష్ణుడి అల్లరి గురించి తెలియజేసేందుకు కృష్ణుడి జన్మదినమైన రోజు ఉట్లు ఏర్పాటు చేసి వాటిని పగలకొట్టి సంతోషిస్తుంటారు. కృష్ణాష్టమి నాడు భక్తులు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం శ్రీకృష్ణుని పూజిస్తారు. శ్రావణ మాసంలో లభించే పళ్ళు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ స్వామికి నైవేద్యంగా పెడతారు. ఊయల కట్టి అందులో శ్రీకృష్ణ విగ్రహమును పడుకోబెట్టి ఊపుతూ రకరకాల పాటలు, కీర్తనలు పాడతారు. ఏది ఏమైనా ఈ తరహా సంప్రదాయ పండుగలను నేటి 5 జి కాలంలో కూడా తూచా తప్పకుండా పాటించడం గొప్ప పరిణామం అని ఆధ్యాత్మికవేత్తలు ప్రశంసిస్తున్నారు. ఇలా చేయడం వల్ల రాబోయే తరానికి మన గత ఆధ్యాత్మికథ చరిత్రను కళ్ళకు కట్టినట్టు అర్థం చేపించిన వాళ్ళం అవుతామని పండితులు స్పష్టం చేస్తున్నారు.

# సూపర్ సిక్స్ పాక్షిమమే తులసి రెడ్డి



విజయవాడ సూపర్ సిక్స్ హామిల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే హామిని నిన్నటి నుండి కూటమి ప్రభుత్వం అమలు చేయడం హర్షనీయం. కానీ అదే సమయంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడంలో వాస్తవం లేదని కాంగ్రెస్ నేత తులసి రెడ్డి అన్నారు.

కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటిపోయింది .ఇప్పటికి కూడా సూపర్ సిక్స్ హామిల్లో ప్రధానమైన హామి యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు 3000 రూపాయలు ఇస్తామని చెప్పినటువంటి హామి ఇంతవరకు అమలు కాలేదు. 3000 రూపాయలు కాదు కదా మూడు రూపాయలు కూడా ఇవ్వలేదు. ఆ విధంగా నిరుద్యోగ యువతను కూటమి నమ్మించి మోసగించడం జరిగింది. ఎస్సీ ,ఎస్టీ ,బీసీ ,ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని కూటమి తన మేనిఫెస్టోలో పేర్కొంది .14 నెలలు అయింది .ఇప్పటివరకు అతిగతి లేదు .ఆ విధంగా ఎస్సీ ,ఎస్టీ, బీసీ ,ముస్లిం మైనార్టీలను కూటమి ప్రభుత్వం మోసగించింది.

ఆడబిడ్డ నిధి కింద 19 --59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు ,ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని కూటమి తన ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ లో చెప్పింది .14 నెలలు దాటిపోయింది. ఇంతవరకు పైసా ఆర్థిక సహాయం చేయలేదు .ఆ విధంగా ఆడబిడ్డలను నమ్మించి మోసగించింది కూటమి ప్రభుత్వం. తల్లికి వందనం పథకం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి 15000 రూపాయలు ఇస్తామని చెప్పి అందులో 2000 రూపాయలు కోత కోసి కేవలం 13 వేల రూపాయలు మాత్రమే ఇవ్వడం జరిగింది. అది కూడా 2024--25 విద్యా సంవత్సరానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు .ఆ విధంగా తల్లికి వందనానికి కోత విధించింది. రైతులకు సంబంధించి అన్నదాత సుఖీభవ పథకం కింద కూడా అనేక కోతలు .రాష్ట్రంలో 76 లక్షల మంది రైతులు ఉంటే అందులో 46 లక్షల 86 వేల మందికి మాత్రమే అన్నదాత సుఖీభవ పథకం అమలు అవుతోంది .ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం 20000 రూపాయలు ఇస్తామని మేనిఫెస్టోలో , సూపర్ స్టిక్స్ హామీలలో చెప్పి ప్రస్తుతం 6000 కోత కోసి 14 వేల రూపాయలు మాత్రమే ఇస్తా అంటుంది .అందులో కూడా 2024-- 25 ఆర్థిక సంవత్సరానికి పైసా కూడా ఇవ్వలేదు. కాబట్టి ఆ విధంగా అన్నదాత సుఖీభవ పథకానికి కోతలు విధించడం జరిగింది. కాబట్టి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పినట్లు సూపర్ సిక్స్ సూపర్ హిట్ కాదు. అది పాక్షికంగా మాత్రమే అమలవుతోందని అన్నారు.

# నక్కలపల్లిలో నిర్వాసిత రైతుల ధర్నా



వరంగల్ మామ్నూర్ ఎయిర్ పోర్ట్ భూములు కోల్పోతున్న రైతులు నక్కలపెల్లి రోడ్డు పై ధర్నాకు దిగారు. రోడ్డుకు అనుకొని వున్న విలువైన భూమలకి తక్కువ పరిహారం ఇస్తున్నారు అని రైతుల ఆవేదన. బహిరంగ మార్కెట్ లో ప్రస్తుతం ఒక్క ఎకరానికి 3 నుండి 4 కోట్లు డిమాండ్ వున్న భూములని కోల్పోతున్నాం అని వారి వాదన. మేము అభివృద్ధి కి అడ్డు కాదు.. సరైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులను మోహరించారు.

# బంగారం దోపిడి కేసులో మరో ఇద్దరు అరెస్టు

సూర్యాపేట బంగారం దుకాణం దొంగతనం కేసులో మరో ఇద్దరు అరెస్టు అయ్యారు. ఏ4 మాలిక్ మొల్ల, ఏ 6 అమర్ భట్ లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 60 లక్షల విలువైన 554 గ్రాముల ఆభరణాలు, 92,500/- వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ నరసింహకేసు వివరాలు వెల్లడించారు.

# యూరియ కోసం రైతుల అందోళన

మహబూబాబాద్ బయ్యారం మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు చెప్పుల క్యూలు కడుతున్నారు. మన గ్రోమెర్ షాపు ఎదుట తెల్లవారుజామున నుండే రైతలు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. వారం రోజుల నుండి తిరుగుతున్న యూరియా దొరకడంలేదు అంటూ రైతులు అందోళన కు దిగారు. గ్రోమెర్ షాపు ఎదుట రైతులు అందోళన చేసారు. రైతుల అందోళనతో మన గ్రోమోర్ షాపు తెరవలేదు. చెప్పుల క్యూ కిలో మీటర్ దూరం దాటింది.

## ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు

మంచిర్యాల: ఎగువన కురుస్తు భారీ వర్షాలకు మంచిర్యాల జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లోకి భారీగా వరద నీరు చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు. ప్రస్తుత నీటి మట్టం 15.5545 టీఎంసీలు.ఇన్ఫ్లో 27,007 క్యూసెక్కులు..ఔట్ ఫ్లో 13,007 క్యూసెక్కులు. కడెం ప్రాజెక్టు 17 గేట్లు ఎత్తి ?1,50,000 క్యూసెక్కుల నీరు విడుదల చేసారు. కడెం నుండి ఎల్లంపల్లిలోకి నీరు చేరుకుంటోంది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్స్ ఎత్తి నీళ్లు వదిలే అవకాశం వుంది...

# సింగూరు ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

సంగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. అధికారులు మూడు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసారు. జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఇన్ ఫ్లో- 20136 క్యూసెక్కులు. ఔట్ ఫ్లో- 22138 క్యూసెక్కులు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం- 29.917 టీఎంసీలు నమోదయింది. ప్రాజెక్టు ప్రస్తుత నీటి సామర్థ్యం- 21.849 టీఎంసీలు.

# అమెరికా బయలుదేరిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ తన చిన్న కుమారుడు ఆర్యను కాలేజీలో చేర్పించేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికా బయల్దేరారు. 15 రోజుల పాటు కవిత అమెరికా పర్యటనలో వుంటారు. పెద్ద కుమారుడు ఆదిత్య, చిన్న కుమారుడు ఆర్యతో కలిసి అమెరికాకు ఎమ్మెల్సీ కవిత బయలుదేరారు. శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఆమెకు భర్త అనిల్, కుటుంబ సభ్యులు, తెలంగాణ జాగృతి నాయకులు సెండాఫ్ చెప్పారు. సెప్టెంబర్ ఒకటో తేదీన హైదరాబాద్ కు కవతి తిరిగి రానున్నారు.

# ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు

హైదరాబాద్ ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు అయ్యారు. మరో ఐదుగురు పరారీలో వున్నారని మాదాపూర్ డీసీపీ వినీత్ వెల్లడించారు. నిందుతుల నుండి పది కేజీల గోల్డ్ కోటెడ్ వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ ఎస్వోటీ , క్రైమ్స్, లా అండ్ ఆర్డర్ టీం లు కలిసి 24 గంటల్లో ఛేదించారు. ఈ గ్యాంగ్ లో మొత్తం ఏడుగురు ఉన్నారు... బీహార్ కు చెందిన ముఠా. ఆరుగురు ఖజానా కు వచ్చారు.. డిప్యూటీ మేనేజర్ పై కాల్పులు జరిపారు. పూణే దగ్గర అదుపులోకి తీసుకున్నాం. ఆశిష్, దీపక్ ఇద్దరినీ అరెస్ట్ చేశాం. ఈ గ్యాంగ్ లోని ఒక్కొక్కరి మీద మూడు, నాలుగు కేసులు ఉన్నాయి. ఏ 1 గ్యాంగ్ లీడర్ పైన రెండు మర్డర్ కేసులు, డెకాయిట్ కేసులు ఉన్నాయి. జగద్గిరిగుట్ట లో ఉంటున్న ఆశిష్ ఇంటికి బీహార్ గ్యాంగ్ వచ్చి రెక్కీ నిర్వహించిందని అన్నారు.

12 రోజులుగా రెక్కీ చేశారు

రెండు బైక్ లా మీద ఆరుగురు వచ్చారు.. అఫెన్స్ టైం లో బైక్ ల నెంబర్ ప్లేట్లు మార్చారు.. దీపక్ అందరికి ఆ అకామిడిషన్, బైక్ లు ఏర్పాటు చేశాడు. 12 రోజులు రెక్కి చేసినప్పుడు ఖజానా లో గోల్డ్ ఎక్కువగా ఉంది. సెక్యూరిటీ లేదు, పారిపోవడానికి ఈజీగా ఉందని ఖజానాను సెలెక్ట్ చేసుకున్నారని అన్నారు. బీహార్ గ్యాంగ్ మన స్టేట్ లో చేయడం ఇదే ఫస్ట్. బెంగాల్, బీహార్ లలో 4 కోట్ల రాబరీ కూడా చేశారని అన్నారు.

# శృంగేరి శారదంబా అలయంలో ఘనంగా శ్రీమంతం వేడుకలు

ఖమ్మం నగరంలోని శృంగేరి శారదాంబ ఆలయంలో అమ్మవారికి శ్రీమంతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శారదా మాతకు ద్రావణమాసంలో ఇలా శ్రీమంతం చేయడం ద్వారా సంతానం లేని వారికి సంతానం కలుగుతుంది అని భక్తుల నమ్మకం . శంకరమఠంలోని శృంగేరి శారదాంబ అమ్మవారు సంతానం లేని వారికి సంతానం కల్పిస్తుంది . అమ్మ ఆదేశులకోసం శ్రావణమాసం లో జరిగే ఈ కార్యక్రమానికి సంతానం లేని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పాకిస్థానీ ఫహద్ కు రిమాండ్.. జైలుకు తరలింపు

హైదరాబాద్ : బంజారాహిల్స్ లో పట్టుబడ్డ పాకిస్థానీ ఫహద్ ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచలగూడ జైలుకు తరలించారు. భారత్ పౌరసత్వం ఎలా పొందాడని వివరాలు లంగర్ హౌస్ పోలీసులు సేకరిస్తున్నారు. ఫహద్ కుటుంబసభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. పాకిస్థాన్ పంపించేందుకు హైదరాబాద్ పోలీసుల ప్రయత్నం. ఎంతమందిని ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేశాడనే వివరాలు కుడా సేకరిస్తున్నారు.

# ఏసీఏ ఆధ్యక్షుడిగా ఎంపి చిన్ని ఏకగ్రీవ ఎన్నిక

తాడేపల్లి విజయవాడ క్లబ్ లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఏసీఏ నూతన కమిటీ ఎన్నిక అయింది. ఏసీఏ అధ్యక్షుడిగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శిగా ఎంపీ సానా సతీశ్ ఎన్నికయ్యారు. మరో 34 మందితో ఏసీఏ నూతన కమిటీ ఎన్నికయింది. ఏసీఏ అధ్యక్షుడిగా గెలిచిన కేశినేని శివనాథ్ కి ధృవపత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ అందజేసారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఏసీఏ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కార్యవర్గానికి ధన్యవాదాలు. తమ పై వుంచిన నమ్మకాన్ని రాబోయే మూడేళ్ల కాలంలో ఏసీఏ ద్వారా క్రికెట్ అభివృద్ధికి, స్టేడియాల్లో మౌళికవసతులు కల్పించేందుకు కృషి చేస్తాము. ఎపీలోని క్రికెట్ క్రీడాకారులు అంతర్జాతీయ మ్యాచ్ ల్లో, ఐపిఎల్ లో ఆడే విధంగా తీర్చిదిద్దుతాము. అందుకు కావాల్సిన సపోర్టింగ్ స్టాఫ్ , కోచ్ లను ఏర్పాటు చేస్తాము. వైజాగ్ స్టేడియంలో జరుగుతున్న ఏపీఎల్ సీజన్-4 చాలా విజయవంతంగా జరుగుతుంది. ×రాబోయే మూడేళ్ల కాలంలో అన్ని నిర్ణయాలు జనరల్ బాడీ లో వున్న ప్రతి సభ్యుడికి ఎటువంటి ఇబ్బంది లేని విధంగా తీసుకుంటాము...ఏసీఏ ప్రతిష్ట మరింతగా పెంచే విధంగా కృషి చేస్తామని అన్నారు.

# మట్టి వినాయకులతో పర్యావరణాన్ని పరిరక్షిద్దాం –జై గణేశా భక్తి సమితి

ప్రతి మండపంలో మట్టి వినాయకుని ప్రతిష్టించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని జై గణేష సేవా సమితి విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు ఎమ్మెల్సీ దయానంద్, నూతన చైర్మన్ ఆనందరావు ఈ మేరకు పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణహితంగా జరుపుకునే పండుగలతోనే మేలు జరుగుతుందని అన్నారు. గత పదివేల క్రితం స్థాపించిన తమ సంస్థ పర్యావరణ మట్టి గణపతి ఏర్పాటు చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. ఇందులో భాగంగా తాము ఖైరతాబాద్ మహాగణపతి నిర్వాహకులు సుదర్శన్ ఇతరులను విజ్ఞప్తి చేయగా పర్యావరణహిత గణపతిని ఏర్పాటు చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా కేవలం మట్టి గణపతులనే పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షితం అంటూ విస్తృతంగా చైతన్య పరుస్తామని అన్నారు.

## నీటిలో చిక్కుకున్న కుటుంబం, రక్షించిన ఎస్డీఆర్ఎఫ్ బృందం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణం లోని సుభాష్ నగర్ లో ఓ కుటుంబం నీటిలో చిక్కుకుంది.. వారిని ఎస్డీఆర్ఎఫ్ బృందం తాళ్ళ సహాయంతో క్షేమంగా బయటకు తీశారు.. ఈరోజు కురిసిన భారీ వర్షంతో సుభాష్ నగర్ కాలనీ లో వాగు ఒడ్డునే ఉన్న ఓ కుటుంబం అందులో చిక్కుకుపోయింది.. సమాచారం అందుకున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సాహసోపేతంగా కుటుంబ సభ్యులను సురక్షితంగా బయటికి చేర్చారు.. ఈ సందర్భంగా మాజీమంత్రి జోగు రామన్న ఎస్డీఆర్ఎఫ్ బృందానికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు..

# ఐదేళ్ల బాలుడిపై రేప్, హత్య పోలీసుల అదుపులో నిందితుడు



మేడ్చల్ ఉప్పల్ పిఎస్ పరిధి రామంతపూర్ కేసీఆర్ నగర్ లో దారుణం జరిగింది. మనోజ్ పాండే(5) అనే ఐదేళ్ల బాలుడిని కమర్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేసాడు. బాలుడు మనోజ్ పాండే(5) ఈనెల 12న మిస్సింగ్.. మిస్సింగ్ కేసు నమోదు అయింది. ఛత్తీస్ గడ్ చెందిన ఈశ్వర్ పాండే, పులేశ్వరి పాండే దంపతులకు ముగ్గురు సంతానం.. ఇద్దరు ఆడ పిల్లలు పూనం(10), గుడియ(8)ఒక బాలుడు మనోజ్ పాండే(5) వున్నారు. కుటుంబ సమేతంగా రామంతాపూర్ లోని కేసీఆర్ నగర్ లో ఉంటూ ఇక్కడే టింబర్ డిపోలో పనిచేస్తున్నాడు.. అదే టింబర్ డిపోలో బీహార్ కు చెందిన కమర్ పనిచేస్తున్నాడు. ఈనెల 12న బాలుడు మనోజ్ పాండే ను కిడ్నాప్ చేశాడు, మనోజ్ పాండే ను కమర్ రేప్ చేసి, గొంతు నుమిలి హత్య చేసినట్లు తెలుస్తుంది. హంతకుడు కమర్ పోలీసుల అదుపులో ఉన్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఉప్పల్ పోలీసులు, బాలుడు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు..

# ఆధార్ మాదిరిగా భూములకు 'భూధార్' ప్రతి కమతానికీ ప్రత్యేక సంఖ్య?!

హైదరాబాద్ భూముల సమగ్ర వివరాలు అందుబాటులోకిరిజిస్ట్రేషన్ మ్యుటేషన్‌కు సర్వే తప్పనిసరి చేస్తూ భూభారతి చట్టంలో సెక్షన్లు ఏర్పాటు.ఒక వ్యక్తి ఆధార్ నంబర్?తో వారి వయసు, చిరునామా, సిమ్‌కార్డులు, ఆదాయ వివరాలన్నీ తెలుసుకోవచ్చు. అదే విధంగా సర్వే, ఉప సర్వే నంబర్లు, మ్యాప్, సరిహద్దులు, బీమా, నేల రకం, విస్తీర్ణం, ఎలా సంక్రమించింది, లింక్ డాక్యుమెంట్లు, బ్యాంకు రుణాలు, మార్టిగేజ్ తదితర మొదలైన భూమి గురించి సమగ్ర సమాచారాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే, భూధార్?ను అమలు చేయనుంది. వీలైనంత త్వరగా దీన్ని అమల్లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెవెన్యూ శాఖను ఇటీవల ఆదేశించారు.

ఈ భూధార్? అమలులోకి వస్తే భూ ఆక్రమణలు, నకిలీ పత్రాల సృష్టికి అడ్డుకట్ట పడనుందని ప్రభుత్వం భావిస్తోంది. భూధార్ జారీ చేయాలంటే ప్రతి భూమిని సర్వే చేయాల్సి ఉంటుంది. భూమి సరిహద్దులను అక్షాంశాలు, రేఖాంశాలతో గుర్తించి భూధార్‌లో నమోదు చేస్తారు. దీన్ని రెండు పద్ధతుల్లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే పూర్తికాక ముందు తాత్కాలిక, పూర్తయ్యాక శాశ్వత భూధార్? అని రెండు భూధార్లు జారీ చేయనుంది.ప్రతి రిజిస్ట్రేషన్-మ్యుటేషన్?కు సర్వే తప్పనిసరి చేస్తూ భూ చట్టంలో సెక్షన్లు చేశారు. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలానికి కనీసం 43 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లను ప్రభుత్వం నియమిస్తోంది. ప్రస్తుతం 7,000 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇటీవల సర్వే నిర్వహించిన రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన పైలట్? గ్రామాల్లో మొదట భూధార్? కార్డులు జారీ చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

నంబరు నమోదు చేస్తే చాలు.

రాష్ట్రంలో 70.59 లక్షల మంది రైతులు ఉండగా, 1.40 కోట్ల ఎకరాల సాగు భూములున్నాయి. భూ దస్త్రాలు యాజమాన్య హక్కుల చట్టం ఆర్వోఆర్, కింద ప్రతి కమతానికి పట్టా పాసుబుక్? జారీ చేస్తుండగా, అందులో పలు సర్వే నంబర్ల కింద ఉన్న భూమి వివరాలు తప్ప ఏమీ ఉండటం లేదు.భూధార్‌తో ఒక రైతుకు చెందిన భూమి సమగ్ర వివరాలు అందుబాటులోకి తీసుకురానున్నాయి. ఇందులో భాగంగా కమతాలన్నింటినీ కంప్యూటరీకరించడం, ప్రభుత్వం వద్ద భూమికి సంబంధించిన పథకాలన్నింటినీ జోడించే ప్రక్రియలను చేపట్టనున్నారు.అనంతరం ఆర్వోఆర్ 2025 భూభారతి చట్టంలోని సెక్షన్ 9 రూల్ 9, ప్రకారం రాష్ట్రంలోని ప్రతి భూమి ప్లాట్?కు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను జారీ చేయనున్నారు. ఆన్‌లైన్‌లో ఈ నంబర్?ను నమోదు చేయడం ద్వారా భూమి సమగ్ర వివరాలు తక్షణమే తెలుసుకునే అవకాశాలు ఉంటాయి. దీనికోసం రెవెన్యూశాఖ ఇప్పటికే కార్యాచరణ చేపట్టింది.

డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ ఆధునికీకరణ పథకంలో భాగంగా ప్రతి కమతానికి యూఎల్‌పిన్,భూ ఆధార్, భూధార్ జారీ చేయాలని కేంద్రం సూచిస్తోంది. పలు రాష్ట్రాలు ఇప్పటికే తాత్కాలిక లేదా శాశ్వత భూధార్ కార్డుల జారీ ప్రారంభించాయి.ప్రతి భూదస్త్రానికి పక్కాగా గుర్తింపు తీసుకురావాలన్నదే 'భూధార్'ప్రధాన లక్ష్యం. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్న ఆ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది. అయితే తాత్కాలిక, శాశ్వత అనే రెండు పద్ధతులను అనుసరిస్తోంది. ప్రతి పౌరుడికీ 'ఆధార్' కేటాయించినట్లే దేశంలోని ప్రతి కమతానికీ ఒక విశిష్ఠ నంబర్?ను కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. ఇదే భూధార్. దీనివల్ల ఆస్తులకు రికార్డు ఉంటుంది.

## శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ స్థలం ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

### మంత్రి కి ధన్యవాదాలు తెలిపిన చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహా కమిటీ సభ్యులు

వనపర్తి. అమరచింత పట్టణం నందు ఉన్న మస్తీపూర్ క్రాస్ రోడ్ లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకై అమరచింత పట్టణ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ కమిటీ సభ్యులు మంత్రి డాక్టర్



వాకిటి శ్రీహరి ని కలిసి విగ్రహ స్థలం ఏర్పాటుకై అనుమతి కోరగా మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి విగ్రహ స్థలం ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా అమరచింత పట్టణ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ కమిటీ సభ్యులు మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## గవర్నర్ కార్యక్రమంలో మీడియాకు నో ఎంట్రీ

వికారాబాద్ హరిత రిసార్ట్ లో ఎన్జీవో బ అధికారులతో రెండు రోజుల పాటు క్షయ వ్యాధి అవగాహన సదస్సు కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ సమావేశానికి మీడియాను మరియు మున్సిపల్ మాజీ చైర్మన్ లను పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి మీడియాను ప్రజాప్రతినిధులను రాణి ఇవ్వకపోవడం ఏంటని ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తూ వెనుతిరిగి వెళ్లిపోయారు.మీడియాను, ప్రజాప్రతినిధులను అనుమతి ఇవ్వకపోవడంతో అసలు ఈ కార్యక్రమం ప్రజల కోసమా లేక ఏదైనా రహస్య కార్యక్రమమా అని మాజీ మునిసిపల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ భర్త రమేష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎర్రబారుతున్న పత్తి పంట... రైతులకు తీరని నష్టం



సి.బెళగల్ గత వారం రోజుగా కురుస్తున్న ముసురువానతో పత్తి పంటకు తెగులు సోకి వాడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సి.బెళగల్ మండలంలో 7వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పత్తి మొక్కలు ఎర్రబారి వాడు ముఖం పట్టి ఆకులు నేలవైపు వాలుతున్నాయి. లక్షల్లో పెట్టుబడి పెట్టి కాయలు కాసే సమయంలో ఇలా పంట వాడిపోవడం ఆందోళన కలిగిస్తుందని రైతులు వాపోతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో పత్తి పంట వర్షానికి, మీరు ఎక్కువ నిద్రవస్థకు చేరుకుంటుంది. పత్తి పంట పూత రాలీ ఎర్రబారుతుంది. దీంతో మొక్క కుళ్ళిపోతుందని రైతులు వాపోతున్నారు. పత్తితోపాటు, ఉల్లి, కంది పంటలు కూడా దెబ్బతిన్నాయి. రైతులు దిక్కుతోతని స్థితిలో పడిపోయారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు.. అన్నదాతకు అపార నష్టాన్ని మిగిల్చాయి. వానకాలం ప్రారంభంలో జూన్ నాటి నుంచి కూడా సి.బెళగల్ మండలంలో ఆశించినంత వర్షాలు కురవలేదు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా జూన్లో విత్తనాలు విత్తారు.అయితే వర్షాలు కురకపోవడంతో అవి మొలకెత్తలేదు.దీంతో రెండోసారి విత్తనాలు విత్తాల్సిన దుస్థితి నెలకొంది.ఇటీవలే మోస్తారు వర్షం నుంచి భారీ వర్షాలు కురవడంతో చెరువులు, కుంటల్లో నీళ్లు చేరాయి. కాగా పంటలు నీట మునగడంతో చేతికొచ్చిన పంటలు నీటిపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మేడ్చల్ జిల్లాలో సరోగసి కేసులో బయటకు వచ్చిన సంచలన నిజాలు



హైదరాబాద్ ఆగష్టు 16 మేడ్చల్ జిల్లాలో సరోగసి కేసులో సంచలన నిజాలు బయటకు వచ్చాయి. సరోగసి మహిళలతో నిందితురాలు బాండ్లు రాయించుకున్నారు. తనిఖీల్లో భారీగా ప్రామిసరీ నోట్లు, బాండ్లు బయటపడ్డాయి. పెద్ద ఎత్తున హార్మోన్ ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐవిఎఫ్ సెంటర్‌కు వెళ్లిన దంపతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. నిందితురాలు లక్ష్మి ఏజెంట్ల ద్వారా సేకరిస్తున్నారు. లక్ష్మి నివాసంతో పాటు హెగ్డే ఆస్పత్రి, పలు ఫెర్టిలిటీ సెంటర్ల రిపోర్టులు గుర్తించారు. ఐవిఎఫ్ సెంటర్లతో లక్ష్మికి ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. లక్ష్మి మహిళలను ప్రలోభపెట్టి సరోగసికి ఒప్పిస్తున్నారు. రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు మహిళలతో బేరం కుదుర్చుకున్నట్టు పోలీసులు గుర్తించారు. సరోగసి కోసం వచ్చిన దంపతుల దగ్గర రూ.25 లక్షల వరకు లక్ష్మి వసూలు చేస్తున్నారు. పిల్లల విక్రయాల కేసులో గతంలో లక్ష్మిని ముంబయి పోలీసులు అరెస్ట్ చేశారు. 8 మంది మహిళలకు ఇప్పటికే పోలీసుల నోటీసులు ఇచ్చారు. నిందితురాలు లక్ష్మి, కుమారుడు నరేందర్ పోలీసులు రిమాండ్‌లో ఉన్నారు.డాక్టర్ విద్యుల్లత పేరుతో అనుమతులు తీసుకుని యూనివర్సల్ సృష్టి పేరుతో ఐవిఎఫ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో డాక్టర్ నమ్రత, డాక్టర్ విద్యుల్లత కలిసి ఐవిఎఫ్ కోసం వచ్చిన దంపతులకు సరోగసికి వెళ్లలని చెప్పి లక్షలాది రూపాయలు వసూలు చేశారు. రాజస్థాన్ కు చెందిన దంపతులను సరోగసి పేరుతో వేరే వారి బాలుడిని తీసుకుని వచ్చి ఇవ్వడంతో వారు డిఎన్ఎ టెస్ట్ చేయించగా వారి కుమారుడు కాన్న తేలింది. దీంతో బాధితులు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. విచారణ చేసిన పోలీసులు నిందితులను వరుసగా అరెస్టు చేస్తున్నవిషయం తెలిసిందే. నిందితులు విదేశాలకు పారిపోకుండా ఉండేందుకు పోలీసులు ముందుగానే లుక్‌ఔట్ నోటీసులు జారీ చేసిన విషయం విధితమే. డాక్టర్ నమ్రత పిల్లలను కిడ్నాపింగ్ చేసే గుజరాత్‌కు చెందిన డోక్ల గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నట్లు బయటపడింది.

# ఆరోగ్య శాఖ మంత్రి అడ్రస్ లేడా.?

అల్లూరి సీతారామరాజు జిల్లా, వైద్య శాఖలో సమస్యలను పట్టించుకోని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గిరిజన ప్రాంతాల్లో తిష్ట వేసిన సమస్యలు.కనిపించని రోడ్లు, అంబులెన్స్ , "బిజీ బిజీ" పర్యటనల్లో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్,మాకు ఓట్లు ఉండవు కాబట్టే మమ్మల్ని పట్టించుకోరు అంటు గిరిజనలు కన్నీటి ఆవేధన.కనీసం మీరు అయిన పట్టించుకోండి అంటు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వేడుకుంటున్న గిరిజన సంఘాలు.పడకేసిన ప్రశ్నించే తత్వం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో, సోషియల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాలు.అల్లూరి జిల్లాలో కళ్లు చెమర్చే ఘటనజ్వరంతో బాధపడుతున్న కన్నకూతురును వర్షంలో కాలినడకన ఆస్పత్రికి మోసుకెళ్తున్న తండ్రి.జోరువానలో 4 కిలోమీటర్లు నడుచుకుంటూ తన బిడ్డను ఆస్పత్రిలో చేర్చిన తండ్రి, నరకయాతన చూసాను అంటు కన్నీటి ఆవేధన.ఆ తండ్రి బాధ కనిపించడం లేదా అంటు సోషియల్ మీడియాలో ప్రశ్నిస్తున్న నెటిజన్స్.

## శ్రీ జిమ్ లో కసరత్తు చేసిన ఓవైస

హైదరాబాద్ పాతబస్తి తాడ్ బన్ ప్రాంతములొ జిం ప్రారంభవొత్సవానికు వచ్చిన అసదుద్దీన్ ఒవైసి ఎక్ససైజ్ చేసారు.... అసదుద్దీన్ ఒవైసికి జిం చేయడంలొ ప్రావిణ్యం ఉందీ. యువత వ్యాయాము చేసి తమ అరొగ్యాని సమతుల్యంగా ఉంచాలని, చెడువాసాల బారిన పడకుండ కసరత్తు చేసి అరొగ్య సమస్యలు తలెత్తకుండ ఉండాలంటె హైద్రబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసిని ఆదర్శంగా తిసుకొవాలని అన్నారు. ఓ వైపు తన ప్రసంగాలతొ జనాన్ని ఆకర్శిస్తు, మరొ వైపు ఎక్సర్ సైజు చేస్తు యువతకు ఆదర్శంగా మారారు.

# చెరువులవుతున్న రహదారులు

హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వర్షానికి ఎక్కడ చూసిన రోడ్లపై వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. కూకట్పల్లి ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ప్రధాన రహదారి రేణుక ఎల్లమ్మ దేవాలయం ముందు ఉన్న కల్వర్టుపై భారీగా వరద నీరు నిలిచిపోవడంతో ప్రయాణం సాగించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గాజుల రామారం నుండి కేపి హెచ్ బి కి ప్రధాన రహదారి కావడం, నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తూ ఉంటాయి.దీనికి తోడు రహదారి ఇరుకుగా ఉండడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

## రెండు రూపాయలకే టీ షర్ట్...రూపాయి కే బట్టలు అంటూ ప్రచారం..

### ఎగబడ్డ జనం.. షట్టర్ దించేసిన యాజమాన్యం

నెల్లూరు నగరం లోని నిప్పో సెంటర్ వద్ద పుట్టవీది వద్ద ప్రధాన రహదారి పై ఖీఏఖీ హెర్బల్ క్లినిక్ భవనం పైన ఆరోన్ గార్మెంట్ పేరుతో ఓ నూతన బట్టల దుకాణం వారు రూపాయికే టీ షర్ట్, రెండు రూపాయలకు ప్యాంట్ అంటూ అసత్య ప్రచారం చేయడం తో పండగ పూట జనం రోడ్లపై పడిగాపులు కాయవలిసిన పరిస్థితి ఏర్పడింది,తక్కువ డబ్బులకు పండగ పూట ఆఫర్ ఇస్తున్నారని కొందరు ప్రచారం చేయడం తో ఆరోనా గార్మెంట్ వద్ద జనాలు గుమ్మికూడారు,అక్కడ జనాలు గుమ్మికూడడం చూసి ఆ దోవన వెళ్ళే వారు కూడా ఆగడం తో అక్కడ పెద్ద సంఖ్యలో జనాలు చేరడం తో అక్కడ ఏమి జరుగుతుందో అర్థం కాక మరికొంత మంది ఎక్కడకు రావడం తో పెద్ద సంఖ్యలో ప్రజలు రావడం తో పోలీసులు కూడా రంగ ప్రవేశం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది,మొత్తానికి దుకాణం నిర్వాహకుడు అసత్య ప్రచారానికి అనవసరంగా ప్రజల సమయం వృధా కావడం తో పాటు ఆశగా వచ్చిన వారు నిరాశగా వెనుదిరిగుతున్నారు..కొందరు బట్టల దుకాణం తెరుచుకుంటుందే మోనని ఆశగా అక్కడే ఎదురు చూస్తూవున్నారు.

# కడెం ప్రాజెక్టు పరిశీలించిన జిల్లా కలెక్టర్.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం సాయంత్రం కడెం ప్రాజెక్టును అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు, ఇన్ఫ్లో %-% అవుట్ ఫ్లో వివరాలను కలెక్టర్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఎగువ నుండి ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటిని నిరంతరం పరిశీలించాలని సమీప ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పశువుల కాపరులు, రైతులు, మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిసర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలకు వెళ్ళరాదని హెచ్చరించారు. అధికారులు నిరంతరం 24 గంటలపాటు అప్రమత్తంగా పనిచేస్తున్నారని, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన, అత్యవసర సమయాల్లో ప్రజలు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్‌ను 9100577132 సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు విట్టల్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కడెం ప్రాజెక్టు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే.



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి శనివారం సాయంత్రం కడెం ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటి ఇన్ఫ్లో, అవుట్‌ఫ్లోపై కలెక్టర్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. గేట్లు ఎత్తిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రాజెక్టు భద్రతపై ఎటువంటి లోపం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరద ముప్పు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, కడెం ప్రాజెక్టు నుంచి విడుదల చేసే నీటిపై ప్రజలకు ముందుగానే సమాచారం చేరేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అధికారులు సమన్వయం చేసుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం మొరంచపల్లి వాగు ఉధృతిని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు.



**భూపాలపల్లి ప్రజాబలం ప్రతినిధి:** ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాగు ఉధృతి దృష్ట్యా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినపుడు తక్షణమే స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. ఎగువ భాగం నుండి ఎంత వరద వచ్చే అవకాశం ఉందన్న వివరాలు ఈ ఈ ప్రసాదు ను అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తగా ఉండాలని వరద పరిస్థితిని ముందుగా అంచనా వేసి ప్రజలను ముందస్తు అప్రమత్తం చేయాలని సూచించారు.

వాతావరణ శాఖ సూచన మేరకు జిల్లాకు ఆదివారం వరకు రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి రక్షణ చర్యలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

భారీ వర్షాలు దృష్ట్యా ప్రజల, పశువుల ప్రాణరక్షణలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సేవలకు ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే విధంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ కు కాల్ చేయాలని సూచించారు. 90306 32608 ద్వారా వచ్చిన ఫిర్యాదులకు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పశువులను మేతకు బయటికి పంపకుండా ఇంటి పట్టునే ఎత్తైన ప్రదేశంలో ఉంచాలని తెలిపారు.

రహదారులపై నీళ్లు చేరిన ప్రాంతాల్లో ప్రజలు ప్రయాణాలు చేయకుండా పటిష్ట నియంత్రణ చేయాలని తెలిపారు. కొంతమంది. అత్యుత్సాహంతో ఎవరైనా దాటే ప్రయత్నం చేసే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ సిబ్బంది పటిష్ట పర్యవేక్షణలో బారికేడ్లు ఏర్పాటు చేసి రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ ప్రసాద్, డిఈ వరుణ్, ఏఈ షర్ఫ్‌ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



దేశం గర్వించదగిన గిరిజన నేత, దిషోం గురు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. శిబుసోరెన్ స్వంత గ్రామం జార్ఖండ్ రామ్‌గఢ్ జిల్లాలోని నెమ్రాలో సంప్రదాయ గిరిజన ఆచారాలతో నిర్వహించిన దిషోం గురు శ్రద్ధాంజలి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు.

ఈ సందర్భంగా శిబుసోరెన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారి సేవలను స్మరించుకున్నారు. శిబు సోరెన్ గారు జార?ండ్ కు మాత్రమే కాకుండా దేశంలోని గిరిజన, అణగారిన వర్గాల పక్షాన బలమైన స్వరం వినిపించారని, వారి జీవితం ఆ వర్గాల కోసం అంకితం చేశారని కొనియాడారు. గిరిజన సమాజ ప్రయోజనాల కోసం శిబుసోరెన్ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఈ సందర్భంగా శిబు సోరెన్‌కుమారుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తో పాటు కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి సంతాపాన్ని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**సనత్ నగర్ ( ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఆగస్టు 16** మానవాళికి భగవద్గీత ద్వారా శ్రీ కృష్ణుడు ధర్మ మార్గాన్ని బోధించారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం సికింద్రాబాద్ లోని సంగీత్ థియేటర్ సమీపంలో గల ఇస్కాన్ టెంపుల్ ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మం, ప్రేమ, కరుణ బోధనలు నేటికీ మనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. పూజల అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను సన్మానించి ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట రాంగోపాల్ పేట, బన్సీలాల్ పేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, నాయకులు మహేష్ యాదవ్, వెంకట్, ఆలయ కమిటీ సభ్యులు సహదేవ్ దాస్, రాధిక పతి, హరికృష్ణ, భక్త సురేష్ తదితరులు ఉన్నారు.




## భక్తి, భజనలు, ఆనందోత్సాహాలతో హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో అత్యంత వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, ఆగస్టు 16, 2025 : బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా భక్తులకు శ్రీరాధా గోవింద, శ్రీగోదా కృష్ణ, శ్రీ లడ్డు గోపాల్ దర్శనాలు కల్పించబడ్డాయి. అలాగే ప్రతి ఒక్కరికి శ్రీ లడ్డుగోపాల్ ఊంజల (ఝులన్) సేవలో పాల్గొనే అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో నగరంలోని భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి శ్రీకృష్ణుని అనుగ్రహాన్ని పొందారు.

ఆగస్టు 16వ తేదీన శనివారం ఉదయం 4:30 గంటలకు "షోడశోపచార సేవ"తో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీ రాధాగోవింద స్వామివారికి విశిష్ట పుష్పాలు, నూతన వస్త్రాలు, నైపుణ్యంతో తయారు చేసిన ఆభరణాలతో శృంగార అలంకారం చేయబడింది.



ఉదయం 6 గంటలకు శృంగారారతితో దర్శనం ప్రారంభమైంది. ఈ సమయానికే శ్రీ లడ్డుగోపాల్ ఊంజల సేవ మొదలైంది. సర్వలోక శ్రేయస్సు కోసం ఉదయం శ్రీ సుదర్శన నరసింహ హోమం నిర్వహించి ప్రార్థించారు. అనంతరం చప్పన్ భోగ్ (56 నైవేద్యాలు) సమర్పణ భక్తుల హృదయాలను రంజింపజేసింది. రాజభోగారతి, మధురభజనలు, కీర్తనలతో దేవాలయం దైవనామస్మరణతో మార్మోగిపోయింది. సంప్రదాయ నృత్యాలు, సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు రోజు మొత్తం భక్తి భావాన్ని పెంపొందించాయి. దొన్న ప్రసాదం నిరంతరం పంపిణీ చేయబడింది.

ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, అర్ధరాత్రి ఇలా మొత్తం నాలుగు సార్లు విశిష్ట అభిషేకాలు నిర్వహించబడ్డాయి. వాటిలో ప్రధానమైన "విశేష 108 కలశ మహాభిషేకం" సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమైంది. పంచామృతం, పంచగవ్య, పండ్ల రసాలు, అరుదైన ఔషధ పౌడర్లు, నవరత్నాలు, ప్రత్యేక పుష్పాలు, ఔషధ ద్రవ్యాలతో పాటు భక్తులు సేకరించిన భారతదేశంలోని ఏడు పవిత్ర నదుల జలాలతో స్వామివారికి అభిషేకం చేశారు. %అ% తదుపరి హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు, శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ(ఐఐటీ మద్రాస్, ఎంటెక్) గారు "భగవాన్ శ్రీకృష్ణ అవతార మహిమ"పై చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది. గీత, భాగవత శ్లోకాలతో శ్రీకృష్ణ అవతార లక్ష్యం ు సజ్జనుల పరిరక్షణ, దుష్ట సంహారం, ధర్మస్థాపన తదితర అంశాల గురించి వివరించారు. గీత బోధనలను నిత్యజీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.

అనంతరం సాయంత్రం మహా మంగళారతి, ఊంజల సేవ, మధుర భజనలు, సంప్రదాయ నృత్యాలు నిర్వహించబడ్డాయి. అనంతరం అందరికీ మహా ప్రసాదం వడ్డించబడింది. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ కార్యక్రమాలను ప్రతిబింబించే థీమాటిక్ ప్రదర్శనలు ు హరేకృష్ణ చాలెంజ్, కృష్ణ కిడ్స్, జప క్లబ్, ఐక్య విద్య, ఫోక్ యూత్ బోధనలు, తీర్థయాత్ర, హరేకృష్ణ వాణి మొదలైనవి ు ఏర్పాటు చేయబడ్డాయి.

మహాభిషేకం ఏ రాత్రి 10 నుండి అర్ధరాత్రి వరకు :

రాత్రి 10 గంటలకు ప్రారంభమయ్యే మహాభిషేకంలో ఏడు పవిత్ర నదుల జలాలు, అరుదైన పండ్ల రసాలు, ఔషధ పౌడర్లు, హిమాలయ మూలికలు, సుగంధ ద్రవ్యాలు,



విశిష్ట పుష్పాలతో అభిషేకం జరగనుంది. అలాగే అర్ధరాత్రి 12 గంటలకు మహా మంగళారతి అనంతరం ఊంజల సేవ, ఏకాంత సేవ జరుగుతుంది.

హరేకృష్ణ హెరిటేజ్ టవర్, హరేకృష్ణ కల్చరల్ సెంటర్‌లో ఉత్సవాలు :

బంజారాహిల్స్‌లోని ప్రధాన ఉత్సవాలతో పాటు, నార్సింగి – కోకాపేట్‌లో నిర్మాణంలో ఉన్న హరే కృష్ణ హెరిటేజ్ టవర్‌లోనూ శ్రీ రాధాకృష్ణ దర్శనం, శ్రీ లడ్డుగోపాల్ ఊంజల సేవ భక్తులకు కల్పించబడింది. మరోవైపు బేసిల్ ఉడ్స్ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. మహాభిషేకం, మహామంగళారతి, ఊంజల సేవలు నిర్వహించబడ్డాయి. ఇదే విధంగా సంగారెడ్డి , కందిలోని హరేకృష్ణ కల్చరల్ సెంటర్‌లో కూడా ఉత్సవాలు నిర్వహించబడ్డాయి.

ఆగస్టు 17 %-% నందోత్సవం %ఁ% 129వ వ్యాసపూజ :

ఆగస్టు 17 తేదీన, ఆదివారం నందోత్సవం సందర్భంగా ప్రత్యేక నైవేద్యాలు, హరినామ సంకీర్తన, ఊంజల సేవలు జరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా హరేకృష్ణ ఉద్యమ స్థాపకాచార్యులు, విశ్వగురు శ్రీల ప్రభుపాదుల 129వ వ్యాసపూజ సాయంత్రం వైభవంగా జరుగుతుంది. గురుపూజ, భక్తుల హారతులు, ప్రత్యేక నైవేద్య సమర్పణ, ప్రసాద పంపిణీతో ఉత్సవం ముగుస్తుంది. భక్తుల సౌకర్యార్థం కోసం విస్తృత ఏర్పాట్లు, ప్రసాద పంపిణీ ఏర్పాట్లు చేయబడ్డాయి.

# శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి హైదరాబాదుకు చెందిన వెంకట కామేశ్వరరావు రూ. 1,01,116 /-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు యం. రవికుమార్‌కు అందజేయడం జరిగింది. అనంతరం దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి

# వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 :** వాతావరణ శాఖ సూచన, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజారక్షణ విషయంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని,భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టులో నీటిమట్టం వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రానున్న 24 నుండి 36 గంటలు భారీ నుండి అతి భారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.శనివారం మంచిర్యాల జిల్లాలో రెడ్ అలర్ట్, ఆదివారం ఆరెంజ్ అలర్ట్ ఉందని, ప్రజారక్షణ దిశగా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతుందని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం 15.6 టి.ఎం.సి.నీరు ఉందని, ఎస్.ఆర్.ఎస్.పి.కడెం ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఇన్ఫ్లో పెరుగుతుందని,ప్రాజెక్టులో 17 టి.ఎం.సి.నీటిమట్టం దాటితే ప్రజలకు ప్రమాద హెచ్చరికలు జారీ చేసి నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. టామ్ టామ్ ద్వారా నది పరివాహక ప్రాంతాల వద్దకు వెళ్లకుండా,వాగు, నది దాటకూడదని ప్రజలకు తెలియపరచడం జరుగుతుందని తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేసే బిచ్చగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో నివసించే వారిని వెంటనే తరలించాలని,వాగులు,నదులు ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రజలను, వాహనదారులను అటువైపుగా వెళ్లకుండా సిబ్బందితో కొండగట్టు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. రహదారులు,కల్వర్టులు దెబ్బతింటే ఆ ప్రాంతంలో ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, వైద్య సిబ్బంది వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ప్రాణ నష్టం,ఆస్తి నష్టం,పశు నష్టం జరగకుండా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల తక్షణ సహాయం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736- 250501 ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. జిల్లాలో 90 మంది సభ్యులతో కూడిన 3 ఎస్.డి.ఆర్.ఎఫ్.బృందాలు, రక్షణ పరికరాలతో తక్షణ సహాయం కోసం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. లో లెవెల్ కాజ్ వేల వద్ద ప్రజలు వెళ్లకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి అప్రమత్తత చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 :** మంచిర్యాల జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాల సూచన ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని,త్రాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 9,12,13 వార్డులలో పర్యటించి వార్డులలో చేరిన వర్షపు నీటి స్థితిని పరిశీలించి కొత్త కొమ్ముగూడెం గ్రామంలోని చెరువు నీటి నిల్వ పరిస్థితిని మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...వాతావరణ శాఖ సూచన ప్రకారం మంచిర్యాల జిల్లాలో శనివారం రోజున రెడ్ అలర్ట్,ఆదివారం రోజున ఆరెంజ్ అలర్ట్ ఉన్నందున ప్రజల రక్షణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలోని కాజ్ వేలు,వాగులు,నదుల వద్దకు ప్రజలు ఎవరు వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారుల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు నిర్వహిస్తున్నామని,లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీటి సరఫరా చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.నివాస ప్రాంతాలలో నీటి విలువలు లేకుండా తొలగించాలని అంతర్గత రహదారులు,మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. జిల్లాలో వరదలకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చిన ఎదుర్కొనేందుకు 3 ఎస్.డి.ఆర్.ఎఫ్.బృందాలు, జిల్లా అధికారులతో సిద్ధంగా ఉన్నామని,ప్రజల రక్షణకు కావలసిన పరికరాలు అందుబాటులో పెంచడం జరిగిందని,గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు పరిశీలించి ప్రజల తక్షణ సహాయం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని తెలిపారు.అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, ల్యాబ్, రిజిస్టర్లు,పరిసరాలను పరిశీలించారు.ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వ్యక్తిగత శుభ్రత,పరిసరాల పరిశుభ్రత ప్రజలకు వివరించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు,సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండి బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**

జై గణేష్ భక్తి సమితి గోషామహల్ నియోజకవర్గం కార్యదర్శి నియామకపు ఆర్డర్ కాపీ ని దయానంద్ గుప్తా ఎమ్ ఎల్ సి మరియు చైర్మన్ ఆనంద్ ద్వారా స్వీకరిస్తున్న చేతన్ కుమార్ నియామకం చేసిన్నదులకు కృతజ్ఞతలు తెలియ చేశారు కార్యక్రమం లో బద్దం సతీష్ గౌడ్ నియోజకవర్గం అధ్యక్షులు,రాధా కృష్ణ ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ డి ఆర్ పి గా ప్రశంస పత్రం అందుకున్న బండ శాంకరి



మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మండల డి.ఆర్.పి గా విధులు నిర్వహిస్తున్న బండ శాంకరి ఉత్తమ డి. ఆర్.పి గా ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్ బి. జనక్ ప్రసాద్, అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య, మంచిర్యాల డీసీపీ ఎంగడి భాస్కర్ ల చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మండలాన్ని 100 రోజుల్లో 100% అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేందుకు గాను విశేష కృషి చేసినందుకుగాను జిల్లా వయోజన విద్యాశాఖ ద్వారా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ డి.ఆర్.పి గా ఎంపికైన బండ శాంకరి ని పలువురు అభినందించారు. ఈసందర్భంగా ఉత్తమ డి ఆర్ పి గా ఎంపికైన బండ శాంకరి మాట్లాడుతూ కాసిపేట మండలాన్ని వంద శాతం అక్షరాస్యత మండలంగా తీర్చి దిద్దేందుకు సహకరించిన జిల్లా వయోజన విద్యాశాఖ జిల్లా అధికారి అజ్మీరా పురుషోత్తమ్ నాయక్ కి కాసిపేట మండల అధికారులకు, వాలంటీర్ లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# వేములవాడ పట్టణంలో కొనసాగుతున్న మట్టి శిధిలాల తొలగింపు పనులు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం కొలువై ఉన్న పట్టణంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. రాజన్న ఆలయ ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. రాజన్న ఆలయ ప్రధాన రహదారి తిప్పాపురం బ్రిడ్జి నుండి ఆలయం వరకు రోడ్డు వెడల్పుకు ప్రభుత్వం 47 కోట్ల రూపాయలను మంజూరు చేసి, రాజన్న ఆలయం నుండి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు రోడ్డును 80 అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రధాన రహదారిలో ఇప్పటికే 254 ఇండ్లు, వ్యాపార దుకాణాలను తొలగించగా, మట్టి వ్యర్థాల తొలగింపుకు 22 లక్షలు కేటాయించింది. ఈ పనుల నిమిత్తం 45.5 శాతం తక్కువ ధరకు టెండర్ దక్కించుకున్న హైదరాబాద్కు చెందిన సంస్థ, మట్టి వ్యర్థాల తొలగింపు పనులను ముమ్మరంగా ప్రారంభించింది. ఒక వారం రోజులలో మట్టి వ్యర్థాల తొలగింపు పూర్తి చేయాలని వేములవాడ మున్సిపల్ అధికారులు గడువు విధించారు. వేములవాడ పట్టణ వాసులకు, రాజన్న భక్తులకు అంతరాయం కలగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన రోడ్డు విస్తరణ వల్ల వేములవాడ పట్టణ అభివృద్ధికి, సుదూర ప్రాంతాల నుండి వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతం కానుందని అధికారులు పేర్కొన్నారు.

# వర్షాన్ని కూడా లెక్క చేయక అన్నదానం నిర్వహించిన ట్రస్ట్ సభ్యులు.

### అన్నార్తుల సేవలో ట్రస్ట్ సభ్యులు.
### మీ సేవలకు గులాం అంటున్న దాతలు.
### 1576 రోజులుగా పేదలకు, అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం.




**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** శనివారం రోజున వర్షం పడుతున్న లెక్క చేయక రాజన్న ఆలయం వద్ద తినడానికి తిండి దొరకని అన్నార్తులు మా కొరకు ఎదురు చూస్తుంటారు అన్న ఉద్దేశంతో వర్షాన్ని కూడా లెక్క చేయక ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఏకంగా ఆరుగురు సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం. మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1576 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున లక్ష్మీ గణపతి కాంప్లెక్స్, భీమేశ్వరాలయం, మరియు రాజన్న ఆలయ వద్ద పేదలకు, అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా కుమారుని మరియు కోడలు పుట్టినరోజు సందర్భంగా దొంతుల భాగ్యలక్ష్మి, మరియు శాశ్వత అన్నదాతల సహకారంతో ఈరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ బెజ్జంకి రవీందర్, వోడ్యాల వేణు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పొలాస రాజేందర్, తోట రాజు, పసుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



**అదిలాబాద్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి:**

జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలమేరకు శనివారం జిల్లా కేంద్రం లోని సుభాస్ నగర్, తాడిగూడ కాలని వాసులకు మున్సిపాలిటీ ఆద్వర్యం లో పులిహెూర ప్యాకెట్ లు అందజేశారు

# దరిపల్లి లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 16 ప్రజాబలం** ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురం కొత్తూరు గ్రామం శివారులో గల దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (బీటెక్ పాలిటెక్నిక్ ఎంబీఏ ఎంటెక్) నందు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా భక్తి ఉత్సాహంతో నిర్వహించారు ఉదయం ప్రాంగణం భక్తి గీతాలతో మారుమ్రోగింది. ప్రధాన అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దరివల్లి కిరణ్ జెండా జెండా ఊపి ఉట్టి కొట్టే వేడుకలనుప్రారంభించారు ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు ఈ వేడుకల్లో దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ కళాశాల కరస్పాండెంట్ దరిపల్లి స్వాతి కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎం.చిరంజీవి ఎన్ఎస్ఎస్ మరియు యుబిఏ కోఆర్డినేటర్ శిరీష వివిధ విభాగాల అధిపతులు శ్రీను వెంకట్రావు మానస ప్రియాంక పుల్లయ్య రవికుమార్ రవి కళాశాల సిబ్బంది ప్రసన్న శ్రీనివాస్ శ్రావణి మమత రహమతుల్లా రాంబాబు సాదిక్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# రైతు పుట్టినరోజు సందర్భంగా వినూత్న కానుకను బహుకరించిన మిత్రులు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దేశానికి స్వాతంత్రం వచ్చిన 15 ఆగస్టు రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన శాతరాజు పల్లి గ్రామానికి చెందిన రైతు మారు కిషన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన మిత్రులు, శాతరాజు పల్లి గ్రామస్తులు, రైతులు వినూత్న కానుకను బహూకరించారు. తెలంగాణ రాష్ట్రంలో రబీ పంటలు సాగు చేసుకునే సమయంలో రాష్ట్ర మొత్తంలో రైతులకు అత్యంత అవసరమైన యూరియా కొరత ఉన్నందున, రైతులు వేకువజాము నుండి యూరియా బస్తాల కోసం వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట, అన్నదాతలు బారులు తీరుతున్న విషయం అందరికీ తెలిసిందే. రైతులు వ్యవసాయ సహకార సంఘాల ఆఫీసు వద్దకు చేరుకొని యూరియా బస్తాల కోసం తమ వ్యవసాయ పాస్ పుస్తకాలను, ఆధార్ కార్డులను, చివరకు తమ పాదాలకు రక్షణ ఇచ్చే చెప్పులను కూడా వరుస క్రమంలో పెట్టి గంటల తరబడి వేచి ఉండి పడిగాపులు కాస్తున్నారు. ఎన్ని గంటలు పడిగాపులు కాసిన ఒక రైతుకు ఒకటే యూరియా బస్తాను అధికారులు అందించడం ఆ ఒక్క యూరియా బస్తా వ్యవసాయ అవసరాలకు సరిపోకపోవడంతో రైతులు గందరగోళానికి గురి అవుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతను శాతరాజు పల్లి రైతులు దృష్టిలో పెట్టుకొని తమ మిత్రుని పుట్టినరోజు కానుకగా మారు కిషన్ రెడ్డికి కేక్ కట్ చేసి,అందరూ కలిసి ఒక యూరియా బస్తాను కానుకగా ఇవ్వడం జరిగిందని రైతులు తెలిపారు. గతంలో యూరియా కోసం ఇంత కష్టం ఉండేది కాదని, ప్రస్తుత పరిస్థితులలో యూరియా కోసం పడిగా పలుకాసే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదనను వ్యక్తం చేశారు.

# రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి కొలువై ఉన్న పట్టణంలో శుక్రవారం రాత్రి నుండి ఎడతెరిపిలేని వర్షం కురుస్తున్నది. 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు, శ్రావణ శుక్రవారం, శనివారం రోజున కృష్ణాష్టమి సందర్భంగా రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు వేకువజాము నుండే పవిత్ర ధర్మగుండంలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరించి, క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామివారిని దర్శించుకుని, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు వర్షంలో తడిసి ముద్దవుతున్నారు. భక్తులు వర్షంలోనే స్వామి వారిని దర్శించుకుంటూ మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో రాజన్న ఆలయ అధికారులు చేతులెత్తేసినారు అని భక్తులు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారినాయి.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి కొలువై ఉన్న పట్టణంలో శుక్రవారం రాత్రి నుండి ఎడతెరిపిలేని వర్షం కురుస్తున్నది. 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు, శ్రావణ శుక్రవారం, శనివారం రోజున కృష్ణాష్టమి సందర్భంగా రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు వేకువజాము నుండే పవిత్ర ధర్మగుండంలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరించి, క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామివారిని దర్శించుకుని, కోడె మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులు వర్షంలో తడిసి ముద్దవుతున్నారు. భక్తులు వర్షంలోనే స్వామి వారిని దర్శించుకుంటూ మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో రాజన్న ఆలయ అధికారులు చేతులెత్తేసినారు అని భక్తులు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారినాయి.

# బొల్లారంలో ఎరువుల దుకాణం ప్రారంభం.

## పాల్గొన్న జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్ ఆది.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం )** శనివారం రోజున వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలో శివరాం గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో, అలాగే చందుర్తి మండల కేంద్రంలో శ్రీ తులసి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎరువుల, పురుగు మందుల దుకాణాలను వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుంది అన్నారు. రైతులకు ఎరువులను ప్యాక్స్, అగ్రోస్ వంటి కేంద్రాల ద్వారా సమృద్ధిగా పంపిణీ చేశాం. ఇకపై మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఐకెపి సెంటర్ల ద్వారా కూడా ఎరువుల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి సంకల్పబద్ధంగా పనిచేస్తుంది. గతంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నాయకత్వంలో రైతుల రుణమాఫీ జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రెండు లక్షల రూపాయల వరకు ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేపట్టిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పనితీరుపై విమర్శలు చేస్తూ అసమర్థత కారణంగా కొంతమంది రైతులకు రుణమాఫీ అందలేదన్నారు. రేషన్ కార్డుల ఆధారంగా కాకుండా వాస్తవ సమస్యలను దృష్టిలో ఉంచుకొని రుణమాఫీ కల్పించాం. వడగళ్ల వర్షం వల్ల పంట నష్టపోయిన రైతులకు గతంలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు కానీ ప్రజా ప్రభుత్వంలో ఒక లక్ష రూపాయలు నిధులను రైతుల కోసం ఖర్చు చేసింది అని తెలిపారు.



కేంద్ర ప్రభుత్వ వైఖరి పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ రాష్ట్రానికి సరిపడా యూరియా పంపిణీ చేయకుండా కేంద్రం వ్యవహరిస్తుందని అన్నారు. మోడీ మంకీ బాతులో ఎకరానికి ఒక బస్తా యూరియా వాడాలంటారు కానీ స్థానిక నేతలు ఎరువులు లేకపోతే ఏం చేయాలో చెప్పడం లేదు. ఎరువుల కొరతపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పరిష్కారానికి కృషి చేస్తుంది అన్నారు. అంతేకాక కొంతమంది నాయకులు రైతులను అడ్డం పెట్టుకొని రాజకీయ మైలేజ్ కోసం ప్రయత్నిస్తున్నారు ఇది బాధాకరమన్నారు. రైతులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదు అని హెచ్చరించారు.

రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ప్రతి ఒక్కరికి అవసరమైన ఎరువులు, నిధులు సమయానుకూలంగా అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అత్యవసర సహాయక చర్యల కోసం టోల్‌ఫ్రీ నంబర్లు ప్రజలకు జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి



**అదిలాబాద్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** శనివారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో, ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్‌ను మున్సిపాలిటీ టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు తక్షణ సహాయం, ఫిర్యాదుల పరిష్కారం కోసం క్రింది నంబర్లకు సంప్రదించవచ్చునని ఆయన సూచించారు:

జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్: 1800 425 1939

మున్సిపాలిటీ టోల్‌ఫ్రీ నంబర్: 94921 64153

ఈ నంబర్లకు కాల్ చేసి తమ సమస్యలను తెలియజేయడం ద్వారా వెంటనే స్పందనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఇప్పటికే ఆదేశించామని కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, భారీ వర్షాల నేపథ్యంలో ఎవ్వరూ అవసరం లేకుండా బయటకు రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే తగిన జాగ్రత్తలతో బయటకు రావాలని సూచించారు. వర్షం తగ్గే వరకు తగిన భద్రతా చర్యలు తీసుకుంటూ, ప్రభుత్వ సహాయ కేంద్రాల నుండి అందించే సమాచారం, సూచనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# వర్షం కారణంగా నీరు చేరి ఇబ్బంది పడుతున్నా ప్రాంతాలను పరిశీలన

## డిసిపి పరిశీలన



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్టు 16 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణంతో పాటు మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో వర్షం కారణంగా నీరు చేరి ఇబ్బంది పడుతున్న ఇండ్లను చెరువులను మంచిర్యాల డిసిపి భాస్కర్ పరిశీలించారు.ప్రజలు అధైర్య పడొద్దని ఎలాంటి ఇబ్బంది ప్రమాదాలు ఉన్న పోలీసులకు అధికారులకు తెలియజేయాలన్నారు.పోలీసులు వరద కారణంగా ఇబ్బదులు ఉన్న ప్రాంతాలను గుర్తించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు.పోలీస్ సిబ్బందికి పలు సలహాలు సూచనలు ఇచ్చారు.డిసిపి వెంట సీఐ రమణమూర్తి,ఎస్సై జి సురేష్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## ఖమ్మం బిజెపి కార్యాలయంలో వాజపేయి 6వ వర్ధంతి

### వాజపేయి మాటలు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచాయి.

### బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.





**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 16 (ప్రజాబలం) ఖమ్మం** మాజీ ప్రధాని వాజపేయి దేశ రాజకీయాలలో కవిసహృదయ నేతగా గుర్తింపు పొందిన అటల్ బిహారీ 6వ వర్ధంతి సందర్భంగా శనివారం ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు వాజపేయి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ వాజపేయి భారత రాజకీయాలను సేవామార్గంలో నడిపించిన మహానేత అని కొనియాడారు రాజకీయాలు అధికార సాధనం కాదు, సేవా సాధనమే కావాలి అని ఆయన చెప్పిన మాటలు ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా నిలిచాయని గుర్తుచేశారు. దేశ సమగ్ర అభివృద్ధికి దారితీసిన పొఖ్రాన్ అణు పరీక్షలు, గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రహదారి ప్రాజెక్టులు వాజపేయి దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు వాజపేయి వ్యక్తిత్వం, వాక్చాతుర్యం, కవిత్వం, ప్రజాస్వామ్యానికి ఆయన చూపిన కట్టుబాటు ఆయనను ప్రపంచ నాయకుడిగా నిలబెట్టిందని కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఆయన కలల భారత్ సాధనలో బీజేపీ కార్యకర్తలు తాము కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గంటేల విద్యాసాగర్, అల్లిక అంజయ్య , వేరేల్లి రాజేష్ ,మేకల నాగేందర్, ఆర్ వి ఎస్ యాదవ్, గడిల నరేష్, వాకదాని రామకృష్ణ , జ్యోతుల యుగంధర్, రుద్రగాని మాధవ్, తోడుపునూరి రవీందర్, శ్రీ రామనేని, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, పాలేపు రాము,బండ్ల రీగన్, కుమిలి శీను, అప్పారావు తదితరులు పాల్గొని వాజపేయి సేవలను స్మరించారు

## అందోల్ జోగిపేట లో జాతీయ జెండాకు అవమానం

### తలక్రిందులుగా జెండా ఆవిష్కరణ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 16 (ప్రజబలం )సంగారెడ్డి జిల్లా :** 79 వ స్వాతంత్ర దినోత్సవం వేడుకల సందర్భంగా, జాతీయ జెండాను తలక్రిందులుగా ఆవిష్కరించారు, ఈ ఘటన అందోల్ మండలం జోగిపేట పట్టణంలో చోటుచేసుకుంది, జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియం భవనం వద్ద ఉన్న, తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ సమైక్య భవనం వద్ద, అధికారిని నికిత, ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేశారు, ఈ వేడుకల్లో జండా ఆవిష్కరణ కార్యక్రమంలో, జాతీయ పతాకానికి అవమానం జరిగింది, అధికారిణి జాతీయ జెండాను తలక్రిందులుగా ఆవిష్కరించారు, తలకిందులుగా ఉన్న జెండాను గమనించకుండానే వేడుకలను నిర్వహించారు, అనంతరం సిబ్బంది భవన కార్యాలయానికి తాళం వేసి ఎక్కడి వాళ్ళు అక్కడ జారుకున్నారు, జోగిపేట ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియం భవనంలోని, తెలంగాణ రాష్ట్ర పడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమైక్య కార్యాలయం ఎదుట, జాతీయ జెండాకు అవమానం జరిగినట్లు గుర్తించిన స్థానికులు, మీడియాకు సమాచారాన్ని అందించారు, కార్యాలయ అధికారులు జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేయడంపై స్థానికులు మండిపడుతున్నారు, ఇదిలా ఉంటే అధికారులు మాత్రం తమ తప్పును కప్పి పుచ్చుకొనే ధోరణిలో మాట్లాడారు, ఉదయం తాము జాతీయ జెండాను ఆవిష్కరించినప్పుడు, సరిగానే ఎగురవేశామన్నారు, తామంతా మధ్యాహ్న సమయంలో భోజనానికి వెళ్ళినప్పుడు, ఎవరో ఇలా చేసి ఉంటారని బుకాయించారు, విషయం తెలుసుకున్న వెంటనే కార్యాలయానికి వచ్చి సుసెసరికి జండా తలకిందులుగా ఉందని సిబ్బంది చెప్పుకొచ్చారు, ఎవరో కావాలని జాతీయ జెండాను ఇలా అవమానపరిచేలా తలకిందులుగా ఎగురవేశారంటూ, పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమైక్య సిబ్బంది అన్నారు, తలకిందులుగా ఉన్న జెండాను సిబ్బంది తిరిగి సజావుగా ఎగురవేశారు, ఈ ఘటనపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు, డైరీ సిబ్బంది తెలిపారు, ఏది ఏమైనప్పటికీ జాతీయ జెండాను, తలకిందులుగా ఎగురవేయడంపై తీరంగ జెండాకు అవమానం జరిగిందని ప్రజా తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు, ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేసి, ఈ దారుణ ఘటనకు పాల్పడ్డ ఆకతాయిలను గుర్తించి శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు, జాతీయ జెండాకు జరిగిన అవమానంపై, నిజంగా ఇది ఆకతాయిల పనేనా, లేక తెలంగాణ పాడి పరిశ్రమ, అభివృద్ధి సహకార సమైక్య విజయ డైరీ,అధికారుల తప్పిదమా అని పోలీసులు తేల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు....






## కొర్విచెల్మ రాకపోకలు బందు

### నీట మునిగిన పొలాలు







మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ గ్రామంలో అకాల వర్షం కారణంగా గ్రామంలో నుండి బయటకు వెళ్దామంటే ఊరికి బయట ఉన్న వంతెన చిన్న ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడిన ప్రజలు, అంతేకాకుండా కొమ్ముగూడెం చెరువు నుండి వస్తున్న నిట ప్రవాహానికి నిట మునిగిన రైతుల పోలాలు సంభందిత అధికారులు వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరడమైనది.

## దివ్యాంగుల పెట్రోల్ బంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల, బొప్పాపూర్ లోని అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### డిస్టిక్ అడ్మినిస్ట్రేషన్ ఫిల్లింగ్ స్టేషన్ తనిఖీ



**రాజన్న సిరిసిల్ల జిల్లా/ ఎల్లారెడ్డిపేట, ఆగస్టు – 16( ప్రజాబలం ప్రతినిధి)**దివ్యాంగుల పెట్రోల్ బంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు నిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బై పాస్ రోడ్ లో ఉన్న డిస్టిక్ అడ్మినిస్ట్రేషన్ ఫిల్లింగ్ స్టేషన్ ను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న దివ్యాంగుల తో మాట్లాడి, వారికి ఎదురవుతున్న సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మరింత ముందుకు తీసుకొని వెళ్లడానికి టర్నోవర్ పెంచడానికి అన్ని ప్రభుత్వ వాహనాలను ఇక్కడే డీజిల్ పెట్రోల్ పోయించుకోవాలని అందరికీ సూచించాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం ను ఆదేశించారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు, వ్యక్తిగత వాహనాలు ఇక్కడ లభించే నాణ్యమైన, డీజిల్ పెట్రోల్ని తీసుకొని దివ్యాంగులకు ఆర్థిక పునరావాసంలో అందరూ భాగస్వాములు అవ్వాలని పిలుపు ఇచ్చారు. అలాగే ఇక్కడ ఉన్న పరిస్థితులను పరిశీలించి వ్యాపార దృక్పథంతో మరింత ముందుకు వెళ్లడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రం తనిఖీఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లోనిఅంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందిస్తున్న సేవలు గురించి ఆరా తీశారు. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం గురించి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు.. లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

## మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయ్ వర్ధంతి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్ట్ 16:**భారత రత్న భారత మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజ్ పేయి వర్ధంతిని పట్టణ బి.ఏం.ఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మంచిర్యాల జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ మాట్లాడుతూ భారతదేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి దేశం కోసం దేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారని గొప్ప గొప్ప ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. పాకిస్తాన్ దేశంలో బస్సు యాత్ర నిర్వహించారని ఐక్యరాజ్యసమితిలో హిందీలో ప్రసంగించారని అలాంటి మహెూన్నత వ్యక్తి వాజ్ పాయ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, సీనియర్ నాయకులు డి.వి దీక్షితులు, మల్యాల రాజమల్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి కర్రావుల వినయ్, ఉపాధ్యక్షులు ఓదెలు. శనిగరపు శ్రీనివాస్, కార్యదర్శి దుర్గం సత్యంబాబు, నాయకులు పోచంపల్లి శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్లూరు గ్రామంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 16( ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లిమండలం పట్లూర్ గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. హనుమాన్ దేవాలయం నుండి పుర విధులగుండా ఊరేగింపు చేస్తూ కోలాటం, చక్రి బజనలు చేస్తూ ఉత్సహంగా గ్రామ ప్రజలు అందరు పాల్గొన్నారు,అంత కు ముందు హనుమాన్ దేవాలయం లో పూజలు నిర్వహించి కార్యక్రమం ప్రారంభించారు. చిన్నారులు నిర్వయించిన భారత నాట్యం నృత్యాలు ప్రజలను ఆకర్శించాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ అంగరంగ వైభవంగా కన్నుల పండుగలా గ్రామ ప్రజలందరూ సంతోషంగా జరుపుకున్నారని అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషం అని గ్రామ ప్రజలకు చిన్న లకు పెద్దలు అందరూ ఇలాగే ప్రతి పండగ



జరుపుకోవాలని మాజీ సర్పంచ్ దేవరదశి ఇందిరా అశోక్ సంతోషం వ్యక్తపరిచారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com